


తెలుగు జాతీయ దినపత్రిక

# అక్షర విజేత

నిజం నిర్భయం నిష్పక్షం

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక




హైదరాబాద్ సంపుటి:06 సంచిక :22 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజిలు : 12, వెల. 6రూ/ గురువారం- 02 - అక్టోంబర్ - 2025

## పాకిస్థాన్‌పై ఆపరేషన్ ఎందుకు ఆపారు?




కేంద్రాన్ని ప్రశ్నించిన ఒవైసీ

పాక్ పై ఆపరేషన్ ఎందుకు ఆగిపోయిందో అర్థం కావడం లేదన్న ఒవైసీ

తనకు కలలు కనే అలవాటు లేదని వ్యాఖ్య

తమ లక్ష్యం కేవలం పదవులు చేపట్టడం కాదన్న ఒవైసీ

## బీఆర్ఎస్ పార్టీతో నాకు ఎలాంటి సంబంధం లేదు



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

బీసీ రిజర్వేషన్ల బిల్లుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్న కవిత

రెండు నెలలు ఆగి ఎన్నికలు పెడితే వచ్చే నష్టమేంటని ప్రశ్న

కోర్టులను ఈటల తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శ

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసమే తమ పోరాటమని ఆమె స్పష్టం చేశారు. - మిగతా 2 లో

# జూబ్లీహిల్స్ బైపోల్ వార్

- గెలుపు గుర్రానికే కాంగ్రెస్ ఛాన్స్
- జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై మహేష్ కుమార్ గౌడ్‌తో రేవంత్ రెడ్డి సమావేశం
- గెలుపు గుర్రాన్ని ఎన్నికలో నిలబెట్టాలని వెల్లడి
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అభ్యర్థి ఎంపికపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులతో సమాలోచనలు
- ఇప్పటికే బీఆర్ఎస్ తమ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతను ప్రకటించింది
- త్వరలో ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం



జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో అభ్యర్థి ఎంపికపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులతో సమాలోచనలు ప్రారంభించింది. ఇప్పటికే బీఆర్ఎస్ తమ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతను ప్రకటించింది. త్వరలో ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. ఈ తరుణంలో కాంగ్రెస్ పార్టీ కూడా తమ అభ్యర్థిని ప్రకటించాలని ఆలోచన చేస్తోంది. ఇందులో భాగంగానే ఇవాళ రేవంత్ రెడ్డితో జూబ్లిహిల్స్‌లోని ఆయన నివాసంలో సమావేశమైన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు గడ్డం వివేక్ వెంకట స్వామి, పొన్నం ప్రభాకర్‌లు - మిగతా 2 లో

## ఏపీకి తీవ్ర వాయుగుండం ముప్పు



రాగల 12 గంటల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం

రాగల 12 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం

అనంతరం తీవ్ర వాయుగుండంగా మారుతుందని హెచ్చరించింది

మత్స్యకారులు 4 రోజుల పాటు వేటకు వెళ్లవద్దని సూచించారు

తీర ప్రాంతాల్లోని అన్నిపోర్టులకు ప్రమాద హెచ్చరికలు జారీ

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాగల 12 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. అనంతరం తీవ్ర వాయుగుండంగా మారుతుందని హెచ్చరించింది. ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటే అవకాశముందని పేర్కొంది. - మిగతా 2 లో

# మెరుగైన పాలనతో ప్రజలకు ప్రయోజనం

- వ్యవస్థలను బాగు చేస్తున్నాం
- సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామన్న సీఎం
- విజయనగరం జిల్లా దత్తి గ్రామంలో పింఛన్లు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు
- పింఛన్‌తో మాత్రమే సరిపెట్టకుండా సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామని వెల్లడి
- విజయనగరం జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు
- రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నామని వెల్లడి
- వందలో 13 మందికి పింఛను ఇస్తున్నామని అందులో 59 శాతం మహిళలకే అందిస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు




ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. విజయనగరం జిల్లా దత్తి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసిన అనంతరం ప్రజావేదికలో గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడారు.మానవత్వంతో ఆలోచించి పింఛన్ అందిస్తున్నామని తెలిపారు. ప్రతి నెలా ఒక గ్రామానికి వచ్చి నేరుగా పర్యవేక్షిస్తున్నానని, అందులో భాగంగానే ఈ గ్రామానికి వచ్చానని సీఎం అన్నారు.దేశంలో 29 రాష్ట్రాలు ఉన్నాయని ఉత్తరప్రదేశ్‌లో కేవలం రూ.500 మాత్రమే పింఛను ఇస్తున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. వందలో 13 మందికి పింఛను ఇస్తున్నామని అందులో 59 శాతం మహిళలకే అందిస్తున్నామని వెల్లడించారు. ఒక్క పింఛన్‌తో మాత్రమే సరిపెట్టకుండా సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామని అన్ని పథకాలు అమలు చేశామని వివరించారు. ఆడబిడ్డలు కష్టపడకూడదని ఆనాడు దీపం పథకం ద్వారా గ్యాస్ సిలిండర్లు ఇచ్చామని అలానే ఈనాడు ఉచితంగా - మిగతా 2 లో

## ఈ కేసులన్నీ ఒక్క రోజులో పోయేవే: మిథున్ రెడ్డి




తనపై అక్రమ కేసులు పెట్టారన్న మిథున్ రెడ్డి

జగన్ కోసం ఎన్ని కేసులైనా ఎదుర్కొంటామని వ్యాఖ్య

రాబోయేది జగనన్న ప్రభుత్వమేనని ధీమా

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మమ్మల్ని వేధించడం, మాపై కేసులు పెట్టడం మామూలే

## వ్యక్తిత్వ వికాసంతోనే దేశ నిర్మాణం

# అదే ఆర్ఎస్ఎస్ మార్గం

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ
- ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ
- వ్యక్తిత్వ వికాసం ద్వారా దేశ నిర్మాణానికి పాటుపడే సంస్థ అని కొనియాడిన ప్రధాని
- 'నేను' నుంచి 'మనం' వైపు నడిపించే స్ఫూర్తిదాయక సంస్థగా అభివర్ణన
- సంఘ్ పై ఎన్నో కుట్రలు జరిగినా ఎదుర్కొని నిలబడిందని వ్యాఖ్య
- వ్యక్తిత్వ నిర్మాణానికి శాఖలు పవిత్ర వేదికలని కితాబు
- భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ ఆత్మ అని, ఒకవేళ ఈ మూల సూత్రమే దెబ్బతింటే భారత్ బలహీనపడుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు



రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) మొదటి నుంచి దేశ నిర్మాణమనే ప్రధాన లక్ష్యంతోనే పనిచేస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొనియాడారు. తన లక్ష్యాన్ని సాధించే దిశగా ఆర్ఎస్ఎస్ దీర్ఘకాలంగా నిబద్ధతతో ముందుకు సాగుతుండటం చాలా గొప్ప విషయమన్నారు. గత శతాబ్ద కాలంలో లెక్కలేనంత మంది జీవితాలకు దశను, దిశను చూపించి, వారిని బలోపేతం చేసిన ఘనత ఆర్ఎస్ఎస్‌దే అని ప్రధాని పేర్కొన్నారు. నదీతీరాల్లో మానవ నాగరికతలు విలసిల్లిన విధంగానే, ఆర్ఎస్ఎస్‌లో సంగమించి, దాని ప్రవాహ స్రవంతిలో మమేకమై ఎంతో మంది వికసించారని తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన ఆర్ఎస్ఎస్ శత వార్షికోత్సవాల్లో మోదీ ప్రసంగించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన ఒక పోస్టల్ స్టాంపును, రూ.100 నాణేన్ని విడుదల చేశారు. - మిగతా 2 లో

## రాజుల నుంచి పారిశ్రామికవేత్తల వరకు...తగ్గని శ్రీవారి కానుకల వైభవం

శతాబ్దాలుగా కొనసాగుతున్న శ్రీవారికి కానుకల సమర్పణ

శ్రీకృష్ణదేవరాయల కాలంలో అపూర్వ ఆభరణాల బహూకరణ

వివిధ మతాల వారు కూడా సమర్పించిన విలువైన కానుకలు

ఆధునిక కాలంలోనూ కోట్లాది రూపాయల విలువైన కిరీటాలు, హారాలు

భక్తికి, విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తున్న శ్రీవారి ఆభరణాలు

12వ శతాబ్దం నుంచే శ్రీవారికి కానుకలు అందించే సంప్రదాయం ఉన్నప్పటికీ, విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల పాలనలో ఇది శిఖరస్థాయికి చేరింది




## పీవోకేలో పాక్ సైన్యం అరాచకం... ఆందోళనకారులపై కాల్పులు




10 మంది మృతి

ప్రాథమిక హక్కుల కోసం పీవోకేలో ఆందోళన చేస్తున్న స్థానికులు

స్థానికుల ఆందోళనలతో మూడ్రోజులుగా అట్టుడుకుతున్న పీవోకే

పీవోకేలో మౌలిక సంస్కరణలు తీసుకురావాలని తమ 38 డిమాండ్లను అమలు చేయాలని ఏఏసీ ఆందోళనలకు పిలుపునిచ్చింది

మరోపైపు పాక్ తమ భూభాగంలో భారీ స్థాయిలో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లు నిర్వహిస్తోంది

# పాక్‌పై ట్రంప్ మోజు!



మళ్లీ ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి వైభవం పునరావృత మవు తుందని బహుశా పాకిస్తాన్ ఇన్ని దశాబ్దాల్లో ఎప్పుడూ ఊహించి వుండదు. ఆ దేశ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌ను స్వల్ప వ్యవధిలో మూడు సార్లు వైట్‌హౌ స్‌కు ఆహ్వానించి గౌరవించటం, నాలుగు రోజుల నాడు మునీర్‌తోపాటు ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సాదరంగా హత్తుకోవటం పాకిస్తాన్ దృష్టిలో చిన్న విషయాలేమీ కాదు. పైగా వారిద్దరికీ ట్రంప్ నుంచి దండిగా ప్రశంసలు దక్కాయి.ఒక పాక్ ప్రధాని అమెరికా అధ్యక్షుణ్ణి కలుసుకుని మాట్లాడటం 2019 తర్వాత ఇదే తొలిసారి. అలాగని పాకిస్తాన్‌ను ఎప్పుడూ పూర్తిగా దూరం పెట్టింది లేదు. ప్రపంచం నలుమూలలా గాలిస్తున్న ఉగ్రవాది బిన్ లాడెన్‌కు పాక్ ఆశ్రయమివ్వటం వంటి ఉదంతాలు అమెరికాకు ఆగ్రహం కలిగించినా, ప్రచ్ఛన్నయుద్ధ కాలం నాటి పాక్ సహకారాన్ని అమెరికా మరువదల్చుకోలేదు. అదే సమయంలో మనం నొచ్చుకోకుండా ఉండేందుకు ఆ దేశాన్ని కాస్త దూరం పెట్టినట్టు కనబడేది.ట్రంప్ తొలిసారి అధికారంలో కొచ్చినప్పుడు పాకిస్తాన్ పేరు చెబితే భగ్గుమనే వారు. అనంతరం వచ్చిన జో బైడెన్ సైతం పాకిస్తాన్‌ను తగినంత దూరంలోనే పెట్టారు. కానీ రెండోసారి అధికారంలో కొచ్చాక ట్రంప్ వైఖరి మారింది. భారత్ తన ఆదేశాలను శిరసా వహించటం లేదన్న అక్కసుతోపాటు స్వప్రయోజనాలపై దృష్టి పడింది. అందుకే పాకిస్తాన్‌కు అతిగా ప్రాధాన్యమిస్తున్నారు. ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.గత కాలపు చెలిమికీ, వర్తమాన సాన్నిహిత్యానికీ చాలా తేడా ఉంది. అప్పట్లో మన దేశం సోవియెట్ యూనియన్‌కు సన్నిహితంగా ఉండటం, తన ఒత్తిళ్లకు లొంగకపోవటం తదితర కారణాలతో ఆసియాలో అమెరికాకు పాకిస్తానే దిక్కయ్యేది. ప్రస్తుత పరిస్థితి వేరు. ట్రంప్‌కు ఇప్పుడు దేశ ప్రయోజనాల కన్నా స్వీయ ప్రయోజనాలే ముఖ్యం. మాజీ అధ్యక్షుడు ఒబామా మాదిరే తనకూ నోబెల్ బహుమతి వచ్చితీరాలని ఆయన పట్టు దలగా ఉన్నారు.భారత్ – పాక్ యుద్ధంతో సహా ప్రపంచవ్యాప్తంగా ఏడు ఘర్షణలు ఆపాననీ, అందువల్ల శాంతి బహుమతికి తాను అర్హుడిననీ ఆయన తరచూ చెప్పుకుంటు న్నారు. మధ్యమధ్యన మాట మార్చినా భారత్%–%పాక్‌లు రెండూ చర్చించుకోబట్టే యుద్ధం ఆగిందని ట్రంప్ స్వయంగా మూడు నాలుగు దఫాలు అన్నారు. మునీర్ సైతం ఘర్షణలు నిలపాలన్నది ఇరు దేశాల నిర్ణయమని తెలిపారు. ఇప్పుడు ట్రంప్ అబద్ధానికి పాక్ వంత పాడుతోంది.ట్రంప్ కోరుకుంటున్నవి ఇంకా చాలా ఉన్నాయి. అందులో ఖనిజాలు ప్రధాన మైనవి. పాక్ భూగర్భంలో అపార ఖనిజ సంపద ఉంది. బంగారం, రాగి, మాంగనీస్, క్రోమైట్ వగైరా 92 రకాల ఖనిజాలు అక్కడ లభ్యమవుతాయని చైనా ఖనిజాభివృద్ధి సంస్థ పరిశోధనలు తేల్చిచెప్పాయి. ఇవిగాక ఏఐ, ఎలక్ట్రిక్ కార్లు వగైరాల్లో ఉపయోగపడే కీలక ఖనిజాలున్నాయి. ఇందులో అధికభాగం ఉగ్రవాదుల హవా సాగుతున్న బలూచిస్తాన్, ఖైబర్ ఫక్తున్‌ఖ్వా ప్రాంతాల్లో ఉన్నాయి.అందుకే ఖనిజ సంపద ద్వారా పాక్‌కు సమకూరే ఆదాయం 2 శాతం మించటం లేదు. నిరుడు పాకిస్తాన్ 521 ఉగ్రదాడులు ఎదుర్కొంది. అక్కడ విద్యుత్ కొరత కూడా తీవ్రంగా ఉంది. ఖనిజశుద్ధి పరిశ్రమలు స్థాపిస్తామంటేనే గనులు అప్పజెబుతామని పాక్ ఆశ చూపుతున్నా ఉగ్ర వాదం, విద్యుత్ సంక్షోభం కారణాలుగా చూపి ఏ దేశమూ ముందుకు రావటం లేదు. ఇప్పుడు ఆ ఖనిజ సంపదపై ట్రంప్ కన్నుపడింది. ఇదిగాక ట్రంప్ కుటుంబ భాగస్వామ్యం ఉన్న లిబర్టీ ఫైనాన్షియల్ సంస్థ నడిపే క్రిప్టో కరెన్సీ లావాదేవీలకు పాక్ అనుమతులిచ్చింది. ఆ దేశంపై మోజు పెరగటంలో వింతేముంది?పాకిస్తాన్‌లో ప్రజా ప్రభుత్వం ఉండగా, ట్రంప్ దాన్ని బేఖాతరు చేసి సైనిక దళాల చీఫ్‌కు ప్రాధాన్యమిచ్చి వ్యవహారాలు చక్కబెట్టుకోవటం ఆందోళనకరం. పాక్ సైన్యం అమెరికా ఒత్తిడి పర్యవసానంగా గత రెండు దశాబ్దాల నుంచి ప్రభుత్వంలో ప్రత్యక్ష జోక్యాన్ని తగ్గించుకుంది. తెరవెనక మంత్రాంగానికే పరిమితమైంది. కానీ ట్రంప్ పుణ్యమా అని మళ్లీ సైన్యం ప్రభావం పెరుగుతోంది. ఇది ఆ దేశానికి మాత్రమే కాదు... పొరుగునున్న మనకు కూడా ప్రమాదకరమైన పరిణామం. మన ప్రభుత్వం దీన్ని పరిగణనలోకి తీసుకోక తప్పదు.

# మెరుగైన పాలనతో ప్రజలకు ప్రయోజనం

**మొదటిపేజీ తరువాయి** – ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని వెల్లడించారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించామని సీఎం చంద్రబాబు తెలిపారు.ఆదాయాన్ని పెంచడం ఆలోచన: రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చని అలానే ఈ పథకం ప్రారంభించిన 45 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 10 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని సీఎం వివరించారు. డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చింది టీడీపీ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. డ్వాక్రా రుణాలు తీసుకున్న ఆడ బిడ్డలు తిరిగి కడుతున్నారని కానీ పెద్ద పెద్ద వాళ్లు తీసుకున్న రుణాలు కట్టడం లేదు. ఆదాయాన్ని పెంచడం కోసం కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తోందని రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని స్పష్టం చేశారు."విశాఖ స్టీల్‌ప్లాంట్ కాపాడి రూ.11,400 కోట్లు ఇప్పించాం. విశాఖ ఐటీ హబ్‌గా మారబోతోంది. ప్రపంచస్థాయి కంపెనీలు విశాఖకు తరలివస్తాయి. చివరివరకు పేదవాళ్ల కోసమే పనిచేస్తాను అలానే




కష్టాలు లేని సుపరిపాలన అందిస్తాం. ఆడబిడ్డలు ఆర్థికంగా ఎదగాలన్నదే మా ఉద్దేశం. మెప్మా కింద 22 లక్షల మంది ఉన్నారు. రూ.10 వేల కోట్లు పొదుపు ఉంది. పేదవాళ్ల కోసం అన్న క్యాంటీన్లు ఇంకా పెంచుతాం. ఉత్తరాంధ్రలో రూ.2 వేల కోట్లు ఖర్చుపెట్టి వందశాతం అన్ని ప్రాజెక్టులు పూర్తిచేస్తున్నాం.'ఇప్పటికే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు: రైతు ఆదాయం పెరగాలని సీఎం చంద్రబాబు చెప్పారు. ఒకప్పుడు రైతును పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. అలానే ప్రజల ఆహారపు అలవాటలు మారాలని సూచించారు. విజయనగరం జిల్లా పేదరికంలో ఉందని తగినంత సాగునీరు లేదు కానీ కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందని చెప్పారు. ఇప్పటికే రైతు భరోసా ఒక్కో రైతుకు రూ.6 వేలు వేశామని ఇంకా రూ.14 వేలు వేస్తామని వెల్లడించారు.యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని ఏడాదిలోనే మెగా డీఎస్సీ నిర్వహించామని అన్నారు. యువతకు అండగా ఉంటూ ఉద్యోగాలు కల్పించే బాధ్యత నాదని సీఎం హామీ ఇచ్చారు. ఈ 15 నెలల్లో 4,71,574 మందికి ఉద్యోగాలిచ్చామని ఇప్పటికే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తద్వారా 9 లక్షల ఉద్యోగాలు వస్తాయని సీఎం చంద్రబాబు వివరించారు.

# ఏపీకి తీవ్ర వాయుగుండం ముప్పు

**మొదటిపేజీ తరువాయి** – దీని ప్రభావంతో విజయనగరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, యానాం, కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశముందని అధికారులు తెలిపారు. అదే విధంగా ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, అల్లూరి, మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అన్నారు. మత్స్యకారులు 4 రోజుల పాటు వేటకు వెళ్లవద్దని సూచించారు. తీర ప్రాంతాల్లోని అన్నిపోర్టులకు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు.గోదావరికి పెరిగిన వరద: గోదావరికి వరద మరింత పెరిగింది. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద 13.6 అడుగులకు నీటిమట్టం చేరింది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. డెల్టా కాల్వలకు 13,200 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. సముద్రంలోకి 12.59 లక్షల క్యూసెక్కుల ప్రవాహం విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వరద ఉద్ధృతితో కోనసీమ లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. లంక గ్రామాల ప్రజల మరపడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్‌కు వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి వరద తగ్గుముఖం పడుతోంది. వరద ఉద్ధృతి తగ్గడంతో 10 గేట్లను 20 అడుగులకు తగ్గించి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 5 లక్షల 46 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. 5 లక్షల 34 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 5 వేల క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35 వేల క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 28 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.10 స్పిల్ వే గేట్లను 20 అడుగులు ఎత్తి 4 లక్షల 64 వేల740 క్యూసెక్కులు నాగార్జునసాగర్?కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 883 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 204.78 టీఎంసీలుగా కొనసాగుతోంది.



# వ్యక్తిత్వ వికాసంతోనే దేశ నిర్మాణం అదే ఆర్ఎస్ఎస్ మార్గం

**మొదటిపేజీ తరువాయి** –

1963లో రిపబ్లిక్ డే పరేడ్‌లో ఆర్ఎస్ఎస్ వాలంటీర్లు నిర్వహించిన మార్చ్ ఫొటోతో ఆర్ఎస్ఎస్ శత వార్షికోత్సవ స్మారక స్టాంపును రూపొందించడం ఆనందకర అంశమని ప్రధాని తెలిపారు. భారతమాత ఫొటోతో తొలిసారిగా ఒక నాణేన్ని విడుదల చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. వరద్ ముద్రలో సింహంపై కూర్చున్న భారతమాతకు స్వయం సేవకులు శిరస్సు వంచి నమస్సులు చేస్తుండటం రూ.100 కాయిన్‌పై ప్రింట్ చేశారని మోదీ పేర్కొన్నారు.

**భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ ఆత్మ**

భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ ఆత్మ అని, ఒకవేళ ఈ మూల సూత్రమే దెబ్బతింటే భారత్ బలహీనపడుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఆర్ఎస్ఎస్ బలంగా నిలబడిందని, అలుపెరగకుండా దేశానికి సేవలు అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. దేశ సేవ, సామాజిక సాధికారత కోసం ఆర్ఎస్ఎస్ వాలంటీర్లు ఎనలేని త్యాగాలు చేశారని చెప్పారు. సమాజంలోని విభిన్న వర్గాల అభ్యున్నతి కోసం ఆర్ఎస్ఎస్ పనిచేస్తోందని, దేశ నిర్మాణం అనే ప్రధాన లక్ష్యంతో పనిచేస్తున్నందు వల్లే ఈ దిశగా పనిచేసే క్రమంలో ఎలాంటి వైరుధ్యాలూ రావడం లేదని ప్రధాని చెప్పారు. ఆర్ఎస్ఎస్ పరిధిలో ఎన్నో అనుబంధ సంస్థలు, సంఘాలు ఉన్నాయని, కేవలం 'నేషన్ ఫస్ట్' లక్ష్యం కోసమే అవన్నీ ఏకమై పనిచేస్తున్నాయని తెలిపారు.

'ఒక భారత్, గొప్ప భారత్' అనే అంశాన్ని ఆర్ఎస్ఎస్ నమ్ముతుందని, అయినప్పటికీ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాతి కాలంలో ఈ సంస్థను జాతీయ స్థాయిలో కనిపించకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేశారని తెలిపారు."సరిగ్గా 100 ఏళ్ల క్రితం విజయదశమి పండుగ రోజునే ఆర్ఎస్ఎస్ ఏర్పాటైంది. రేపు మనమంతా విజయదశమిని జరుపుకోబోతున్నాం. చెడుపై మంచి గెలుపునకు, అన్యాయంపై న్యాయం విజయానికి, చీకట్లను చీల్చే వెలుగు తేజానికి ప్రతీక ఈ పండుగ. ఇలాంటి గొప్ప, సమున్నత లక్ష్యాలతోనే ఆర్ఎస్ఎస్ ఆనాడు ఆవిర్భవించింది. శతాబ్దాల తరబడి బ్రిటీష్ వారి బానిస సంకెళ్లలో దేశం బందీగా ఉన్నందువల్ల భారతీయుల ఆత్మ గౌరవం, ఆత్మ విశ్వాసం తగ్గిపోయాయి. దేశ ప్రజల్లో వీటిని మళ్లీ పెంచేందుకు ఆర్ఎస్ఎస్ చాలా పని చేసింది. భారతీయుల ఆలోచనల నుంచి ఆత్మన్యూనతా భావాన్ని పారదోలేందుకు ఈ సంస్థ ఎంతో కృషి చేసింది. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు కేబీ హెడ్గేవార్ పాద పద్మాలకు వినమ్రమైన మనస్సుతో నివాళులు అర్పిస్తున్నాను. ఆయనే మాకు రోల్ మోడల్. స్ఫూర్తి ప్రదాత. కేబీ హెడ్గేవార్ ఆరాధనీయుడు. ఆర్ఎస్ఎస్ 100 ఏళ్ల వేడుకల్లో భాగమయ్యే అవకాశం దక్కడం మా తరం ఆర్ఎస్ఎస్ వాలంటీర్ల అదృష్టం. ఈ సందర్భంగా దేశ సేవకు అంకితమైన లక్షలాది ఆర్ఎస్ఎస్ వలంటీర్లకు నా అభినందనలు" అని ప్రధాని మోదీ తెలిపారు.

# రాజుల నుంచి పారిశ్రామికవేత్తల వరకు..తగ్గని శ్రీవారి కానుకల వైభవం

**మొదటిపేజీ తరువాయి** –

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిపై భక్తికి, సమర్పించే కానుకలకు యుగాల చరిత్ర ఉంది. రాజుల కాలం నుంచి నేటి ఆధునిక పారిశ్రామికవేత్తల వరకు, హిందూ మతస్థులే కాకుండా ఇతర మతాల వారు సైతం ఏడుకొండలవాడికి విలువైన ఆభరణాలను సమర్పిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. ఈ కానుకల వెనుక ఉన్నది కేవలం బంగారం, వజ్రాల విలువ కాదు.. యుగాలుగా కోట్లాది భక్తులు స్వామివారిపై కురిపిస్తున్న అచంచలమైన భక్తి, విశ్వాసం.

**12వ శతాబ్దం నుంచి శ్రీవారికి కొనసాగుతున్న కానుకలు**

12వ శతాబ్దం నుంచే శ్రీవారికి కానుకలు అందించే సంప్రదాయం ఉన్నప్పటికీ, విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల పాలనలో ఇది శిఖరస్థాయికి చేరింది. ఆయన 1513లో రెండు వేర్వేరు సందర్భాల్లో వజ్రాలు, కెంపులతో పొదిగిన కిరీటంతో పాటు నవరత్న ఖచిత ఆభరణాలు, స్వర్ణఖడ్గం వంటివి స్వామివారికి సమర్పించి తన భక్తిని చాటుకున్నారు. ఆకాశరాజు, తొండమాన్ చక్రవర్తి వంటి ఎందరో రాజులు స్వామివారికి అపురూప ఆభరణాలు అందించిన వారిలో ఉన్నారు.

**మతాలకు అతీతంగా ఏడుకొండలస్వామికి కానుకల వెల్లువ**

స్వామివారిపై భక్తి కేవలం హిందువులకే పరిమితం కాలేదు. బ్రిటీష్ పాలనలో చిత్తూరు కలెక్టర్‌గా పనిచేసిన థామస్ మన్రో స్వామివారికి ఒక పెద్ద గంగాళాన్ని కానుకగా ఇచ్చారు. అలాగే గుంటూరుకు చెందిన షేక్ హుస్సేన్ సాహెబ్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ మీరా వంటి వారు 108 బంగారు పుష్పాలను స్వామివారి పూజ కోసం సమర్పించడం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది.

**ఆధునిక కాలం కానుకలు**

రాజుల కాలం నాటి సంప్రదాయం నేటికీ అదే వైభవంతో కొనసాగుతోంది. ఆధునిక కాలంలోనూ శ్రీవారికి అత్యంత విలువైన కానుకలు అందుతున్నాయి. 2009లో గాలి జనార్ధనరెడ్డి సుమారు 42 కోట్ల రూపాయల విలువైన వజ్రకిరీటాన్ని సమర్పించారు. అలాగే, గోయంకా కుటుంబం 10 కిలోల బంగారు కిరీటాన్ని, పెన్నా సిమెంట్స్ సంస్థ 5 కోట్ల రూపాయల విలువైన వజ్రాల కటి, వరద హస్తాలను కానుకగా అందించారు.

**తిరుమల శ్రీవారి ఆభరణాలు.. తరగని భక్తికి నిలువుటద్దం**

రత్నకిరీటం, మేరు పచ్చ, సహస్రనామ హారం, సూర్య కఠారి వంటి అపురూప ఆభరణాలు ఉత్సవాల సమయంలో శ్రీవారి శోభను మరింత పెంచుతాయి. ఈ ఆభరణాలన్నీ కేవలం స్వామివారి ఖజానాకు అలంకారాలు కావు, తరతరాలుగా భక్తులు ఆయనపై చూపుతున్న ప్రేమకు, విశ్వాసానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. అందుకే ఆయన 'సిరి'నివాసుడిగా భక్తులచే పూజలం దుకుంటున్నారు.

# ఈ కేసులన్నీ ఒక్క రోజులో పోయేవే: మిథున్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి** – ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్ట్ అయి, బెయిల్‌పై జైలు నుంచి విడుదలైన వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అధికార కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తనపై పెట్టినవి అక్రమ కేసులని, వీటిని చూసి భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. జైల్లో తనను ఒక ఉగ్రవాదిలా చూశారని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, రాష్ట్రంలో మళ్లీ రాబోయేది జగనన్న ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.జైలు నుంచి బయటకు వచ్చిన అనంతరం మిథున్ రెడ్డి ఓ ఛానెల్‌తో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మమ్మల్ని వేధించడం, మాపై కేసులు పెట్టడం మామూలే. కేవలం మమ్మల్ని మానసికంగా ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే ఈ అక్రమ కేసులు పెట్టారు. ఇలాంటి వాటికి భయపడతామని అనుకుంటే అది వారి భ్రమే అవుతుంది. ఇవన్నీ ఒక్కరోజులోనే వీగిపోయే కేసులు" అని ఆయన కొట్టిపారేశారు.రెండున్నర నెలల పాటు జైలు జీవితం గడపాల్సి వచ్చిందని, అక్కడ తనను చాలా ఇబ్బందులకు గురి చేశారని మిథున్ రెడ్డి తెలిపారు. అయితే, తమ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనకు, తమ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా నిలిచారని పేర్కొన్నారు. "మా అధినేత జగన్ మా వెంటే ఉన్నారు. మా కుటుంబానికి ఎవరికీ ఇవ్వని గుర్తింపు ఇచ్చారు. ఆయన కోసం, మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని తీసుకురావడం కోసం ఎన్ని కేసులైనా ఎదుర్కొంటాం, ఎన్ని ఇబ్బందులైనా భరిస్తాం" అని ఆయన అన్నారు. కోర్టు ఆంక్షల కారణంగా కేసు గురించి ఎక్కువగా మాట్లాడలేనని, ఎన్ని కష్టాలు పెట్టినా అధైర్యపడేది లేదని ఆయన తేల్చిచెప్పారు.

# పాకిస్థాన్‌పై ఆపరేషన్ ఎందుకు ఆపారు?

**మొదటిపేజీ తరువాయి** – పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై భారత్ ప్రారంభించిన సైనిక చర్యలను మధ్యలోనే ఎందుకు నిలిపివేశారని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ కేంద్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. దేశమంతా ఒక్కతాటిపై నిలిచి, గట్టి సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్న సమయంలో ఆపరేషన్‌ను ఆపివేయడం వెనుక కారణమేంటని ఆయన నిలదీశారు.పహల్గాం దాడి జరిగినప్పుడు మీరే ప్రధాని అయితే ఏం చేసేవారని ఓ విలేకరి ప్రశ్నించగా, ఒవైసీ ఆ ప్రశ్నను సున్నితంగా పక్కనపెట్టారు. "సోదరా, అలాంటి కలలు కనే అలవాటు నాకు లేదు. నేను వాస్తవంలో ఉంటాను. మా లక్ష్యం కేవలం పదవులు చేపట్టడం కాదు" అని ఆయన స్పష్టం చేశారు.అనంతరం ఆయన అసలు విషయానికి వస్తూ, పహల్గాం ఘటన తర్వాత పాకిస్థాన్‌కు గట్టి బుద్ధి చెప్పేందుకు భారత్‌కు ఒక మంచి అవకాశం లభించిందని అన్నారు. "అదొక యుద్ధం లాంటి పరిస్థితి. అలాంటి సమయంలో ఆపరేషన్ ఎందుకు ఆగిపోయిందో నాకు నిజంగా అర్థం కావడం లేదు. దేశం మొత్తం గట్టి సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పుడు ఎందుకు వెనక్కి తగ్గారు? ఇప్పుడు పార్లమెంటులో కూర్చుని పీవోకేను స్వాధీనం చేసుకుంటామని మాట్లాడతారు" అంటూ ఆయన కేంద్రంపై విమర్శలు గుప్పించారు.ఈ ఏడాది ఏప్రిల్ 22న "మినీ స్విట్జర్లాండ్"గా పిలిచే పహల్గాంలోని బైసరన్ లోయలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఒక నేపాల్ జాతీయుడితో సహా 26 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దాడికి ప్రతీకారంగా భారత్ "ఆపరేషన్ సిందూర్" చేపట్టింది. పాకిస్థాన్, పీవోకేలోని 9 ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసింది. సింధు జలాల ఒప్పందాన్ని నిరవధికంగా నిలిపివేయడంతో పాటు పాక్ జాతీయులను వెనక్కి పంపింది. దీనికి ప్రతిగా పాకిస్థాన్ డ్రోన్లతో భారత పౌర ప్రాంతాలపై దాడులకు దిగింది.

# బీఆర్ఎస్ పార్టీతో నాకు ఎలాంటి సంబంధం లేదు

**మొదటిపేజీ తరువాయి** – బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఈరోజు ఆమె మీడియాతో మాట్లాడుతూ... బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందే వరకు కేవలం రెండు నెలలు ఆగి ఎన్నికలు నిర్వహిస్తే ప్రభుత్వానికి వచ్చే నష్టమేంటని ఆమె ప్రశ్నించారు. ఒకవైపు జీవో ఇచ్చి, మరోవైపు తమ అనుచరులతోనే కోర్టులో కేసు వేయించారని, ఈ విషయం సోషల్ మీడియాలో కూడా చర్చనీయాంశమైందని ఆమె వ్యాఖ్యానించారు. గ్రామాల్లో లేని సామాజికవర్గాలకు కూడా రిజర్వేషన్లు కేటాయించడం గందరగోళానికి దారితీస్తోందని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన కులగణన వివరాలను బయటపెడితే రిజర్వేషన్ల కేటాయింపులో స్పష్టత వస్తుందని కవిత సూచించారు.ఇదే సమయంలో, స్థానిక ఎన్నికలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపైనా కవిత తీవ్రంగా స్పందించారు. న్యాయస్థానాలను తప్పుదోవ పట్టించేలా ఈటల మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యలు సొంతమా లేక పార్టీవి చెప్పించారా అని నిలదీశారు. ఈ వ్యాఖ్యల పట్ల ఈటల రాజేందర్ బీసీ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని కవిత డిమాండ్ చేశారు.మరోవైపు, రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలను మార్చి గెజిట్ విడుదల చేసిందని ఆరోపించారు. అయితే, బతుకమ్మ నిమజ్జన కార్యక్రమంలో సీఎం పాల్గొనడాన్ని ఆమె స్వాగతించారు. ఈ సందర్భంగా, తనకు బీఆర్ఎస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని కవిత స్పష్టం చేయడం గమనార్హం.

# పీవోకేలో పాక్ సైన్యం అరాచకం...ఆందోళనకారులపై కాల్పులు

**మొదటిపేజీ తరువాయి** – పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో పాక్ సైన్యం అరాచకం సృష్టించింది. పీవోకే ప్రజలను పాకిస్తాన్ రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కుతోందని జరుగుతున్న నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఈ క్రమంలో పాక్ బలగాలు ఆందోళకారులపై కాల్పులు జరపగా 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ధిర్కోట్, ముజఫరాబాద్, బాఘ్, మిర్‌పూర్ ప్రాంతాల్లో ఈ మరణాలు చోటుచేసుకున్నాయని జాతీయ మీడియా వెల్లడించింది.అవామీ యాక్షన్ కమిటీ (ఏఏసీ) నేతృత్వంలో కొన్నిరోజులుగా పీవోకేలో నిరసనలు జరుగుతున్నాయి. పీవోకే ప్రజల ప్రాథమిక హక్కులను పాకిస్తాన్ హరిస్తోందని నిరసనకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పీవోకేలో మౌలిక సంస్కరణలు తీసుకురావాలని తమ 38 డిమాండ్లను అమలు చేయాలని ఏఏసీ ఆందోళనలకు పిలుపునిచ్చింది. పాక్ సర్కార్‌కు వ్యతిరేకంగా నిరసనలు తీవ్రమవుతుండడంతో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పాక్ పెద్ద సంఖ్యలో బలగాలను మోహరించింది. ఇంటర్నెట్‌ను నిలిపివేసింది. ఈ నిరసనలతో మార్కెట్లు, దుకాణాలు, రవాణా సేవలు నిలిచిపోయాయి. ఈ ఉదయం ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. తమను అడ్డుకునేందుకు బ్రిడ్జిలపై ఉంచిన షిప్పింగ్ కంటైనర్లను నదిలోకి నెట్టేశారు. ఈ క్రమంలోనే కాల్పులు జరిగాయి. ప్రస్తుత నిరసనలు ప్లాన్-ఏ అని, ఇంకా తమ వద్ద వేరే ప్రణాళికలు ఉన్నాయని ఏఏసీ లీడర్ షౌకత్ నవాజ్ మిర్ పాక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**సొంత ప్రజల పైనే డ్రోన్లతో దాడి**

మరోపైపు పాక్ తమ భూభాగంలో భారీ స్థాయిలో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లు నిర్వహిస్తోంది. బలోచిస్థాన్‌లోని సొంత ప్రజలపైనే శతఘ్నులు, మోర్టార్లతో దాడులు చేస్తోంది. దీనితో కుజ్దార్ జిల్లాలోని జెహ్రీ ప్రాంత ప్రజలు ఏం చేయాలో తోచక బిక్కుబిక్కుమంటున్నారు. వాస్తవం చెప్పాలంటే, గత 4రోజులుగా పాక్ సైన్యం చేస్తున్న దాడులతో ప్రజలు లాక్‌డౌన్‌లోకి వెళ్లిపోయారు. వారికి కనీసం ఆహారం, ఇంధనం కూడా లభించడం లేదని స్థానిక మీడియాలో వార్తలు వస్తున్నారు.పాక్ సైన్యం చేస్తున్న వరుస బాంబు దాడులతో పత్తి పొలాలన్నీ ధ్వంసమయ్యాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారని మీడియా పేర్కొంది. ఛశ్మా ప్రాంతంలో శతఘ్నులు, మోర్టార్ల కారణంగా కొంత మంది పాక్ పౌరులు మరణించారని తెలుస్తోంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంతో పూర్తిస్థాయి సమాచారం తెలియడం లేదు. బలోచ్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్?ఏ), బలోచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ (బీఎల్?ఎఫ్?) లక్ష్యంగా పాక్ సైన్యం దాడులు చేస్తోంది. వాటి అధీనంలో ఉన్న జెహ్రీని తిరిగి స్వాధీనం చేసుకొనే లక్ష్యంతో పాక్ సేనలు ఈ దాడులు చేస్తోంది.ఇటీవలి కాలంలో ముష్కర పాక్ తమ సొంత ప్రజలపైనే దాడులు చేస్తోంది. గతనెల ఖైబర్ పఖ్తున్‌ఖ్వాలోని మాత్రె దారా గ్రామంపై ఫైటర్ జెట్‌లు ఎల్ఎస్-6 రకం 8 బాంబు లను వేశాయి. దీనితో పదుల సంఖ్యలో పాక్ పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఏడాది జనవరిలో అంతకుముందటి నెలతో పోలిస్తే ఉగ్రదాడులు ఏకంగా 42 శాతం మేర పెరిగాయి. ఈ విషయాన్ని పాకిస్థాన్ ఇనిస్టిట్యూట్ ఫర్ కాన్‌ఫ్లిక్ట్ స్టడీస్ అండ్ సెక్యూరిటీ స్టడీస్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. బలోచిస్థాన్ తర్వాత అత్యధికంగా ఉగ్రదాడులు జరిగేది ఈ ప్రావిన్స్‌లోనే కావడం గమనార్హం.

# జూబ్లీహిల్స్ బైపోల్ వార్



**మొదటిపేజీ తరువాయి** – దాదాపు రెండు గంటల పాటు సమావేశం అయ్యారు. గెలుపు గుర్రాన్ని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నిలబెట్టాలన్న కోణంలోనే నివేదిక ఉండాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక శాతం స్థానాలను కైవసం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ అంశంలో ఇన్‌ఛార్జ్ మంత్రులతో పాటు ఎంపీల భాగస్వామ్యంతో వెళ్లాలని సూచించారు.రేసులో ఆశావహులెందరో : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికలు, రిజర్వేషన్ల అమలు, రిజర్వేషన్లకు సంబంధించి వెలువడిన గెజిట్ నోటిఫికేషన్లు తదితర అంశాలపై చర్చ జరిగినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే జూబ్లిహిల్స్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నవీన్ యాదవ్‌తో పాటు జూబ్లీహిల్స్ కాంగ్రెస్ టికెట్ అడుగుతున్న వారిలో ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కంచర్ల విజయలక్ష్మి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డిలు ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**ఆ ముగ్గురికే బాధ్యతలు :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితులు, అభ్యర్థి ఎంపికలపై చర్చించినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా నియోజక వర్గంలో పర్యటిస్తూ అభివృద్ధి పనులు చేపడుతూ పార్టీని బలోపేతం చేసే దిశలో ముందుకు వెళ్లుతున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట స్వామి, తుమ్మల నాగేశ్వరరావులకే అభ్యర్థి ఎంపిక బాధ్యత అప్పగించారు. ఆశావహుల జాబితా సిద్ధం చేయడంతో పాటు వారికి పార్టీతో ఉన్న అనుబంధం, ప్రజల్లో వారికి ఉన్న పరపతి తదితర అంశాలను కూడా పొందుపరచాలని సూచించినట్లు తెలుస్తోంది.

**ఇటు జూబ్లీహిల్స్ – అటు స్థానికం :** ఇక స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. నిన్న రాత్రి జరిగిన జూమ్ సమావేశంలో ఈ నెల 5వ తేదీ లోపు ఒక్కో జడ్పీటీసీ స్థానానికి ముగ్గురు అభ్యర్థుల లెక్కన జాబితాను సిద్ధం చేసి పీసీసీకి ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి జిల్లాల ఇంఛార్జి మంత్రులకు సూచించారు. ఈ నెల 9వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండడంతో అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. మరోవైపు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన జీవోపై హైకోర్టులో ఈ నెల 8వ తేదీన హైకోర్టులో విచారణ కొనసాగనుంది. ప్రభుత్వానికి అనుకూలంగానే న్యాయస్థానం నిర్ణయం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. న్యాయస్థానం ఇచ్చే తీర్పుకు అనుగుణంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు వెళ్లతామని స్పష్టం చేస్తున్నారు. ఈ నెల 8వ తేదీ తరువాతనే జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపికపై తుది నిర్ణయం ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.

# అందరూ భగవద్గీత చదివి చదివించాలి

ప్రతి హిందువు ఇంట్లో ఈ గ్రంథం ఉండాలి.

సీనియర్ జర్నలిస్ట్ సురమోని సత్యనారాయణ సాగర్.



**అక్షర విజేత, ఇబ్రహీంపట్నం :-** ఇబ్రహీంపట్నం ఈశ్వరఆంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలో భక్తులకు హిందూ ఆధ్యాత్మిక భవద్గీత గ్రంథం పాఠ్య పుస్తకాలను సూరామోని బాబు సాగర్ కుటుంబ సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురమోని సత్యనారాయణ సాగర్ భగవద్గీత పంపిణీ కార్యక్రమం ప్రతి హిందువు ఇంట్లో ఈ గ్రంథం ఉండాలనే ఉద్దేశంతో, గీత సారాంశాన్ని ప్రతి ఒక్కరు నేర్చుకొని సన్మార్గంలో పయనించాలని అని అన్నారు. ఇంకా కూడా భగవద్గీత పాఠ్యగ్రంథం ఎవరికైనా అవసరం ఉన్న పంపిణీ చేస్తామని గీతా సారాంశాన్ని విశ్వవ్యాప్తం చేయాలని సదుద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి అరుణ్, ఆలయ కమిటీ సభ్యులు సూరంపల్లి కాళిదాసు సాగర్, తాళ్ల వెంకటేష్ గౌడ్, సూరంపల్లి హరిదాస్ సాగర్, భద్రప్ప, బీజేవైఎం జిల్లా నాయకులు రూపక్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ తో ఉన్నతస్థానం సాధించాలి

ఎసిపి ఎస్ వి రమణమూర్తి





**అక్షర విజేత ఖమ్మం: -** సమయపాలన, క్రమశిక్షణ తో విద్యార్థులు ఉన్నతస్థానాలు సాధించాలని ఖమ్మం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్విరమణమూర్తి కోరారు. డోర్నకల్ కు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన చెరుకుపల్లి విశాలి తన విద్యకు చేయూత కై ఆర్థికసహకారాన్ని పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పరిశపుల్లయ్యను అభ్యర్థించింది. ఇంజనీరింగ్ చదువుతున్న నిరుపేద విద్యార్థిని చెరుకుపల్లి విశాలి ఉన్నత విద్యకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చేయూతగా అందిస్తున్న ఇరవైవేల రూపాయలు చెక్కును ఏసిపిరమణమూర్తి, బుధవారం అందజేసారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పరిశపుల్లయ్య, విశ్రాంత హెల్త్ సూపర్వైజర్ కేజీపుష్పవల్లి, విద్యార్థిని తల్లి చెరుకుపల్లి స్వరూప,నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

# పువ్వాళ్ల దుర్గప్రసాద్ ను మర్యాద పూర్వకంగా కలిసిన కేకేసి నాయకులు



**అక్షర విజేత ఖమ్మం:-** అఖిల భారత అసంఘటిత కార్మికుల ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసి) జిల్లా అధ్యక్షులు గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గప్రసాద్ ను సిహెచ్ విప్లవ కుమార్ పటేల్ ఖమ్మం సంజీవరెడ్డి భవన్ నందు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించడం జరిగింది.. ఈ సందర్భంగా పువ్వాళ్ల దుర్గప్రసాద్ జిల్లాలో అసంఘటిత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను ,పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లి రాహూల్ గాంధీ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు ఈ కార్యక్రమంలో కేకేసి ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు సిద్దల నగేష్, నగర అధ్యక్షులు జంగిపల్లి ప్రసాద్ నగర ప్రధాన కార్యదర్శి పగిళ్లపల్లి రవి , నగర వర్కింగ్ ప్రెసిడెంట్ మెరుగు వెంకట్ నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజు నాయకులు డి మార్ట్ జానీ ,తుపాకుల నాగేశ్వరరావు, బాబా,పుల్లారావు , రాంబాబు, సుధాకర్, బాబుసాహెబ్ ,శంకర్, వీరా గౌడ్ , తదితరులు పాల్గొన్నారు

# షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనులకు అనుకూలంగా రిజర్వేషన్లు ఇవ్వాలి గిరిజన సంఘాల నాయకులు



**అక్షర విజేత అదిలాబాద్ ప్రతినిధి:-** ఐదో షెడ్యూల్ ప్రాంతంలైన తిర్యానీ కెరమెరి సిర్పూర్ లింగాపూర్ జైనుర్లాంటి మండలాల్లో గిరిజనులకు అనుకూలంగా రిజర్వేషన్ కల్పించాలని బుధవారం రోజున తిర్యాణి మండలంలోని స్థానిక కొమురం భీం చౌరస్తాలో గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు లేనియెడల ఈనెల ఎనిమిదో తేదీన తెలంగాణ హైకోర్టులో వాజ్యం దాఖలు చేయనున్నట్టు వారు పేర్కొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీవోకు తాము వ్యతిరేకం కాదని తెలిపారు ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో మాత్రం గిరిజనులకే రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొన్నారు రాజ్యాంగంలో గిరిజనులు కల్పించిన హక్కులను కాలరాస్తు తెలంగాణ ప్రభుత్వం లక్కీ లాటరీల ద్వారా రిజర్వేషన్లు కల్పించడం విడ్డూరంగా ఉందని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు దీనిపై హైకోర్టులో తేల్చుకోనున్నట్లు వారు పేర్కొన్నారు ఎనిమిదో తేదీన హైకోర్టు వెళ్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా సర్మెడి కుర్సేంగ మూతిరామ్ తుడుం దెబ్బ ఉపాధ్యక్షులు వెడ్మ భగవంతురావు రాజ్ గోండు సేవా సమితి నాయకులు మాడావి నర్సింగ్ రావు గిరిజన సంఘాల నాయకులు ధర్ము, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు

# హత్య కేసులో నిందితుడి అరెస్టు



**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** నగరంలోని రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో జరిగిన హత్య కేసులో నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఒకటో టౌన్ ఎస్ హెచ్ ఓ బి.రఘుపతి తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం గత నెల 6న నిజామాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో గల శ్రీనివాస కిరాణా షాప్ ముందు ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు ఫిర్యాదు అందింది. దీంతో 1వ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారు. దర్యాప్తులో భాగంగా అనుమానితులను పట్టుకొని విచారించారు. విచారణలో భాగంగా కోటగిరి మండలం జల్లపల్లి ఫారం గ్రామానికి చెందిన షేక్ అహ్మద్ తను చేసిన నేరాన్ని అంగికరించాడు. అతను కేటరింగ్, రోజువారీ కూలీ పనులు చేస్తూ రైల్వే స్టేషన్ దగ్గర ఉంటూ మద్యం అలవాటు కారణంగా డబ్బుల కోసం రైల్వే స్టేషన్ వద్ద ఒంటరిగా కనిపించే వ్యక్తులను బెదిరించి, కొట్టి డబ్బులు దోచుకునే వాడు. గత నెల 6న అర్ధరాత్రి రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న లక్ష్మీ లాడ్జ్ పక్కన శ్రీనివాస కిరాణా షాప్ ముందు ఒక పెద్దాయన డబ్బులు లెక్కబెడుతూ కనిపించాడు. దాంతో అతనిని చంపివేసైన డబ్బులు దోచుకోవాలనే ఉద్దేశ్యంతో అతని దగ్గరకు వెళ్లి డబ్బుల కోసం అతన్ని బెదిరించి కొట్టాడు. కానీ ఆ పెద్దాయన డబ్బులు ఇవ్వకపోవడంతో, నిందితుడు ఒక బట్టతో అతని మెడకు ఉరి బిగించి హత్య చేసి, అతని వద్ద నుండి రూ. 2వేల నగదు, ఫోన్ దోచుకున్నాడు. బుధవారం నిందితున్ని అరెస్ట్ చేసి కోర్ట్ ఎదుట హాజరుపరచి, జ్యుడీషియల్ రిమాండ్ కు తరలించారు.

# జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవిని కైవసం చేసుకుంటాం

బిజెపి పార్టీ తరపున స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలకు పోటీ చేస్తాం

ప్రజలందరూ నరేంద్ర మోడీ వైపే ఉన్నారు

బిజెపి పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి



**అక్షరవిజేత, వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా జడ్పీ ఛైర్మన్ పదవిని బిజెపి పార్టీ కైవసం చేసుకుంటుందని బిజెపి పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో మోగిన ఎన్నికల నాగారా నేపథ్యంలో బుధవారం భారతీయ జనతా పార్టీ సారథ్యంలో బిజెపి జిల్లా కార్యాలయం ఎన్నేపల్లిలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా బీజేపీ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ తరపున జిల్లాలోని అన్ని సర్పంచ్, ఎంపీటీసీలు, జడ్పీటిసి స్థానాల్లో పోటీకి నిలబెడతామని, ఈ ఎన్నికలు కార్యకర్తల ఎన్నికలు కాబట్టి కార్యకర్తలు గెలుపు దిశగా ప్రయత్నం చేస్తూ గ్రామాల్లో జరుగుతున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ నిధుల వల్లనే జరుగుతున్నాయని అన్నారు. ఈ విషయాన్ని నాయకులు కార్యకర్తలు ప్రజలకు తెలియపరచి ప్రజాక్షేత్రంలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను గేలుపించాలని కోరారు. డాక్టర్ వెన్న ఈశ్వరప్ప, మాట్లాడుతూ బిఆర్ఎస్, కాంగ్రెస్ లు కేవలం గెలుపు కోసం అమలు కానీ, ఆచరణీయం కానీ వాగ్దానాలు చేసి ప్రజలను మభ్యపెట్టి గతంలో ఓట్లు దండుకున్నారని ప్రస్తుతం ఆ మోసాన్ని గమనించిన యావత్ తెలంగాణ ప్రజలు సంస్థాగత ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి పట్టం కట్టడానికి సుముఖంగా ఉన్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వెన్న ఈశ్వరప్ప, ఓబీసీ మోర్చా జిల్లా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలేశ్వర్ గుప్తా, జిల్లా ఎన్నికల కో కన్వీనర్ గణపురం వెంకటయ్య, కోకన్వీనర్ ఒడిత్యాల రాములు, జిల్లా ఎన్నికల కో కన్వీనర్ మరియన్ రెడ్డి, కో- కన్వీనర్ శ్రీలత, పెద్దింటి నవీన్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, పెంటయ్య గుప్తా, జివిస్ మాధవి, ప్రధాన కార్యదర్శి, సాయి రెడ్డి, ఉపాధ్యక్షులు యాదయ్య, ఉపాధ్యక్షులు జి శివరాజ్, ఉపాధ్యక్షులు రవి గౌడ్, కోకన్వీనర్ రఘుపతి, కార్యదర్శి పేట శంకర్, సీనియర్ నాయకులు సుదర్శన్ గౌడ్, ఉపాధ్యక్షులు జుంటుపల్లి వెంకట్ కార్యదర్శి, టి రాఘవేందర్ సోషల్ మీడియా ఇంచార్జ్, మోహన్ రెడ్డి మీడియా ఇంచార్జ్, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఇబ్బందులలో ఉన్న ఇచ్చిన మాట ప్రకారం పథకాలన్నీ అమలు చేస్తున్నా








**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులలో ఉన్నా ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పథకాలన్నీ అమలు చేస్తున్నామని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. బుధ వారం నిజామాబాద్ పట్టణంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ , అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్య నారాయణ లు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో అప్పుల కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకోవడానికి ఎంతో ప్రయత్నం చేస్తుందని అన్నారు. బుధ వారం కళ్యాణ లక్ష్మి 95 మంది లబ్ధిదారులకు క 95 లక్షల 11,020 రూపాయలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. అలాగే షాదీ ముబారక్ 349 లబ్ధిదారులకు 3 కోట్ల 49 లక్షల 40వేల 484 రూపాయలు అందించామని, మొత్తం లబ్ధిదారులకు 4 కోట్ల 44 లక్షల 51504 రూపాయలు అందించామని చెప్పారు. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులలో ఉన్న ఇచ్చిన మాట ప్రకారం పథకాలన్నీ అమలు చేస్తున్నామని అన్నారు. 500 కు సిలిండర్ 200 యూనిట్ల విద్యుత్ ఉచితం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు ఇంద్రమ్మ ఇల్లు, రైతు రుణమాఫీ, రైతు భరోసా యువతకు ఉద్యోగాలు సన్న బియ్యం పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ, ఉర్దూ అకాడమీ చైర్మన్ తహర్ బిన్ హందన్, నుడ చైర్మన్ కేశ వేణు, గ్రంథాలయ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన సీపీ సాయిచైతన్య




**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** దుష్ట శక్తుల పై విజయానికి సంకేతముగా జరుపుకునే విజయదశమి పండుగను స్ఫూర్తిగా తీసుకొని ప్రజలందరు ఐక్యత, సమగ్రతల కోసం కృషి చేయాలని నిజామాబాద్ ప్రజలందరికి అక్టోబర్ 2న విజయ దశమి పండుగ పోలీసు కమిషనర్ సాయిచైతన్య శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరకాలంలో వారి వారి కుటుంబ సభ్యులతో నిండు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషములతో కాలం గడుపాలన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలలో శాంతి భద్రతలకు, మత విద్వాంసాలకు తావు ఇవ్వకుండా అందరు సహకరించాలన్నారు. ఎల్లప్పుడు ప్రజలు, పోలీస్ సిబ్బంది స్నేహ పూర్వకంగా సోదర స్వభావముతో మెలగాలన్నారు.

# జమలాపురంలో ఘనంగా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



**అక్షర విజేత ఎర్రుపాలెం :** తెలంగాణ తిరుపతిగా వాసిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కనులు పండుగ జరుగుచున్నవి. ఉత్సవాలను పురస్కరించుకొని స్వామివారికి ఉదయం 5 గంటల నుండి నిత్య పూజా కార్యక్రమంలో నిర్వహించారు. అమ్మవారు మహార్నవమి సందర్భంగా బుధవారం మహిషాసుర మర్దిని అలంకారం లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 10 గంటల నుండి సామూహిక చండి హెూమం జరిపించారు. అనంతరం స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు మహాన్నదాన కార్యక్రమం నిర్వహించగా సుమారు 600 మందికి అన్నదానం చేశారు .ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి కొత్తూరు జగన్మోహన్రావు, ప్రధానార్చకులు శ్రీనివాస్ శర్మ, ప్రధాన అర్చకులు మురళీమోహన్ శర్మ,ఆలయ అర్చకులు, సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు

# సాహితీ కళా సేవాసమితి విజయదశమి-2025 అవార్డును అందుకున్న డప్పు కళాకారుడు అమరవరపు సతీష్



**అక్షర విజేత గరిడేపల్లి :** హైదరాబాద్ అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ భవన్‌లో సాహితీ కళా సేవాసమితి ఆధ్వర్యంలో బతుకమ్మ%-%దసరా సంబురాల సందర్భంగా విజయదశమి పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు స్వప్నకిషోర్ ఉల్లెందుల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డా. బద్దం రఘువీర్ రెడ్డి, వంశీ కృష్ణ ప్రతాప్, కేశరాజ్ వెంకట ప్రభాకర్ రావు, రాంకీ వెలగాడ, మీడిశెట్టి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు అమరవరపు సతీష్ విజయదశమి పురస్కారం-2025 ను అందుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు స్వప్నకిషోర్ ఉల్లెందుల మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వివిధ రంగాలలో విశేష కృషి చేసిన వారిని గుర్తించి విజయదశమి పురస్కారాలతో సత్కరిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా కళారంగంలో తన బృందంతో ముందుకు సాగుతున్న అమరవరపు సతీష్‌ను ఉత్తమ డప్పు కళాకారుడిగా గుర్తించి ఈ అవార్డు అందజేశామని పేర్కొన్నారు.

**అవార్డు గ్రహీత అమరవరపు సతీష్ మాట్లాడుతూ**

“కళారంగంలో విజయదశమి పురస్కారం అందుకోవడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ సన్మానం నాకు మరింత బాధ్యతను తీసుకువచ్చింది. ఇక ముందు కూడా రెట్టింపు ఉత్సాహంతో కళారంగం కోసం కృషి చేస్తాను” అని అన్నారు. ఈ పురస్కారం సందర్భంగా సతీష్ మ్యూజిక్ అకాడమీ బృందం, కుటుంబ సభ్యులు, బంధువులు, అప్పన్నపేట గ్రామ ప్రజలు, కళాకారులు, మిత్రులు ఆనందం వ్యక్తం చేశారు.

# జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో దసరా సందర్భంగా అయ్యుధ, వాహన పూజలు





**అక్షర విజేత, కుత్బుల్లాపూర్ :-** విజయదశమి పర్వదినం సందర్భంగా జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో భక్తి శ్రద్ధలతో అయ్యుధ పూజ, వాహన పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ వి. నర్సింహా రావు, ఎస్సైలు సందీప్, నాయక్, ఏఎస్సై కిష్టయ్యతో పాటు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది అందరూ పాల్గొన్నారు పురోహితునిగా గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీస్ శాఖలో ఉపయోగించే వాహనాలు, పనిముట్లు, ఆయుధాలను దైవస్వరూపంగా భావిస్తూ పూజలు చేయడం ద్వారా శ్రేయస్సు, విజయాలు, భద్రత కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా సీఐ వి. నర్సింహా రావు మాట్లాడుతూ, “ప్రజా రక్షణ కోసం వాడే వాహనాలు, సామాగ్రి కూడా దైవస్వరూపంగా భావించి పూజించడం ఒక శుభసూచనం. ఇవి మన విధులను విజయవంతంగా పూర్తి చేయడానికి దోహదపడతాయి” అని పేర్కొన్నారు అదేవిధంగా, ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల ను బైండోవర్





**అక్షర విజేత గరిడేపల్లి :** గరిడేపల్లి మండల పరిధిలోని కుతుబ్ షాపురం గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులను బుధవారం గరిడేపల్లి ఎస్సై చలికంటి నరేష్ గరిడేపల్లి తాసిల్దార్ బండ కవిత సమక్షంలో బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై చలికంటి నరేష్ మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుతంగా, సజావుగా జరిగేలా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారని తెలిపారు. రాజకీయ వర్గాల మధ్య ఎలాంటి విభేదాలు, గొడవలు తలెత్తకుండా కఠిన పర్యవేక్షణ కొనసాగుతుందని స్పష్టం చేశారు ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన ఆయన, ప్రతి ఒక్కరూ చట్టపరమైన పరిధిలోనే వ్యవహరించాలని, ఎవరైనా హింసాత్మక చర్యలకు పాల్పడితే లేదా నిబంధనలు అతిక్రమిస్తే చట్టం ముందు నిలబెట్టబడతారని హెచ్చరించారు.

# భీమవరంలో మహా అన్నదానం



**అక్షర విజేత ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండల పరిధిలోని భీమవరం గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో మహాఅన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భీమవరం శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామంలో నెలకొల్పిన అమ్మవారు బుధవారం దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహాయ సహకారాలతో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించగా సుమారు 1000 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు


# దసరా పండుగకు మహిళా మణులకు చీరు కానుక



కాప్రా డివిజన్ పరిధిలో రేగుల సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా మణులకు చీరల పంపిణీ..



**అక్షర విజేత, కాప్రా :** మేడ్చల్ జిల్లా కాప్రా మండలం పరిధిలోని రేగుల సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో చీరల పంపిణీ దసరా పండుగ సందర్భంగా కాప్రా డివిజన్ పరిధిలోని మహిళ సోదరీమణులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకుచీరలు అందజేసిన తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకులు రేగళ్ల సతీష్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అను నిత్యం ప్రజా సేవలో వుంటూ బి ఆర్ ఎస్ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మహిళ సోదరీమణులకు దసరా పండుగ సందర్భంగా చీరలు అందజేయడం జరుగుతుంది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ కాప్రా డివిజన్ సీనియర్ నాయకురాలు సరోజ, రిటైర్డ్ ప్రొఫెసర్ సవిత రావు, సుజాత గౌడ్, సరిత నాయక్, గీత,సరిత, దివ్య లత, సీనియర్ నాయకుడు నంగునూరి మహేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# నేడు గాంధీ జయంతి సందర్భంగా మాంసం దుకాణాలు బంద్

### ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ నోటీసులు జారీ.



**అక్షర విజేత, ఇబ్రహీంపట్నం :-** ప్రజారోగ్య విభాగము రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల పురపాలక సంఘ పరిధిలోని పశువులు, జంతు మాంస విక్రయ దుకాణదారులకు, మాంసాహార హెూటల్స్ 02 అక్టోబర్ 2025 గురువారం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా పశువధ నిషేదం కావున ధుకణాలు మసివేయుటకు నోటీసు జారీ చేశామని ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిబట్ల పురపాలక సంఘ పరిధిలోని పశువులు, జంతు మాంస విక్రయ దుకాణదారులకు, మాంసాహార హెూటళ్ల యజమానులకు తెలియజేయునది ఏమనగా, నేడు 02 అక్టోబర్ "గాంధీ జయంతి" సందర్భంగా పశువధ నిషేదం కావున, గొర్రెలు, మేకలు, కోళ్లు, చేపలు ఇతర జీవాలు వధించుట వాటి మాంసం విక్రయించుట పూర్తిగా నిషేదించబడింది. కావున ఇట్టి నిబంధనను ఉల్లగించిన వారిపై తెలంగాణా మున్సిపాలిటీ చట్టం 2019 ప్రకారముగా చర్యలు తీసుకోనబడునని తెలిపారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన మ్యకల కనకయ్య ముదిరాజ్



**అక్షర విజేత గజ్వేల్:** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పాములపర్తి గ్రామనికి చెందిన పిట్ల యాదయ్య వయస్సు 60 సం,గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న మర్కూక్ మండల్ బి ఆర్ ఎస్ పార్టీ బి సి సెల్ అధ్యక్షుడు మ్యకల కనకయ్య ముదిరాజ్ బుధవారం రోజు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి 5000 ఆర్థిక సహాయం అందజేశారు. వారితోపాటు పాములపర్తి బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్ల మహేష్ జుట్టు సుధాకర్ పిట్ల రాములు పిట్ల రమేష్ చెక్కల నర్సింలు పిట్ల నాగేందర్ పిట్ల కరుణాకర్ కొండల్ కొట్టాల మహేష్ తదితరులు ఉన్నారు.

# విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీ నాము

### చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి - మాజీ ఎంపీ నామ



**అక్షర విజేత ఖమ్మం:-** విజయదశమి పర్వదినం పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పర్వదినం మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలలో విశిష్ట స్థానం కలిగి ఉందని చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకంగా మారాలని పేర్కొన్నారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. దసరా రోజు శుభసూచకంగా పాలపిట్టను దర్శించడం, శమీ వృక్షానికి పూజ చేయడం, జమ్మి ఆకును బంగారంలా భావించి పెద్దలకు సమర్పించి వారి ఆశీర్వాదం తీసుకోవడం వంటి సంప్రదాయాలను గుర్తు చేశారు. దసరా పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ఒక ప్రత్యేక స్థానం ఉందని, అలాయ్ బలాయ్ వంటి సంప్రదాయాల ద్వారా పరస్పర ప్రేమాభిమానాలు పంచుకోవడం ద్వారా ప్రజల మధ్య సామాజిక సమరస్యం మరింత బలపడుతుందన్నారు. గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లాలని కోరుకుంటూ, ఈ పండుగ ప్రతి ఒక్కరికీ విజయం, శుభఫలితాలను అందించాలని నామ ఆకాంక్షించారు.

# నాగారం మున్సిపల్ పరిధిలోని పలుకాలనీలలో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

### ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారి ఆశీస్సులు అందుకున్న అద్దంకి దయాకర్ ముప్పు శ్రీనివాసరెడ్డి..





**అక్షర విజేత, కీసర నాగారం :** మేడ్చల్ జిల్లా కీసర మండలం నాగారం మున్సిపాలిటీలోని పలు కాలనీలలో అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వాదం పొందిన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్న దంపతులు మరియు నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాసరెడ్డి . ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు పంగ హరిబాబు , సుమిత్ర సురేష్ , గోధుమ కుంట మాజీ ఎంపిటిసి మంచాల కిరణ్ జ్యోతి ప్రవీణ్ కుమార్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిన్నం రాజ్ సతీష్ గౌడ్ , మాజీ వార్డు సభ్యులు బండారి శ్రీకాంత్ యాదవ్ , కొత్త గోపాల్ రెడ్డి , చీర శేఖర్ , మద్ది రెడ్డి రాజి రెడ్డి , భాస్కర్ నాయుడు , మామిడాల సతీష్ , అమ్మవారి భక్తులు కాలనీవాసులు పాల్గొనడం జరిగింది.

# కేకెసి జిల్లా అధ్యక్షులు గా ఎన్నికైన సిహెచ్ విప్లవ కుమార్ కు సన్మానం

### మున్నూరు కాపు జిల్లా నాయకులు శెట్టి రంగారావు -పసుపులేటి దేవేంద్ర





**అక్షర విజేత ఖమ్మం:-** కాంగ్రెస్ పార్టీ అనుబంధ అఖిల భారత అసంఘటిత కార్మికుల ఉద్యోగుల కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గా సిహెచ్ విప్లవ కుమార్ పటేల్ ఎన్నికైన సందర్భం పురస్కరించుకుని స్థానిక మున్నూరు కాపు హాస్టల్ నందు మున్నూరు కాపు రాష్ట్ర- జిల్లా నాయకుల సమక్షంలో సన్మానం చేయడం జరిగింది.. జివివిఎవ్ నరసింహారావు అధ్యక్షతన జరిగిన సభలో మున్నూరు కాపు రాష్ట్ర మరియు జిల్లా నాయకులు పొదిల రవికుమార్,శెట్టి రంగారావు,పసుపులేటి దేవేందర్,కనిశెట్టి నర్సయ్య,కార్పోరేటర్లు చామకూరి వెంకట నారాయణ,రాపర్తి శరత్ మరియు కేదాసు నర్సయ్య మాట్లాడుతూ చిన్న వయసులోనే పెద్ద బాధ్యత రావడం దానికి కారకులైన డిప్యూటీ సిఎమ్ మల్లు బట్టి విక్రమార్క స్థానిక మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొంగులేటి శ్రీనివాస రెడ్డి మరియు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాటల్ల దుర్గా ప్రసాద్ కు ధన్యవాదాలు తెలియచేస్తూ విప్లవ్ కుమార్ కు మరియు వర్కింగ్ ప్రెసిడెంట్ మెరుగు వెంకటనారాయణకు అభినందనలు తెలియచేసి సన్మానం చేయడం జరిగింది..ఈ కార్యక్రమంలో సముద్రాల శ్రీనివాసరావు, కర్నాటి సోమయ్య, దేవిశెట్టి వెంకటేశ్వర్లు, చౌడం నరసింహారావు, మాటేటి రవి, కోనేటి నారాయణ, కాసిన్ని శ్రీనివాసరావు,తిరుమలశెట్టి జయప్రకాశ్,ఆర్ కె నాయుడు, బీరెడ్డి రమేష్, రాము , బ్రహ్మం, జంగిపల్లి ప్రసాద్, సిద్దెల నగేష్ మరియు ఆయా అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

### మండల అధ్యక్షుడు శనిగరపు రాజేందర్



**అక్షర విజేత, గణపురం :** గణపురం మండలం ధర్మ రావు పేట గ్రామం లో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు శనిగరపు రాజేందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఇటీవలే కులం పేరుతో దూషించి దాడి చేయగా అవమానంతో పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందగా మృతుడు దళిత రైతు బొల్లం బిక్షపతి కుటుంబాన్ని భార్య బొల్లం రామ పిల్లలు కీర్తన అకిరా లను ఓదార్చి పరామర్శించి జరిగిన సంఘటన పూర్తి వివరాలు తెలుసుకోవడం జరిగింది. బొల్లం బిక్షపతి ని కులం పేరుతో దూషించి దాడి చేసిన పూజారి బాబును వెంటనే ఎస్సీ ,ఎస్టీ అట్రాసిటీ కేసు,నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చనిపోయి ఆరు రోజులు గడుస్తున్న సంబంధిత అధికారులు వారిపై చర్య తీసుకోకపోవడం వెనుక అంతర్యం ఏమిటని దళిత సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయకపోతే అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో దళితులకు జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేస్తామని వీరి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూజగుండ్ల స్వామి మోర హనుమంతు, ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు కోడెపాక ప్రవీణ్, బండారు శంకరు, కదారి బాబు, బొల్లం రాజేందర్ పాల్గొన్నారు.

# ఘనంగా దేవి శరన్నవరాత్రోత్సవాలు

### ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ పిఎసిఎస్ చైర్మన్ వీరంరెడ్డి శంబిరెడ్డి





**అక్షర విజేత గరిడేపల్లి :** గరిడేపల్లి మండల వ్యాప్తంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో తొమ్మిదవ రోజు మహిషాసుర మర్దిని అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మండల పరిధిలోని పరెడ్డిగూడెం గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మాజీ పిఎసిఎస్ చైర్మన్ వీరంరెడ్డి శంబిరెడ్డి, పరెడ్డిగూడెం మాజీ సర్పంచ్ లక్ష్మి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు బాగా పండాలని దుర్గామాత ఆశీస్సులు ఎల్లప్పుడూ కలగాలని కోరుకున్నారు. వీకార్యక్రమంలో మహిళలు, యువతులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని బొడ్రాయి (నాభి శిల) దగ్గర ఏర్పాటు చేసిన అమ్మవారి ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

# గంగాధర క్షేత్రంలో ఘనంగా చండి మహా యాగం





**అక్షర విజేత ఇల్లంతకుంట :** మండల కేంద్రంలోని గంగాధర క్షేత్రంలో చండీ మహాయాగం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. చండి మహా యాగంతో పాటుగా, సామూహిక కుంకుమార్చనలు, సుహాసిని పూజ, పాటుగా గంగాధరుడికి విశేష అభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు ఆలయానికి చేరుకొని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గంగాధర క్షేత్రం ఆధ్వర్యంలో, మూగు దామోదర అన్నదాన సత్రంలో, అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు, పురోహితులు మూగు నాగరాజు శర్మ, అనూప్ శర్మ, నాగలింగం పంతులు, భక్తులు, తదితరులు, పాల్గొన్నారు.

# కుషాయిగూడలో ఘనంగా ప్రారంభమైన జలంధర్ రెడ్డి ఫర్నిచర్ టౌన్

### ముఖ్య అతిథులుగా హాజరైన ఈటెల రాజేందర్, రఘునందన్ రావు, బండారు లక్ష్మారెడ్డి, బొంతు శ్రీదేవి..





**అక్షర విజేత, కాప్రా :** మేడ్చల్ జిల్లా కాప్రా మండలం కాప్రా మున్సిపల్ పరిధిలోని కుషాయిగూడ లో అంగరంగ వైభవంగా ప్రారంభమైన జలందర్ రెడ్డి ఫర్నిచర్ టౌన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ మరియు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు తో కలిసి ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు వ్యాపార రంగంలో రాణించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మహిషాసుర మర్ధిని అవతారంలో అమ్మవారి దర్శనం

### అమ్మవారి పూజలో పాల్గొన్న అర్ధం జ్యోతి లక్ష్మణ్ దంపతులు



**అక్షర విజేత గజ్వేల్ :** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పాములపర్తి గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పదవ రోజు బుధవారం అర్ధం జ్యోతి లక్ష్మణ్ దంపతులు అమ్మవారి పూజలో పాల్గొని ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో ఉగ్రరూపినిగా శ్రీ మహిషాసుర మర్ధిని అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శరావళి మాత ఉత్సవ సేవా సమితి వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రత్యేకంగా 2.5గ్రాముల బంగారం ముక్కుపుడక టోకెన్ పెట్టడం జరిగిందని,శరావళి మాత ఉత్సవ సేవ సమితి సభ్యుల వద్ద 301రూపాయలతో టోకెన్ తీసుకొని భక్తులు వారి అదృష్టాన్ని పరీక్షించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,శరావళి మాత ఉత్సవ సేవా సమితి సభ్యులు,గ్రామ ప్రజలు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తి నిర్మాణం, శక్త ఆరాధన, ధర్మ జీవనమే ప్రపంచ శాంతి మార్గం, ఆర్ఎస్ఎస్

**అక్షర విజేత ఇల్లంతకుంట :** మండలంలోని ఆర్యవైశ్య భవన్ లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయదశమి ఉత్సవంలో ముఖ్య వక్త కరినగర్ జిల్లా కళాశాల విద్యార్థి ప్రముఖ్ మాటూరి లింగమూర్తి మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 1925 ఈ విజయదశమి రోజున ప్రారంభమైందని 2025 విజయదశమి నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంది అన్నారు. విజయదశమి అనగానే అధర్మంపై ధర్మం గెలుపునకు గుర్తుగా కృతయుగంలో రావణాసురుడిపై రాముడు గెలుపొందింది, త్రేతాయుగంలో పాండవులు గెలుపొందిన రోజు కూడా ఇదే విజయదశమి అని, లోకానికి శాంతి మార్గం రావాలంటే ప్రతి ఒక్కరిలో శక్తి సముపర్జన చేయాలి అని, సమాజాన్ని శాంతి మార్గంలో నడిపించాలని అందుకు ప్రతి ఒక్కరు ధర్మ మార్గాన్ని అనుసరించాలని అన్నారు. శతజయంతి ఉత్సవాల్లో భాగంగా రాబోయే రోజులలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రతి గ్రామలలో శాఖల జనజాగరణ, హిందూ సమ్మేళనాలు, యువకుల సమ్మేళనాలు, ప్రతిష్ట వ్యక్తుల సమ్మేళనాలు, కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100 సంవత్సరముల కాలంలో అయోధ్యలో రామ మందిర నిర్మాణం, 370 ఆర్టికల్ రద్దు, తిరుమలలో ఏడుకొండలను, రామసేతును కాపాడుకోవడం లాంటివి అనేక విజయాలు సాధించాం అన్నారు. వరదలు, తుఫాను, భూకంప సమయాలలో కూడా సేవా కార్యక్రమాలను నిర్వహించడం, భారతదేశంతో పాకిస్తాన్, చైనా యుద్ధ సమయాలలో సైనికులకు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సహకారం అందించారు అని తెలియజేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా ఆర్ఎస్ఎస్ నిలబడింది అన్నారు. ఆర్ఎస్ఎస్ లో తయారైనటువంటి స్వయంసేవకులు అన్ని రంగాలలో పనిచేస్తున్నారని అన్నారు. పంచ పరివర్తన లో భాగంగా సామాజిక సమరసత ద్వారా సమాజంలో కుల,వర్గ, మత భేదం లేకుండా ఉండడం, పౌర విధులు నిర్వర్తించడం, స్వదేశీ వస్తువులను వినియోగించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం, కుటుంబ విలువలను కాపాడుకోవడం, పాటించడం విషయాలను తెలియజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో చొప్పరి రామచంద్రం, ఖండ కార్యవాహ తాటిపల్లి మహేష్, వ్యవస్థ ప్రముఖ్ కాసుపాక కిషన్, సేవా ప్రముఖ్ బొల్లం ధనంజయ్, ఉపమండల ప్రముఖ్ సార శశికాంత్, వివేకానంద సేవా సమితి మండల అధ్యక్షులు డాక్టర్ జగన్మోహన్ రావు, నార్ల రాంకిషన్, ఈదుల రవీందర్ రెడ్డి, వివిధ గ్రామాల స్వయం సేవకులు పాల్గొన్నారు.

# కోట గుళ్ళ లో ప్రొఫెసర్ దంపతుల పూజలు





**అక్షర విజేత, గణపురం:** గణపురం మండల కేంద్రంలోని కాకతీయుల కళా క్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ లో బుధవారం జగిత్యాల వైద్య కళాశాల ప్రొఫెసర్ కోడూరు నవీన్ కుమార్ సుమతి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సాదరంగా ఆహ్వానించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం కోట గుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

# పెద్ద మునిగల్ దుర్గామాతను దర్శించుకున్న దేవరకొండ ఎమ్మెల్యే





**అక్షర విజేత, దేవరకొండ :** నేరేడుగొమ్ము మండలంలోని పెద్దమునిగల్ గ్రామంలో నిర్వహించే విజయ దశమి దసరా వేడుకల్లో భాగంగా గ్రామంలో మౌలిక సదుపాయాలతో పాటు వీధి దీపాలను ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించిన దేవరకొండ ఎమ్మెల్యే దుర్గామాత అమ్మవారిని దర్శించుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చందంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గ మాత అమ్మవారిని దర్శించుకొని , ప్రత్యేక పూజలు నిర్వహించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ ఆ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ దేవరకొండ నియోజక వర్గ ప్రాంత ప్రజలపై ఉండి, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మండల ముఖ్య నాయకులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# దసరా శుభాకాంక్షలు తెలిపిన రెబ్బెన ఎస్సై




**అక్షర విజేత అదిలాబాద్ ప్రతినిధి:-** కొమురం భీం జిల్లా రెబ్బెన మండలం పరిషర ప్రాంత ప్రజలకు ఎస్సై ఏ .వెంకట కృష్ణ దసరా పండుగ సందర్భంగా ప్రజలందరికి శుభాకాంక్షలు పండుగ సందర్భంలో శాంతిభద్రతలు, ప్రజల రక్షణ కోసం పోలీసులు తీసుకుంటున్న చర్యలు పాటించవలసిన నిబంధనలు ఈ క్రింద ఇవ్వబడుతున్నాయి ఎవరు కూడా అజ్ఞాత ఘటనలకు లోనుకాకుండా అందరూ భద్రతగా ఉత్సవాలను నిర్వహించుకోవాలని కోరుతున్నాము దసరా పండుగను పురస్కరించుకొని ప్రజల భద్రత మరియు శాంతిభద్రత కోసం పోలీస్ శాఖ తరపున పలు చర్యలు తీసుకోబడ్డాయి ఉత్సవాల్లో పాల్గొనేవారు నిర్వాహకులు కింది సూచనలు తప్పనిసరిగా పాటించాలి ఉత్సవ సమయాలలో ట్రాఫిక్ నియంత్రణ రోడ్డుపై అనవసరంగా గుమికూడరాదు రావణ దహనం వంటి కార్యక్రమాల్లో పోలీస్ అనుమతి సురక్షిత దూరంలో ఏర్పాట్లు చేయాలి ఎలాంటి పేలుడుపదార్థాలు ప్రమాదకర వస్తువులు వాడరాదు మందపాలు, బహిరంగ వేడుకలకు వచ్చే ప్రజలు శాంతియుతంగా ఉండాలి ఎలాంటి గొడవలకు దిగరాదుఆజ్ఞాతుల గురించి అనుమానం వచ్చినపుడు వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ కి (100) సమాచారం ఇవ్వాలిమహిళలకు ప్రత్యేక సౌకర్యాలు, పిల్లలకు ప్రత్యేక కన్సెంట్ కల్పించాలనిది నిర్వాహకులకు సూచన

# అంగరంగ వైభవంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

**ఉత్సాహంగా సాగిన సాంస్కృతిక, భజన కార్యక్రమాలు...**

**ఆర్గనైజర్ విజయ్ కుమార్ సమక్షంలో లక్కీ డ్రా ప్రైజ్ స్కూటీ, మొబైల్..**

**అధిక సంఖ్యలో యువతి, యువకుల భవాని దీక్ష మాల దారులు..**





**అక్షర విజేత,కాప్రా చర్లపల్లి :** మేడ్చల్ జిల్లా కాప్రా మండలం కాప్రా మున్సిపల్ పరిధిలోని చర్లపల్లి డివిజన్లో దసరా పండుగను పురస్కరించుకొని ఏర్పాటుచేసిన దుర్గామాత అమ్మవారికి పది రోజులు పాటు ప్రత్యేక పూజలు చేస్తూ, సాయంత్రం పూట పూజ అనంతరం భక్తులకు అల్పాహారమును ఏర్పాటు చేస్తూ, ఎంతో అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో 11 వ సంవత్సరం దేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ పరిధిలోని ఇందిరానగర్, ద్వారకాపురి, మీనాక్షి నగర్, ఎంఆర్ఆర్ కాలనీ, లక్ష్మీ నరసింహ స్వామి కాలనీ, మధుర నగర్ కాలనీ లు సంయుక్తంగా జై దుర్గ భవాని యూత్ అసోసియేషన్ కమిటీ సభ్యుల సహకారంతో, ఆర్గనైజర్ శాఖత్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. మహిళలు రాత్రి వరకు అమ్మవారిని కొలిచి, సద్దుల బతుకమ్మ కార్యక్రమమును ఓ వేడుకగా నిర్వహించారు. మంగళవారం రాత్రి ఉత్సాహపరితంగా సాంస్కృతిక, భజన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్ విజయకుమార్ మాట్లాడుతూ యువతి, యువకులు ఎంత ఉత్సాహంగా భవాని దీక్ష మాల ధారణ చేసి, నియమ నిష్టలతో ప్రతిరోజు పూజ కార్యక్రమాలు నిర్వహించడంజరుగుతుందన్నారు. యువత చెడువ్యసాలకు బానిసలు కాకుండా, ఆధ్యాత్మిక చింతనతో అమ్మవారి సన్నిధిలో పూజలు జరపటం ఆనందించదగ్గ విషయమన్నారు. గత 11 సంవత్సరాలుగా చుట్టుపక్కల ఆరు కాలనీల పెద్దలు, ప్రజలు జై దుర్గ భవాని యూత్ అసోసియేషన్ కు సహకారంతో దేవి నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహించడం జరుగుతుందని, ఈ సంవత్సరం లక్కీ డ్రా ప్రైజ్ లో స్కూటీ, మొబైల్ లను పెట్టడం జరిగిందని, దసరా పండుగ రోజు డ్రా తీయడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పెద్ద పండుగలుగా దసరా, బతుకమ్మ లను జరుపుకుంటామని, చెడుపై విజయం సాధించిన సందర్భంగా దసరా ఉత్సవాలను జరుపుకుంటారని, రాక్షస పాలన సంహారం జరిగి రాబోయే రోజుల్లో ఘనంగా విజయ గర్వంతో ఉత్సవాలు జరుపుకునేలా అమ్మలనుగన్న అమ్మ దుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాజశేఖర్ రెడ్డి, ఎస్ రాహుల్, యశ్వంత్, నాగేందర్, ఎస్ అరుణ్, కిషోర్, బాల, కే ప్రసాద్, లింగం నాయక్, సంజయ్, దినేష్, భవాని దీక్ష మాలదారులు, అధిక సంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత లక్ష్యం మేరకు రైస్ డెలివరీ పూర్తి చేయాలి









**అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**

**20 రోజులలో పెండింగ్ రైస్ డెలివరీ పూర్తి చేయాలి**

**ఎండింగ్ రా రైస్ డెలివరీపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్.**

**అక్షర విజేత ఖమ్మం:-** నిర్ణీత లక్ష్యం మేరకు రైస్ డెలివరీ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు.

అదనపు కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం పెండింగ్ రా రైస్ డెలివరీ పై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు.

**ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ**

ఖమ్మం జిల్లా నుంచి గత ఖరీఫ్ సీజన్ పెండింగ్ ఉన్న 11 వేల 500 మెట్రిక్ టన్నులు రా రైస్, బాయిల్డ్ రైస్ 3500 మెట్రిక్ టన్నులు రాబోయే 20 రోజుల పని దినాలలో ఎఫ్.సి.ఐ. కు రైస్ మిల్లర్లు సరఫరా చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లు రైస్ సరఫరా చేసేందుకు వీలుగా ఎఫ్.సి.ఐ. అధికారులు గోదాముల్లో స్పేస్ అందుబాటులో పెట్టాలని, గోదాములకు కనీస అప్రోచ్ రోడ్డు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఖమ్మం జిల్లా నుంచి గత రబీ సీజన్ కు సంబంధించి పెండింగ్ ఉన్న 42 వేల మెట్రిక్ టన్నుల రైస్ డెలివరీకు రోజుకు 600 మెట్రిక్ టన్నుల సరఫరా దాటడం లేదని, దీనికి కారణాలను అదనపు కలెక్టర్ ఆరా తీశారు. రవాణా చార్జీలకు సంబంధించిన బిల్లులు రైస్ మిల్లర్లు శనివారం నాటికి అందిస్తే ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందని అన్నారు. రైస్ మిల్లర్లు తమ పూర్తి సామర్థ్యం మేరకు మిల్లింగ్ నిర్వహించి నిర్ణీత లక్ష్యం మేరకు రైస్ డెలివరీ సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. మిల్లర్ల దగ్గర ఉన్న నాణ్యమైన గన్ని బ్యాగులను తీసుకునేలా చర్యలు చేపడతామని అన్నారు. పిడిఎస్ బియ్యాన్ని ఎవరు ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయవద్దని, ఎవరైనా కొనుగోలు చేసినట్లు తెలిస్తే పీడీ యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. సన్న వడ్ల మిల్లింగ్ సామర్థ్యం, అందులో ఉన్న సమస్యలపై ప్రభుత్వానికి లేఖ రాయాలని అన్నారు. అక్రమ రేషన్ బియ్యం గుర్తింపుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖరీఫ్ ధాన్యం కేటాయింపుల కోసం రైస్ మిల్లర్లు తప్పనిసరిగా 10 శాతం బ్యాంకు గ్యారెంటీ సమర్పించాలని అన్నారు.

**అనంతరం రైస్ మిల్లర్ల సమస్యలను తెలుసుకున్న అదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు.**

ఈసమావేశంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, ఎఫ్.సి.ఐ. అధికారులు, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మ రాజేశ్వర్ రావు, మిల్లర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మహిషాసురమర్ధినీ దేవీ అలంకారంలో వన దుర్గాదేవి












**ఘనంగా చండీహెూమం-సుహాసిని పూజ**

**మంజీర మహెూగ్రరూపం... ఏడుపాయల ఆలయం పై స్లాబ్ కు తాకుతూ ఉద్ధృతంగా ప్రవహిస్తున్న మంజీర వరద**

**అక్షరవిజేత, పాపన్నపేట :** మంజీర మహెూగ్రరూపం దాల్చుతుంది. సింగూర్ నుండి లక్ష పదివేల క్యూసెక్కుల నీటిని వదలడంతో ఏడుపాయల ఆలయం పై స్లాబ్ కు మంజీర వరద నీరు తాకుతూ ఉదృతంగా ప్రవహిస్తుంది. ఎల్లాపూర్ వంతెనకు సమానంగా మంజీర ప్రవహిస్తుంది. శ్రీ ఏడుపాయల పుణ్యక్షేత్రం లో దేవీశరన్నవ రాత్రుల మహెూత్సవాలు వైభవోపేతంగా అంగరంగవైభవంగా దుర్గానామస్మరణలతో భక్తితన్మయంతో మారుమ్రోగుతున్నాయి. దేవీశరన్నవ రాత్రుల ఉత్సవాల్లో భాగంగా పదవ రోజైన బుధవారం ఉత్సవ మండపంలో శ్రీ మహిషాసురమర్ధినీ దేవి అమ్మవారు అలంకారంలో పట్టువస్త్రంలో వన దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం ఉదయం ఆలయ రాజగోపురంలో దుర్గాభవాని అమ్మ వారికి, గోకుల్ షెడ్ లోని ఉత్సవ మండపంలో శ్రీ మహిషాసురమర్ధినీ దేవి అలంకారంలో ఉన్న దుర్గాదేవి అమ్మవారికి వేద బ్రాహ్మణ పండితులు ఆర్ శంకర్ శర్మ, పార్థీవశర్మ, మురళీధర్, రాజేష్ శర్మ ల ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవ మండపంలో వేద పండితులు, ఆలయ అర్చకులు చండీహెూమం-సుహాసిని పూజ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాపన్నపేట మాజీ సర్పంచ్ టి గురుమూర్తి గౌడ్ దంపతులు తదితర భక్తులు అమ్మవారికి కుంకుమార్చన విశేషాలంకరణ పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి భక్తుల పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు ను స్వీకరించారు. అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. ఏడుపాయల్లో ఉదృతంగా ప్రవహిస్తున్న నీటిని ఎప్పటికప్పుడు డి ఎస్ పి ఆధ్వర్యంలో పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ పోలీసు సిబ్బంది పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యలు చేపడుతూ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

# ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్

**విజయదశమితో ఆర్ఎస్ఎస్ కు 100 సంవత్సరాలు**



**అక్షర విజేత: చిగురుమామిడి :** పరమ పూజనీయ డా. కేశవరామ్ బలీరామ్ హెడ్గేవార్ 1925లో మహారాష్ట్రలోని నాగపూర్ లో కేవలం పది మందితో ప్రారంభించిన రాష్ట్రీయ స్వయంసేవ సంఘ్ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా ఆవిర్భవించిందని జిల్లా సేవా ప్రముఖ్ మొగిలి సంపత్,జిల్లా ధర్మ జాగరణ సంయోజక్ పాకాల విజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం చిగురుమామిడి మండలంలోని మండల కేంద్రంలో పాటు,సుందరగిరి ఉప మండలంలో ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య వక్తలుగా హాజరైన వారు మాట్లాడుతూ 1925 నుండి 2025 ఏళ్ల ఆర్ఎస్ఎస్ ప్రస్థానం పూర్తిగా దేశసేవకోసమే కొనసాగిందన్నారు. భారతీయ చరిత్ర, సంస్కృతి,సాంప్రదాయాలను రక్షించడానికి,దేశ పరం వైభవ స్థితి కోసం ఆర్ఎస్ఎస్ వందేళ్ల గా పనిచేస్తుందన్నారు. దేశంలో ఏ ప్రకృతి విపత్తులు అనుకోని ప్రమాదాలు సంభవించిన ముందుకు వచ్చి ప్రజలకు సేవ చేసిన ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్ అని అన్నారు. ప్రస్తుతం ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పంచ పరివర్తన్ దిశలో సంఘం ప్రయాణాన్ని మొదలుపెట్టిందన్నారు. అందులో భాగంగా కుటుంబ ప్రబోధన్, పర్యావరణం,సామాజిక సమరత,స్వదేశీ,పౌర నియమాలు,బాధ్యత లు అనే అంశాలతో ముందు కొనసాగుతుందన్నారు. 1925 లో ప్రారంభమై నేడు దేశవ్యాప్తంగా విస్తృత శాఖలతో, విభిన్న రంగాలలో దేశభక్తి పూరిత, హిందుత్వ ఆధార సంస్థలతో ప్రపంచంలోని అనేక దేశాలలో పనిచేస్తుందని చెప్పారు, హిందువులలో ఐక్యతను శాఖ ఆధారంగా సంఘం పెంపొందిస్తుందని పేర్కొన్నారు, హిందుత్వం జీవన విధానం, విశ్వశాంతికి ఆధారం, ప్రపంచంలోని వివిధ మతాలను సమన్వయపరిచే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయని వివరించారు.ఆర్ఎస్ఎస్ జన్మ శతాబ్దిలో భాగంగా రాబోయే రోజులలో ఇంటింటి జనజాగరణ చేపట్టబోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా ఉప మండలంలోని గ్రామాల స్వయం సేవకులు పాల్గొన్నారు

# ఆర్.ఎస్.ఎస్ ఒక చారిత్రక అవసరం

( శత జయంతి ఉత్సవ సందర్భం)

ఆర్ఎస్ఎస్ పేరు విననివారు, తెలియని వారు నేడు ఉండకపోవచ్చు. 1925లో నాగపూర్ లో ప్రారంభమైన ఆర్ఎస్ఎస్ 2025 విజయదశమికి వందేళ్లు పూర్తి చేసుకోబోతుంది. శతాబ్ది ఉత్సవాలకు చేరువవుతున్న ఈ శుభ సమయంలో "సంఘ వందేళ్ళ నిశ్శబ్ద ప్రయాణం" ఒకసారి గమనిద్దాం. దేశ వికాసం కోసం ఆర్ఎస్ఎస్ చేస్తున్న మౌన తపస్సుకి ఆధారం"నిత్యశాఖ". ఈ తంత్రముతో వ్యక్తి నిర్మాణం ద్వారా సాధించిన విజయాలు ఎన్నో... ఎన్నెన్నో....... నేడు దేశవ్యాప్తంగా సుమారు 70000 శాఖలు ఉంటాయి. అంతేకాకుండా దేశంలోని అన్ని జీవన రంగాలలో హిందూ ఆధారిత కార్యం నిర్మాణమై ఉంది. స్వయంసేవకుల వివిధ ప్రయత్నాల ద్వారా సమాజ జీవనంలో వచ్చిన మార్పులను మరియు విజయాలను ఉదాహరణమాత్రంగా కొన్నింటిని పరిశీలిద్దాం.

1. "హిందువుగా గర్విస్తాను - హిందువుగా జీవిస్తాను"అనే స్వాభిమాన వాతావరణము నేడు దేశంలో నిర్మాణం అయింది.

2. ప్రతి రోజూ మాతృభూమికి నమస్కరిస్తూ 'భారత్ మాతాకీ జై' అంటూ నేడు వేలాది గ్రామాలలో, పట్టణాలలో, లక్షలాదిమంది పలుకుతున్నారు.

3. సాంస్కృతిక జాతీయత "హిందుత్వం" నేడు దేశంలో ప్రధాన కేంద్ర బిందువుగా మారింది. విశ్వకళ్యాణానికి, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి హిందుత్వమే ఆశాజనకంగా ప్రపంచానికి నేడు కనిపిస్తుంది

4. హిందూ సమాజం యొక్క ఆత్మవిశ్వాసము పెంపొందించబడి, సంఘటిత శక్తితో వివిధ సమస్యలను ఎదుర్కొని నిలబడే భయముక్త వాతావరణం సమాజంలో నేడు నిర్మాణం అయింది.

5. సంఘ ప్రారంభంలో మొదలైన "స్వయం సేవకుల ద్వారా పర్వయాత్ర", దేశమంతటా పండగలలో, తిరునాళ్ళలో,పుష్కరాలలో కుంభమేళాలో మరియు వివిధ సందర్భాలలో దేశవ్యాప్తంగా అనేక చోట్ల సేవా రూపంలో నేటికీ కొనసాగుతుంది.

6. స్వాతంత్ర్య సంగ్రామానికి ఆర్ఎస్ఎస్ సంపూర్ణ తోడ్పాటును అందించడమే కాకుండా, దేశ విభజన సమయంలో మతోన్మాదుల నుండి హిందువులను సంరక్షించడంలో ప్రధాన భూమిక పోషించింది.

7. స్వాతంత్ర ప్రారంభ రోజులలో జమ్మూ కాశ్మీర్ భారత్ లో విలీనం కావడం మొదలుకొని, నేటి ఆర్టికల్ 370 రద్దు వరకు స్వయంసేవకులు పట్టు వదలకుండా జమ్మూ కాశ్మీర్ రక్షణకు కృషి చేశారు.

8. పాకిస్తాన్ యుద్ధసమయంలో, చైనా దురాక్రమణ సమయంలో ఆర్ఎస్ఎస్ సైన్యానికి అండగా నిలిచి, ప్రాణ త్యాగాలకు సైతం వెనుకడుగు వేయకుండా దేశభూభాగాల సంరక్షణలో స్వయంసేవకులు ప్రధాన పాత్ర వహించారు.

9. 1975లో విధించబడిన ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ,ప్రజాస్వామ్య సంరక్షణకు 40 వేలకుపైగా సంఘ స్వయంసేవకులు అజ్ఞాతంగా శ్రమించి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించారు.

10. దేశంలో వరదలు, భూకంపాలు, సునామీ వంటి వివిధ ప్రకృతి విపత్తులు ఏర్పడినప్పుడు ఆర్ఎస్ఎస్ చేపట్టిన పునరావాస చర్యలు వివిధ సేవా కార్యక్రమాలు వెలకట్టలేనివి.

11. జాతి చారిత్రక కట్టడాల సంరక్షణలో, జాతి మాన బిందువుల పునర్నిర్మాణం కొరకు సంఘ స్వయం సేవకులు చేసిన ఉద్యమాలు సమాజంలో ఒక సామూహిక శక్తిని నిర్మాణం చేశాయి. ఫలితంగా నేడు "భవ్యరామమందిర నిర్మాణం" మన కళ్ళ ఎదుట నిలబడింది.

12. కులవిభేదాల ప్రస్తావన లేని హిందూ సమాజంలో "సమరసత" కొరకు స్వయంసేవకుల ద్వారా అనేక నిర్మాణాత్మక ప్రయోగాలు నేడు దేశమంతటా నిర్వహించబడుతున్నాయి.

13. జాతీయ జీవనంలో కార్మిక,కర్షక, విద్యార్థి , ఉపాధ్యాయ, ధార్మిక, మేధావి, మహిళ, విద్యా,సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ, చారిత్రక, స్వదేశీ, న్యాయ, సేవ, సహకార, వినియోగ, సైనిక,పత్రిక మొదలైన రంగాలన్నింటిలో సంస్థలు స్థాపించబడి నేడు సంఘపరివార్ గా పిలువబడుతున్నవి. ఇవన్నీ దేశవ్యాప్తంగా జాతీయ భావ జాగృతిని నిర్మాణం చేసి, వ్యవస్థల్లో పరివర్తనకు దోహదపడినవి.

14. నేడు సమాజ పరివర్తనకు ధర్మ జాగరణ, కుటుంబ ప్రబోధన్, సామాజిక సమరసత, గ్రామ వికాసం, గోసేవ, పర్యావరణం వంటి గతి విధులు ప్రారంభమయ్యాయి. దేశవ్యాప్తంగా వివిధ ప్రయోగాలు విజయవంతం అయ్యాయి.




15. శతాబ్ది ఉత్సవాలు వేళ పౌర విధులు, స్వదేశీ, కుటుంబ జీవన విలువలు, సామాజిక సమరసత,పర్యావరణం అంశాలపై ప్రత్యేక దృష్టి నిలిపిన ఆర్ ఎస్ ఎస్ సామాజిక మార్పుకి "పంచ పరివర్తన్" పిలుపునిచ్చింది.

ఆర్ ఎస్ ఎస్ అంటే సమగ్రత, ఆర్ ఎస్ ఎస్ అంటే సమన్వయం. ఆర్.ఎస్.ఎస్. అనేది ఒక చారిత్రక అవసరం. స్వయంసేవక్ ఏ పనినీ వదిలిపెట్టడు. స్వయంసేవక్ ఏ వ్యక్తిని వదిలిపెట్టడు. రండి- దేశ పునర్నిర్మాణ కార్యంలో మీరూ పాలు పంచుకోండి. విశ్వానికి మానవతా విలువలను పంచే మహాయజ్ఞంలో భాగస్వామ్యులం అవుదాం.

సామల కిరణ్
9949394688.

## అలనాటి,నేటి కాంగ్రెస్ సీనియర్ నాయకులు పొదిల రవికుమార్ కి దసరా శుభాకాంక్షలు

మున్నూరు కాపు జిల్లా నాయకులు





**అక్షర విజేత ఖమ్మం:-** 1990-91 నుండి నేటి వరకు ఖమ్మం జిల్లా రాజకీయాలలో తనదైన శైలి లో , తనకంటూ ఒక చెరగని ముద్ర వేసుకున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరెవరో కాదు ఆ మహోన్నతమైన వ్యక్తి ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొని నేటి వరకు కూడా ఆనాటి ముఖ్య మంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి దీవెనలతో ఆనాటి మంత్రి చంద్ర శేఖర్ , పీవీ రంగయ్య నాయుడు దగ్గర నుండి నేటి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దీవెనల తో ఈ నాటి రాష్ట్ర వ్యవసాయ శాఖ తుమ్మల నాగేశ్వరరావు వరకు ఒక క్రమశిక్షణ తో ఒకే పార్టీ లో కొనసాగుతూ ఉన్నటువంటి వ్యక్తి జిల్లా లో పరిచయం అక్కరలేని పేరు పొదిల రవికుమార్.అప్పటినుండి ఇప్పటివరకు తనను నమ్ముకున్నవారిని ఆప్యాయత గా పలకరిస్తూ వారికి సలహాలు సూచనలు ఇస్తూ వారికి పదవులు ఇచ్చి , ఇప్పించి అందరి తలలో నాలుక మాదిరి గా ఉంటూ పదవి ఉన్నా పొంగకుండా లేకున్నా క్రుంగిపోకూడా తను నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ లో కొనసాగుతూ మీరు భవిష్యత్ లో కూడా ఎంతోమందికి ఆదర్శం గా ఉంటూ ఉన్నత పదవులు అదిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము . అలనాడు ఖమ్మం జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా ఉండి ఇందిరాగాంధీ , రాజీవ్ గాంధీ దీవెనలు పొంది ఎంతోమంది కీ ఖమ్మం నగరం లో పదవులు ఇచ్చి అందరికీ ఆదర్శప్రాయుడైన వ్యక్తి , వివాదాలు లేని వ్యక్తి పొదిల రవి కుమార్ మీకు ఆ భగవంతుని ఆశీస్సులు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను . మాకు లభించిన అలనాటి జ్ఞాపకాలు , న్యూస్ పేపర్ కటింగ్ పిక్స్ లో చూడండి .... జై కాంగ్రెస్ , జై జై కాంగ్రెస్ జై శ్రీమతి సోనియా గాంధీ , జై రాహుల్ గాంధీ , జై రేవంత్ రెడ్డి , జై మల్లు భట్టి విక్రమార్క , జై తుమ్మల నాగేశ్వరరావు , జై పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

## జీవించే హక్కును హరిస్తున్న బిజెపి

రాజ్యాంగ వ్యతిరేక బిజెపి పాలన.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహా.



**అక్షర విజేత వనపర్తి ప్రతినిధి :** కేంద్ర హెూం మంత్రి అమిత్ షా మావోయిస్టులను మార్చి 2026 లోగా హతమారుస్తామనటం రాజ్యాంగ వ్యతిరేకమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ అన్నారు. బుధవారం వనపర్తి సిపిఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి విజయరాములు అధ్యక్షతన జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా బాల నరసింహ పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం జీవించే హక్కును ప్రతి ఒక్కరికి కల్పించిందన్నారు. రాజ్యాంగబద్ధ పదవిలో కొనసాగుతూ అమిత్ షా ఇలాంటి వ్యాఖ్యలు చేయటం నియంత ధోరణికి నిదర్శనం అన్నారు. కాల్పుల విరమణ చేసి చర్చలు జరపాలని ఎంతోకాలంగా మావోయిస్టులు కోరుతున్నా పెడచెవిన పెట్టటం సరికాదన్నారు. రాజకీయంగా, సిద్ధాంతపరంగా భిన్నభిప్రాయాలు ఉంటాయని ఆ కారణంగా చంపేస్తారా అని ప్రశ్నించారు. మావోయిస్టులను చర్చలకు పిలవాలన్నారు. దేశంలో బిజెపి ప్రజా వ్యతిరేక మతోన్మాద సంపన్న వర్గాల అనుకూల,విధానాలను అనుసరిస్తుందని ప్రతిఘటించి పోరాడేందుకు పార్టీ క్యాడర్లు సిద్ధం కావాలన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐదు జడ్పిటిసి, 15 ఎంపీటీసీ స్థానాలకు పోటీ. జిల్లాలో ఐదు జడ్పిటిసి, 15 ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేయాలని జిల్లా కౌన్సిల్లో నిర్ణయించామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నరసింహ చెప్పారు. అందుకు నాయకులు కార్యకర్తలు గ్రామాల్లో సిద్ధం కావాలన్నారు. గత అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్కు మద్దతు ఇచ్చి గెలిపించామని, భవిష్యత్తు ఎన్నికల్లో ఇదే రీతిలో కలిసి పని చేద్దామని ఆనాడు కాంగ్రెస్ నాయకులు మాట ఇచ్చారన్నారు. దానికి కట్టుబడి స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ కి సముచితమైన సీట్లు ఇవ్వాలన్నారు. వచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకుని పోటీ చేస్తామన్నారు. లేని పక్షంలో తమతో కలిసివచ్చే పార్టీల తో పొత్తు పెట్టుకుని పోటీలో దిగుతామన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, చంద్రయ్య, రమేష్, శ్రీరామ్, సీఎన్ శెట్టి, రాబర్ట్, మోష, అబ్రహం, భాస్కర్, డంగు కుర్మయ్య, వంక గోపాల్, శ్రీహరి, కుతుబ్, ఎర్రకురుమయ్య, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాగజ్ నగర్లో ప్రధాన రోడ్లు గుంతలమయం



**అక్షర విజేత కాగజ్ నగర్ ప్రతినిధి :** కాగజ్ నగర్ పట్టణంలోని ప్రధాన రహదారులన్ని గుంతలుగా ఏర్పడి ప్రమాదకరంగా మారాయిని స్థానికులు తెలుపుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలు రోడ్లపైకి చేరి గుంతలు ఏర్పడ్డాయని అన్నారు. అధికారులు స్పందించి ప్రమాదాలు నివారించడానికి గుంతలను పూడ్చి మరమ్మత్తులు చేయాలని పట్టణవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## శివన్న నగర్ లో దివాంగులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ లో పాల్గొన్న

ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి





**అక్షర విజేత ఎమ్మిగనూరు :** ఎమ్మిగనూరు పట్టణంలోని శివన్ననగర్లో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి. పర్యటించారు. ఈ సందర్భంగా అవ్వాతాతలకు, దివ్యాంగులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం కాలనీ వాసులతో సమావేశమై సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మగ్గం గుంతలో నీళ్లు చేరి ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న చేనేత కార్మికులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట పలువురు టీడీపీ, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

## అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే



**అక్షర విజేత వనపర్తి ప్రతినిధి :** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బుధవారం పెద్దమందడి మండలం మణిగిల, పెద్దమందడి, అల్వాల గ్రామాలలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా మొదట మని గిల్ల గ్రామంలోని హరిజనవాడలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని సందర్శించి దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం శివాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.పెద్దమందడి మండల కేంద్రంలోనీ చెన్నకేశవ ఆలయంలో ప్రతిష్టించిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం అల్వాల గ్రామా ఆలయంలో ప్రతిష్టించిన అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎక్స్ జడ్పిటిసి వెంకటస్వామి, మణిగిల్ల గ్రామ నాయకులు తిరుపతిరెడ్డి, మద్దిలేటి, సురేష్ , నరసింహ రెడ్డి, వెంకయ్య, చావ్వ రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## జీఎస్టీ పై మండల స్థాయిఅధికారులకు మరియు వ్యవసాయరైతులకు సదస్సు....





**అక్షర విజేత కోటనందూరు :** కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం కోటనందూరు మండలంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు సూపర్ జీఎస్టీ , సూపర్ సేవింగ్స్ పై మండల స్థాయి అధికారులు వ్యవసాయ రైతులకు సదస్సుకార్యక్రమం బుదవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తుని డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కె.కే.జే.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్డీఏ గవర్నమెంట్ జీఎస్టీ ని తగ్గించిందని దాన్ని రైతుల రైతులందరూ తెలుసుకోవాలి చెప్పారు. అలాగే జిఎస్టి ట్రాక్టర్ పైన 12% ఉన్న జి ఎస్ టి 7% తగ్గించి 5% మాత్రమే ఇవ్వడం జరిగింది.అలగే వ్యవసాయ యంత్రాలు పనిముట్ల పైన కూడా 7% జిఎస్ టి తగ్గింది అని చెప్పారు.అలాగే డ్రోన్ మీద ఉన్న 18% జిఎస్టి కూడా 13% తగ్గించి 5% మాత్రమే జిఎస్టి ఉంచడం జరిగింది అని చెప్పారు. అలాగే జిఎస్టి టి.మాధవి మాట్లాడుతూ సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ అని చెప్పడం జరిగింది దీనిని రైతులందరు వినియోగించుకోవాలని చెప్పారు. వివరించడం జరిగింది. అలాగే అగ్రి స్టాల్ ఏర్పాటు చేసి రైతులకు చూపించడం జరిగింది. తరువాత ట్రాక్టర్ తో ర్యాలీ, మానవహారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటనారాయణ, వెటర్నరీ డాక్టర్ రత్న తేజ, తాసిల్దార్ పీవీవి సత్యనారాయణ, ఏ పీ ఓ రాజగోపాల్, అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ ,టి. మాధవి ఏ ఈ ఓ జగ్గ అప్పారావు , ఈఓపి ఆర్ఆర్డి జై రామ్, ఎంపీఈవోలు, కార్యాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## గ్రూప్ 2 అభ్యర్థిని సన్మానించిన ఎమ్మెల్యే.



**అక్షర విజేత వనపర్తి ప్రతినిధి :** వనపర్తి పట్టణం పీర్లగుంటకు చెందిన నవీన్ కుమార్ గ్రూప్-2 పరీక్షల్లో 627 వ ర్యాంకు సాధించి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ గా ఉద్యోగం సాధించారు.ఈ సందర్భంగా బుధవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి తిరుమల హిల్స్ లోని తన నివాసంలో నవీన్ కుమార్ ను సన్మానించి అభినందించారు.కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఉపాధ్యక్షులు కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారులిబి

## శివంపేటమండల ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు.!

తాజా మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా.!!



**అక్షర విజేత, శివంపేట :** శివంపేట మండల ప్రముఖ సంఘ సేవకులు తాజా మాజీ జెడ్పీటిసి పబ్బ మహేష్ గుప్తా శివంపేట మండల ప్రజలకు అక్కా చెల్లెళ్లకు అన్నశివంపేట మండల ప్రజలకు అక్కా చెల్లెళ్లకు, అన్నా తమ్ముళ్లకు, శ్రేయోభిలాషులకు, అభిమానులకు, అధికారులకు, అనధికారులకు విజయదశమి పండుగ పర్వదినం పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపారు.

## పెన్షన్ పంపిణీ మరియు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమలలో పాల్గొన్న

మంత్రాలయం తెదేపా ఇంచార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి .



**అక్షర విజేత మంత్రాలయం (కోసిగి) :** కోసిగి మండలం నెలకోసిగి గ్రామంలో ఈరోజు స్థానిక నాయకులతో పాటు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేసిన మంత్రాలయం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి. అనంతరం వందగల్ గ్రామంలో సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో పాల్గొని చిన్న,సన్నకారు రైతులకు డ్రిప్పు మరియు స్ప్రింకర్ల పై జీఎస్టీ తగ్గించి సూపర్ గిఫ్ట్ ఎన్డీఏ ప్రభుత్వం రైతులకు ఇచ్చిందని తెలియజేశారు.ఆ తర్వాత అదే గ్రామంలో గ్రాంట్ లేక ఆగిపోయిన స్కూల్ బిల్డింగ్ పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి తొందర్లోనే బిల్డింగ్ పనిని మొదలుపెట్టిస్తా అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరయ్య, వ్యవసాయ అధికారి వరప్రసాద్,ముత్తు రెడ్డి మండల అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి,తోవి రామకృష్ణ , మార్కెట్ యార్డ్ చైర్మన్ నర్సిరెడ్డి,సొసైటీ చైర్మన్ నాడిగినేని అయ్యన్న,నాడిగినేని తాయన్న,అరివిలి వీరేష్,ఖాజా, జనసేన వీరారెడ్డి మరియు టిడిపి ఐటీడీపీ అనుబంధ ప్రజా ప్రతినిదులు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రాలయం చెరువును తలపిస్తున్న ఆర్టీసీ బస్టాండ్



**అక్షర విజేత మంత్రాలయం :** మంత్రాలయం ఆర్టీసీ బస్టాండు చిన్నపాటి చెరువును తలపిస్తోంది. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు బస్టాండ్ ప్రాంగణం మొత్తం జలమయమైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి నైట్ హాల్ట్ చేసే బస్సులు పార్కింగ్ చేసుకోవడానికి డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆర్టీసీ అధికారులు వర్షపు నీరు బయటకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## అంబరాన్నింటిన నవరాత్రి ఉత్సవాలు



**అక్షర విజేత పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో (తాడేపల్లిగూడెం) :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను తాడేపల్లి మండలం వీరంపాలెం బాలా త్రిపుర సుందరి పీఠంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. మహర్నవమి సందర్భంగా అమ్మవారిని బుధవారం చండీస్వరూపంలోనూ రాజరాజేశ్వరి స్వరూపంగాను అలంకరించి మూల మంత్రాలతో విశేష అర్చనలు హెూమాధి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఈలి వెంకట మధుసూదనరావు (నాని) దంపతులు, శ్రీ బాలా త్రిపుర సుందరి పీఠం ప్రతినిధి ఈమని శశి కుమార్ దంపతులు. సీఐ మూర్తి దంపతులు. కందుల శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ బాలా త్రిపుర సుందరి పీఠం నిర్వాహకులు బ్రహ్మశ్రీ వెంకటరమణ శాస్త్రి మాట్లాడుతూ ఈ సంవత్సరం నవరాత్రుల్లో అమ్మవారి సేవ ఒక రోజు ఎక్కువగా చేసుకునే అవకాశం కలగడంతో చండీస్వరూపంగాను రాజరాజేశ్వరి స్వరూపంగాను అమ్మవారి మూల మంత్రాలతో విశేష అర్చనలు జరిపించామని తెలిపారు. రేపు విజయదశమి పర్వదిన సందర్భంగా మహిషాసుర మర్ధనిగా అమ్మవారిని అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. భక్తులందరూ విచ్చేసి అమ్మవారిని దర్శించి తరించాలని కోరారు.

## చిగురుమామిడి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

### చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న పూర్వవిద్యార్థులు



**అక్షర విజేత:చిగురుమామిడి :** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల 2000-2001వ 10వ తరగతికి చెందిన దాదాపు 60మంది పూర్వ విద్యార్థులు 25సంవత్సరాలకు ఒకే వేదికపై బుధవారం కలిశారు.చిన్న ముల్కనూర్ లోని రాజా గార్డెన్స్ లో జూబ్లీహిల్స్ వేడుకలను నిర్వహించారు.గత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని రోజంతా సంతోషంగా గడిపారు.చిన్ననాడు చేసిన అల్లరి పనులు,గడచిన రోజులను,ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాలు,కుటుంబ పరిస్థితులు,జీవనోపాధి గురించి ఒకరినొకరు పలకరించుకున్నారు.కుటుంబ సమస్యలు,ఉద్యోగాలు,బిజీబిజీ జీవితంలోను అందరూ ఒకే చోట కలవడంతో పండగ వాతావరణం నెలకొంది.నాడు చదువు చెప్పిన గురువులను పిలిపించుకొని శాలువాలు కప్పి మెమొంటోలు అందజేసి గురువుల ఆశీర్వాదం తీసుకున్నారు.అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేసి ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు.సంతోషంలోనే కాకుండా ఎవరికి ఎలాంటి ఆపద వచ్చిన తోచిన సహాయం చేద్దామని నిర్ణయించుకున్నారు.ఈ కార్యక్రమంలో గురువులతోపాటు,పూర్వ విద్యార్థులు దొబ్బల బాబు,వంగపల్లి సంపత్, అనగోని శ్రీకాంత్,చిట్టుమల్ల వెంకటేశ్వర్లు, జ్యోతి,శ్రీలత,సౌమ్య,అజీర, సంతోష,రమేష్,శ్రీధర్, భాషవేణి రమేష్, మడమడకల రాజిరెడ్డి, అనగోని నరేందర్,నూనె రాజు, పన్యాల నాగార్జున రెడ్డి,చిలువేరి రాజు, బ్రహ్మచారి,రమణాచారి, చంద్రశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

## సంఘానికి యవనస్తులు బలమైన వారని వారి పాత్ర సంఘానికి చాలా అవసరం....





**అక్షర విజేత కోటనందూరు :** కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం కోటనందూరు మండలం సంఘానికి యవనస్తులు బలమైన వారని వారి పాత్ర సంఘానికి చాలా అవసరం అని సి బి ఎం ప్రెసిడెంట్ ఎన్ సురేష్ కుమార్ బాబు అన్నారు. కాకినాడ జిల్లా, కోటనందూరు మండలం, కోటనందూరు లో గల కెనడియన్ బాప్టిస్ట్ మిషన్ చర్చిలో యవ్వనస్తుల కూడిక జరిగింది. ఈ కూడిక రియల్ జాయ్ అనే థీమ్ తో తో జరిగింది. సురేష్ కుమార్ బాబు అధ్యక్షతన జరగగా సంఘం ఉద్దేశించి అధ్యక్షుడు మాట్లాడుతూ సంఘానికి యవ్వనస్తులకు బలమైన వారని వారి పాత్ర సంఘానికి చాలా అవసరం అని అందుకు ఇలాంటి యవనస్తుల కూడిక చాలా అవసరం అని తెలియజేశారు. సంఘ కాపరి రెవరెండ్ డాక్టర్ ఎం మరిడియ్య ప్రార్థన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గుంతకల్ నుండి ఆహ్వానింపబడిన బి ఇమ్మానుయేలు వాక్య సందేశం అందించారు. అసలు దేవుడంటే ఏమిటి దేవునికి ఉండవలసిన లక్షణాలు ఏమిటి వాటిని మనము తెలుసుకొని సంపూర్ణంగా విశ్వసించి కొనసాగితే దేవుని ఆశీర్వాదాలు పొందగలమని తెలియజేశారు. అనంతరం యవనస్తులను గ్రూపులుగా విభజించి బైబిల్ స్టడీ నిర్వహించారు. మధ్యాహ్నం భోజనాలు అనంతరము తుని నుండి ఆహ్వానింపబడిన ఈ జి ఎఫ్ టీమ్ వారు బ్రదర్ కే యోహాను ఆధ్వర్యంలో యవనస్తులకు క్విజ్ ప్రస్తుత దేనిని ఎలా ఉపయోగించుకుంటున్నారు- దేని ద్వారా వారి జీవితాలు పాడు చేసుకుంటున్నారు అనే అంశంపై ప్రాక్టికల్ టాక్ మరియు ఆటలు నిర్వహించారు. యువత వీటిలో చాలా చురుకుగా పాల్గొన్నారు. బ్రదర్ కె యోహాను వాక్య సందేశం తో యువతను బలపరిచారు. దేవునిపై ఆధారపడితే ఈ లోకంలో సంపాదించలేని నిజమైన శాశ్వతానందం పొందుతారనీ అన్నారు. ఎఈ కార్యక్రమంలో సెక్రెటరీ అల్లు అప్పలకొండ, ట్రెజరర్ కొరుప్రోలు కన్నబాబు, వైస్ ప్రెసిడెంట్ ఇజ్జుం రమణ, జాయింట్ సెక్రెటరీ నందిక రాము, జాయింట్ ట్రెజర్ జి ఏసురత్నం, సండే స్కూల్ సూపర్వైజర్ ఎన్ చిన్న సత్యనారాయణ, ఫీల్డ్ కౌన్సిల్ సెక్రెటరీ ఎన్ జాన్ విక్టర్, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాకరపల్లి గ్రామంలో శ్రీ మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన కాకరాపల్లి దుర్గామాత...







**అక్షర విజేత కోటనందూరు :** కాకినాడ జిల్లా, తుని నియోజకవర్గం కోటనందూరు మండలం, కాకరాపల్లి గ్రామంలో ఉన్న శ్రీ కనకదుర్గ ఆలయంలో 10 వ రోజు గణపతి పూజ, పంచామృతాభిషేకములు, హారతి, అలంకరణ అనంతరము మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వగా వందలాది మంది భక్తులు వచ్చి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు మాట్లాడుతూ గత పది రోజులుగా శరన్నవరాత్రి మహెూత్సవములు అమ్మవారి దీవెనలతో ఘనంగా జరుపుతున్నామని, ఈరోజు వాసం ఏడుకొండలు,పార్వతీ దుర్గ దంపతులచే పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయని, సాయంత్రం హెూమాలు అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు ఉంటాయని తెలియజేస్తూ, రేపు చివరి రోజు యధావిధిగా అన్ని కార్యక్రమాలతో పాటు మధ్యాహ్నము అన్న ప్రసాద వితరణ, సాయంత్రం షమీ పూజ, రాజరాజేశ్వరి దేవి హెూమాలు, పూర్ణ హారతి,అమ్మవారు హంస వాహనంపై తెప్ప మహెూత్సవం, రంగురంగుల బాణాసంచా లు, అనంతరం తీన్మార్ డప్పులతో అమ్మవారి ఊరేగింపు ఉంటుందని కావున ప్రతి ఒక్కరు వచ్చి ఈ కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వాసం నాగేశ్వరరావు, లంక ప్రసాద్, సామినీడి కృష్ణార్జున, పెనుముచ్చు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలి

### మెదక్ విభాగ్ సహ కార్యవాహ బి నర్సింలు



**అక్షర విజేత, పెద్ద శంకరంపేట్:** పెద్ద శంకరంపేట్ భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆర్ఎస్ఎస్ మెదక్ విభాగ్ సహ కార్యవాహ బి నర్సింలు అన్నారు.. పెద్ద శంకరంపేటలో టిటిడి కళ్యాణ మండపంలో రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన విజయదశమి ఉత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.. 1925 వ సంవత్సరంలో డాక్టర్ జి హెడ్గేవర్ రాష్ట్రీయ స్వయంసేవక సంఘ సంస్థను ప్రారంభించారని వివరించారు.. హిందూ సంఘటన ధ్యేయంగా నిరంతరం ఆర్ఎస్ఎస్ కృషి చేస్తుందని ఆయన అన్నారు.. ఆర్ఎస్ఎస్ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తవుతుందని వంద సంవత్సరాల రాష్ట్రీయ స్వయంసేవ సాధించిన విజయాలు తదితర విషయాలను వివరించారు. పంచ పరివర్తనలో భాగంగా కుటుంబ ప్రబోధన్ సామాజిక సమరసత స్వదేశీ పర్యావరణ పరిరక్షణ. పౌర విధులు అంశాలపై ఆయన వివరించారు.. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో స్వయం సేవకులు మహిళలు పాల్గొన్నారు.

## విజయదశమి సందర్భంగా శమీ పూజకు అన్ని ఏర్పాట్లు పూర్తి



**అక్షర విజేత సూర్యాపేట ప్రతినిధి :** విజయదశమి సందర్భంగా గురువారం సాయంత్రం జరుగు షమీ పూజ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హనుమంత రెడ్డి తెలిపారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో గల మండల పరిషత్ కార్యాలయంలో షమీ పూజ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయదశమి పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు భక్తుల సౌకర్యార్థం క్యూ లైన్ లో ఏర్పాటుతో పాటు షమీ పూజ నిమిత్తం జమ్మి చెట్టు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు రాజకీయ నాయకులు, పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు. క్యూ లైన్ లతోపాటు, మంచినీటి సౌకర్యం, లైటింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వీరి వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, శ్రీ సంతోషిమాత దేవాలయం ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి మురళీధర్, ఉపాధ్యక్షులు పబ్బా ప్రకాశరావు, గోపారపు రాజు , మున్సిపల్ సిబ్బంది వేణు తదితరులు పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్ సీతారామరావు కు శమీ పూజకు ఆహ్వానం



**అక్షర విజేత సూర్యాపేట ప్రతినిధి :** విజయదశమి సందర్భంగా గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు జరుగు శమీ పూజ కార్యక్రమంలో పాల్గొన వలసినది కోరుతూ అదనపు కలెక్టర్ సీతారామరావు కు బుధవారం కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్ లో శ్రీ సంతోషిమాత దేవాలయం ఉపాధ్యక్షులు పబ్బా ప్రకాశరావు, గోపారపు రాజు లు ఆహ్వాన పత్రిక అందజేశారు.వారివెంట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ మహెూత్సవం







**అక్షర విజేత సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నూతనకల్ లో 24 సంవత్సరాలు సుదీర్ఘ సేవలు భారతావనికి అందింపచేసి తిరిగి విచ్చేసిన సైనిక వీరుడు బండపల్లి సురేందర్ గౌడ్ స్వాగత ర్యాలీలో పాల్గొన్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ ఆయన మాట్లాడుతూ నేటి యువత మద్యానికి, గంజాయి,కి బానిసలు కాకుండా మన దేశాన్ని రక్షించే సైనికులు గా మారడానికి యువతరం ముందుకు రావాలి అని ఆయన అన్నారు ఈకార్యక్రమంలో ఏపూరి సోమన్న, జక్కుల మల్లేష్, సందీప్ జవాన్, మీర్ అక్బర్, ఆవుల అంజయ్య, వల్లాల బుచ్చయ్య యాదవ్, వట్టె లింగరాజు, మామిడి ఉదయ్, ఎర్పుల రాజు, కళ్ళేట్లపల్లి మహేష్,మరియు జవాన్ లు తదితరులు పాల్గొన్నారు

## అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందజేస్తాం

### జిల్లా కలెక్టర్ నాగరాణి



**అక్షర విజేత పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో (తాడేపల్లిగూడెం) :** జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్క రికి సామాజిక పింఛన్లను అందజేస్తామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తో కలిసి స్థానిక వినాయక నగర్ లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారుల ఆరోగ్య స్థితిగతులను, పిల్లల చదువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్ లో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను మహిళలు, ఆడపిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నెల నెల పొందుచున్న పెన్షన్ మొత్తంలో కొంత సొమ్మును దాచుకోవాలని, ఆర్థిక అవసరాలకు ఆసరాగా ఉంటుందని అన్నారు. అనంతరం వినాయక నగర్ లో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ తాడేపల్లిగూడెం పేరిట పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. తదుపరి తాలూకా ఆఫీస్ అన్న క్యాంటీన్ వద్ద పింక్ టాయిలెట్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్, ప్రభుత్వ విప్ శంకుస్థాపన చేశారు. బస్టాండ్ వెనుక భాగంలో సుమారు 7 ఎకరాలు విస్తీర్ణంలో ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమాల్లో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, ఇంచార్జ్ తహసిల్దార్ ఏ.కాళీ కృష్ణ , స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కలకోవ జిల్లాపరిషత్ హైస్కూల్ నందు చోరీ విలువైన వస్తువులను దొంగిలించిన దొంగలు

### తగు విచారణ చేసి దొంగతనం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

### పాఠశాలప్రధానోపాధ్యాయులు తేజోరామ్





**అక్షర విజేత మునగాల:-** మునగాల:మండలపరిధిలోని కలకోవ గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ నందు,మంగళవారం రాత్రి దొంగతనం జరిగింది, వివరాల్లోకి వెళితే జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల కలకోవ ప్రధానోపాధ్యాయులు తేజోరామ్ వివరాలు తెలియజేస్తూ, మంగళవారం రాత్రి సమయంలో పాఠశాలలో నాలుగు గదులు, ప్రధానోపాధ్యాయుల గది, %శీశీ%స్టాఫ్ రూమ్, సైన్స్ ల్యాబ్ రూమ్, తొమ్మిదవ తరగతి గది రూమ్, తాళాలు పగలగొట్టి పాఠశాలలోని ఈ క్రింద తెలిపిన వస్తువులను దొంగతనం చేయడం జరిగింది అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. దొంగలించినవస్తువుల వివరాలు:ఆరు బ్యాటరీలు, రెండు సౌండ్ సిస్టమ్స్, గ్యాస్ బండ, తగు విచారణ చేసి దొంగతనం చేసిన వ్యక్తులపై తగు చర్యలు తీసుకోవాలని మునగాల ఎస్సై బి ప్రవీణ్ కుమార్ కి పిటిషన్ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

## దేవీ నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోటు అశోక్ కుమార్ దంపతులు



**అక్షర విజేత మునగాల:-** మునగాల మండలం కొక్కిరేణి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పోటు అశోక్ కుమార్ ప్రశాంతి దంపతులు దేవి నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో కొక్కిరేణి గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రతి ఒక్కరు సుభిక్షంగా ఉండాలని అశోక్ కుమార్ దంపతులు అమ్మవారిని కోరారు.

# అందుబాటులో బ్లడ్ బ్యాంక్




**అక్షర విజేత పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో (తాడేపల్లిగూడెం) :** అత్యవసర పరిస్థితిలో రక్తం ఎంతో విలువైనది దృష్టిలో ఉంచుకొని తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తనిధిని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంకులో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తో కలిసి ఆమె బుధవారం ప్రారంభించారు. స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా సీమంతాలు, అన్నప్రాసన నిర్వహణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళలు, ఆడపిల్లలను ఆరోగ్యంగా ఉంచే లక్ష్యంతో మెడికల్ క్యాంపుల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నా మన్నారు. తొలుత రక్తదానం చేస్తున్న పోలీస్ అధికారులను, సిబ్బందిని అభినందించారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ అనుకోని ప్రమాదాలు ఎదురైనప్పుడు ప్రాణాలను కాపాడేందుకు రక్తం ఎంత విలువైనదన్నారు. రక్తం తయారు చేయలేనిదని, రక్తం సేకరణ ద్వారానే అది సాధ్యం అన్నారు. ఆసుపత్రికి వేలాదిమంది పేదలు ప్రతిరోజు వైద్యం నిమిత్తం వస్తారని అవసరమైన వారికి రక్తాన్ని ఉచితంగా అందజేస్తామని చెప్పారు. గతంలో ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ లేని కారణంగా బయట నుండి తెప్పించి వినియోగించాల్సి ఉండేదని, దీని వలన కాలయాపన కూడా జరిగేదన్నారు. రక్తాన్ని అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. తాడేపల్లిగూడెం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో ఇది రెండవ బ్లడ్ బ్యాంక్ అని, ఏరియా ఆసుపత్రికి సొంతంగా బ్లడ్ బ్యాంకు ను సమకూర్చుకోవడం చాలా సంతోషించదగిన విషయం అన్నారు. తాడేపల్లిగూడెం నేషనల్ హైవే పరిధిలో ప్రమాదాలకు గురైన సందర్భంలో అత్యవసరంగా రక్తం అవసరం అవుతుందని, నేడు ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆ సమస్య తీరిందన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం ద్వారా ప్రాణాలు కాపాడే సూత్రధారులు కావాలని పిలుపునిచ్చారు. స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రభుత్వ విప్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాంపు ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్సను, మందులను అందజేయాలని సూచించారు. ప్రతి ఒక్కరు ముందస్తు పరీక్షల ద్వారా అనారోగ్యం నుండి తమని తమరు కాపాడుకోవచ్చునని ఈ సందర్భంగా వెల్లడించారు. ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల సందర్భంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా ఏర్పాటుచేసిన పౌష్టికాహార వస్తువుల ప్రదర్శనను తిలకించారు. తల్లి, బిడ్డలకు బాలామృతాన్ని సక్రమంగా అందజేయడంతో పాటు, పౌష్టికాహారం వలన కలిగే ప్రయోజనాల పై వారికి అవగాహన కల్పించాలన్నారు. గర్భవతులకు సీమంతాలు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. చివరిగా రాష్ట్రీయ పోషణ మాసం - 2025 సెల్ఫీ పాయింట్ వద్ద జిల్లా కలెక్టర్, ప్రభుత్వ విప్, డిఎంహెచ్ఓ, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి సెల్ఫీని దిగడం ద్వారా ప్రచారాన్ని ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ డాక్టర్ జి.గీతా బాయి, డి సి హెచ్ ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, ఐసిడిఎస్ పి.డి డి.శ్రీలక్ష్మి, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.రవిపాల్, సిడిపిఓ టి.ఎల్ సరస్వతి, స్థానిక జె.ఎస్.పి నాయకుడు వర్తనపల్లి కాశీ, ట్రైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆసుపు స్వామి, స్థానిక ప్రజాప్రతినిధులు సుబ్బరాజు, తాతాజీ, శ్రీను, రఘు, ఆసుపత్రి వివిధ విభాగాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుకు బాసటగా జిఎస్టి స్లాబ్ మదింపు

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి




**అక్షర విజేత పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో (తాడేపల్లిగూడెం)హా:** రైతు బాగుంటేనే జిల్లా, రాష్ట్రం, దేశం బాగుంటాయని, రైతుకు బాసటగా నిలిచేందుకు జిఎస్టి స్లాబులను మదింపు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం తాడేపల్లిగూడెం ఎస్వీఆర్ సర్కిల్ నందు సూపర్ జీఎస్టీ ..సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా వాణిజ్య పన్నులు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వ్యవసాయ పనిముట్లు, యంత్ర పరికరాల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్, జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు జీఎస్టీ నోడల్ అధికారి టి.రాహుల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. జిఎస్టి తగ్గింపుకు ముందు తర్వాత రైతులకు కలిగిన ఆర్థిక ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిఎస్టి సవరించిన రేట్లు సెప్టెంబర్ 22 నుండి అమల్లోకి వచ్చాయని, పేద మధ్యతరగతి వర్గాల ప్రజలకు, రైతుల సంక్షేమానికి దోహదపడుతుందన్నారు. జీఎస్టీ స్లాబులు తగ్గింపుతో వివిధ వస్తువులు, సేవల తగ్గడం వలన కలిగే ప్రయోజనాల గురించి లబ్ధిదారుల్లో అవగాహన పెంచడానికి ఒక నెల రోజులు పాటు ప్రచారాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ లో భాగంగా, వ్యవసాయ రంగం, వ్యవసాయ అనుబంధ రంగాలలో ప్రయోజనాలను వివరిస్తూ.. ట్రాక్టర్లకు %+ూ% 12% నుంచి 5% కు తగ్గినది మరియు ట్రాక్టర్ విడిభాగాలు, టైర్లు, హైడ్రాలిక్ పంపుల పన్ను 18% నుంచి 5% కు తగ్గిందన్నారు. ఎరువుల ముడి పదార్థాలపై 18% నుంచి 5 % వరకు, బయో -పురుగు మందులు మరియు సూక్ష్మ పోషకాలపై 12 % నుంచి 5% వరకు తగ్గాయన్నారు. సౌర శక్తితో నడిచే పరికరాల మీద కూడా 12 % నుంచి 5% నికి తగ్గించడం జరిగిందని, స్ప్రింక్లర్లు, బిందు సేద్యం థ్రెషర్లు, కంపోస్ట్ యంత్రాలపై జిఎస్టి 5 % కి తగ్గిందన్నారు. క్షీర పరిశ్రమలో పాలు మరియు చీజ్ పై జీఎస్టీ లేదని, వెన్న మరియు నెయ్యి మీద 12 % నుంచి 5 % వరకు జీఎస్టీ ని తగ్గించడం జరిగిందన్నారు. ఆహార శుద్ధి పరిశ్రమలో తయారుచేసిన, నిలువ చేసిన కూరగాయలు, పండ్లు, గింజలపై 12 శాతం నుంచి 5% వరకు తగ్గిందని, ఆక్వాకల్చర్ మరియు తేనెటీగల పెంపకం, చేపల ఉత్పత్తులపై 12 % నుంచి 5 % శాతంకి జిఎస్టి తగ్గించబడినదని తెలిపారు. సహజ సిద్ధమైన తేనెపై జీఎస్టీ తగ్గించడం వల్ల తేనెటీగల పెంపకం చేసే వారికి ప్రయోజనం కలుగుతుందన్నారు. జీఎస్టీ తగ్గించడం కారణంగా రైతులు వ్యవసాయ పనిముట్లు మరియు వ్యవసాయ ఉత్పత్తులను తక్కువ ధరకే పొందగలుగుతారన్నారు. దీని ఫలితంగా వ్యవసాయ ఖర్చులు తగ్గి, అధిక దిగుబడిని సాధించడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకత, గ్రామీణ ఆదాయం, ఆహార భద్రత మెరుగుపడతాయని తెలిపారు. తాడేపల్లిగూడెం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జిఎస్టి స్లాబులు తగ్గింపు కారణంగా రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల ఆదాయాన్ని కోల్పోయినప్పటికీ రైతులకు, సామాన్య మధ్యతరగతి ప్రజలకు మేలు జరుగుతుందనే ధ్యేయంతో మన ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవడం జరిగింది అన్నారు. అన్ని వర్గాల ప్రజలు, రైతులు జీఎస్టీ ఆర్థిక ఫలాలను పొంది, ఆర్థికంగా లాభపడాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు జీఎస్టీ మోడల్ అధికారి టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఏలూరు డివిజన్ వాణిజ్య పన్నుల డిప్యూటీ కమిషనర్ కెపి శైలజ శ్రీ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జెడ్.వెంకటేశ్వరరావు, వాణిజ్య పన్నుల శాఖ భీమవరం, తణుకు సర్కిల్స్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్లు వి.కేదారేశ్వర రావు, కె.వి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, ఇన్చార్జి తహసీల్దార్ ఎ.కాళీ కృష్ణ, భవన నిర్మాణ శాఖ చైర్మన్ వలవల బాబ్జి, భారతీయ జనతా పార్టీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, ముత్యాల ఆంజనేయులు, ఆకాశపు స్వామి, అధికారులతో పాటు కూటమి నాయకులు కార్యకర్తలు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎక్కడ!




బిజెపి రాష్ట్ర నాయకులు కురువ చిన్న మల్లయ్య.

**అక్షర విజేత,చిన్నంబావి :** చిన్నంబావి మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య ఆధ్వర్యంలో బిజెపి పార్టీ కార్యాలయంలో పత్రిక సమావేశం నిర్వహించారు. నాగర్ కర్నూల్ జిల్లా జనరల్ సెక్రెటరీ జగ్గరి శ్రీధర్ రెడ్డి, మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు కురువ చిన్న మల్లయ్య, ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక%శీ%గా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఉచిత బస్సు, ఉచిత కరెంటు, ఉచిత సిలిండర్, ఇస్తున్నా%శీ% అంటూ చెప్తున్నారు కానీ గ్రామాలలోని స్థానిక సమస్యలపై అభివృద్ధి పనుల విషయంలో పట్టించుకోవడం లేదన్నారు. ఆరు గ్యారెంటీలు ఎక్కడ కూడా అమలైన దాఖలాలు లేవన్నారు. మహిళలకు 2500 భృతి, రాజీవ్ యువ వికాస%శీ% పేరుతో యువతను కాంగ్రెస్ మోసం చేసిందని అన్నారు. ఏటా రైతులకు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరానికి రూ.15 వేలు వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేలు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తాం అన్ని చెప్పి అమలు పరచలేదన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళల పింఛన్ రూ.4వేలకు పెంచుతాం అన్నారు కానీ అమలు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ నాయకులు మండిపడ్డారు. పేదల సొమ్ముతో పెద్దల బడా బాబులా అప్పు మాఫీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని అన్నారు. పెద్దల అప్పులను మాఫీ చేస్తూ, పేద ప్రజల డబ్బును వృథా చేస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకులు కురువ చిన్న మల్లయ్య తీవ్రంగా మండిపడ్డారు. ఇది ప్రజల సొమ్ము, ప్రజా పనుల రూపంలో వినియోగించాల్సిన నిధులు అని ప్రశ్నించారు. హిందువుల పండుగల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కూడా నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి హిందూ పండుగలకే బస్సు ఛార్జీలను 50% పెంచడం, మరోవైపు మహిళలకు ఆధార్ చూపిస్తే ఉచిత ప్రయాణం ఇస్తామనే వాగ్దానం చేసి, వాస్తవానికి భార్య ఉచితంగా వెళ్తే భర్తపై పూర్తి భారం మోపడం దుర్మార్గమని మండిపడ్డారు. దసరా పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్తున్న ప్రజలకు అదనంగా భారం మోపడం హిందువుల పట్ల అన్యాయమని పేర్కొన్నారు. మండల అధ్యక్షులు బొగ్గు కురుమయ్య మాట్లాడుతూ ఒక చేతితో ఉచితమని చెప్పి, మరో చేతితో భారాన్ని పెడుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఎలా క్షమిస్తారు అంటూ బీజేపీ నాయకులు ప్రశ్నించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గట్టి బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలందరూ గమనిస్తున్నారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందని ప్రజలందరూ బీజేపీ వైపే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చా అధ్యక్షులు కేతపగ విజయకుమార్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు కత్తి జానీ, ఉగ్ర నరసింహ, మండల ఉపాధ్యక్షులు గణేష్ రెడ్డి, న%శీ%ది శేఖర్ రెడ్డి, రాజ వర్ధన్ రెడ్డి, పసుల గోపాల్ నాయుడు, వెల్టూరు నాగ మద్దిలేటి, కత్తి రాజు, తగరం బాలక్రిష్టి, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ కేంద్రంలో జరిగిన దొంగతనాన్ని 24గంటల్లోనే చేదించిన సూర్యాపేట పోలీసులు

ఇంట్లో పని చేసే పనిమనిషి దొంగతనానికి పాల్పడింది.

మొత్తం 55 లక్షల విలువైన సొత్తు రికవరీ.

53 లక్షల విలువైన 43.6 తులాల బంగారము,

రూ.1.75 లక్షల నగదు సీజ్ చేసిన సూర్యాపేట పట్టణ పోలీసులు.

వివరాలు వెల్లడించిన నరసింహ ఐపిఎస్, ఎస్పి సూర్యాపేట జిల్లా.

డీఎస్పీ ప్రసన్నకుమార్ సిఐ వెంకటయ్య ఎస్సై శివతేజ



**అక్షర విజేత సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట పట్టణం కృష్ణానగర్ కాలనీలో 80 సంవత్సరాల ఒక వృద్ధురాలు ఇంట్లో జరిగిన దొంగతనం కేసును సూర్యాపేట పట్టణ పోలీసులు, సీసీస్ పోలీసులు సంయుక్తంగా ఛేదించారు. కేసు వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ నర్సింహా ఐపీఎస్ వెల్లడించారు. కేసును ఛాలెంజింగ్ తీసుకుని కేసులో ఉన్న ఆధారాలతో సూర్యాపేట పట్టణ మరియు సీసీస్ పోలీసులు ఒక్కరోజులోనే కేసు ఛేదించారు. బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు దొంగతనం నమోదు చేసి త్వరితగతిన దర్యాప్తు చేశారు.

**నిందితుల వివరాలు :**

1) కరీమా బేగం వయసు 45 సంవత్సరాలు, నాయకెన్ గూడెం గ్రామం, కూసుమంచి మండలం, ఖమ్మం జిల్లా, ప్రస్తుతం కృష్ణా నగర్ కాలనీ, సూర్యాపేట పట్టణం.

**స్వాధీనం వివరాలు :**

1. 40 తులాల బంగారు బిస్కెట్లు.
2. 3.6 తులాల చంద్రహారం (కూసుమంచి ఎస్బిఐ బ్యాంకు లో ఉన్నది)
3. రూ.1.75 లక్షల నగదు. (మొత్తం విలువ 55 లక్షలు )

కృష్ణానగర్ కాలనీలో వృద్ధురాలు ఒంటరిగా ఉంటున్నది, ఈమె కుమారులు ముగ్గురు హైద్రాబాద్ లో ఉంటారు, ఈ వృద్ధురాలికి సేవలు చేయడం కోసం వృద్ధురాలు కుమారులు పనిమనిషిని ఏర్పాటు చేశారు. నమ్మకంగా పనిచేస్తూ వృద్ధురాలి వద్ద తాళం చేతులు గమనించి ఆమె ఇంట్లో ఉన్న 40 తులాల బంగారు బిస్కెట్లు (4 బిస్కెట్లు), మూడున్నర తులాల బంగారు చంద్రహారం, నగదును అపహరించింది. వృద్ధురాలి కుమారులు ఇంట్లో బంగారం కనిపించకపోవడంతో సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ నందు తేదీ 29/9/2025 రోజున ఫిర్యాదు చేశారు. బాధితుని ఫిర్యాదు పై దొంగతనం కేసు నమోదు చేసిన పట్టణ పోలీసులు దర్యాప్తు చేయడం జరిగింది, దర్యాప్తులో భాగంగా వృద్ధురాలి ఇంటి వద్ద అనుమానాస్పదంగా ఉన్న పనిమనిషి కరీమా బేగం, వయసు 45 సంవత్సరాలు, నాయకెన్ గూడెం గ్రామం, కూసుమంచి మండలం, ఖమ్మం జిల్లా, ప్రస్తుతం కృష్ణా నగర్ కాలనీ, సూర్యాపేట పట్టణం మహిళలను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నది. ఆమె వద్ద నుండి 40 తులాల బరువు గల నాలుగు బంగారు బిస్కెట్లు 1.75 లక్షల రూపాయల నగదును, మూడున్నర తులాల ఛంద్రహారం తాడు (బ్యాంక్ లో ఉన్నది) సీజ్ చేసి ఈరోజు కోర్టుకు హాజరు పరచడం జరుగుతుంది. బంగారం విలువ 53 లక్షలు నగదు కలుపుకొని మొత్తం 55 లక్షల సొత్తును సూర్యాపేట పట్టణ పోలీసులు రికవరీ చేశారు. నిందితురాలు కోర్టుకు రిమాండ్ నిమిత్తం హాజరు పరచడం జరుగుతుంది. ఎస్పి వెంట సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్, పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఎస్సై%×% లు ఎస్సై శివతేజ, సురేష్, సిబ్బంది ఉన్నారు. ఈ కేసులో బాగా పనిచేసిన సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, సీసీస్ ఇన్స్పెక్టర్ శివకుమార్, ఎస్సై శివతేజ, ఎస్ఐ సురేష్, సూర్యాపేట పట్టణ పోలీసు సిబ్బందిని, సిసిఎస్ సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించి రివార్డ్స్ అందించడం జరిగింది.

# తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో మహంకాళి దేవాలయంలో దుర్గా భవాని మాత పూజల్లో కాంగ్రెస్ నాయకులు



**అక్షర విజేత మసాయి పేట్ :** మెదక్ జిల్లా తూప్రాన్ లో మహంకాళి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గా భవాని మాత వద్ద మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, చందాయిపేట సర్పంచ్ బుడ్డ భాగ్యరాజ్ తన మిత్రులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.తరువాత దుర్గా భవాని సేవా సమితి అధ్యక్షుడు శాద కోటేశ్వరరావు, సర్పంచ్ బుడ్డ భాగ్యరాజ్ ను ఘనంగా శాలువాతో సన్మానించి, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "దుర్గా భవాని మాత ఆశీస్సులతో బుడ్డ భాగ్యరాజ్ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో, సుఖ శాంతులతో ఉండాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ డాక్టర్ అప్సర్ భాయ్, లయన్ కుమ్మరి రమేష్, గెంటియాల నాగరాజు, పన్నీరు రాము, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అక్బర్ , సీనియర్ జర్నలిస్ట్ లయన్ డాక్టర్ జానకిరామ్ సిఆర్ తదితరులు పాల్గొన్నారు.

# దసరా సెలవులకు ఉరెళ్తున్నారా... జాగ్రత్త సుమా..!

పండగలకే పడగ విప్పుతున్న గజదొంగలు

తాళాలు వేసి ఉన్న ఇండ్లకే దొంగల టార్గెట్

ఎలక్ట్రిషన్స్, ప్లంబర్, గ్యాస్ స్టవ్ రిపేర్, వివిధ పనుల పేరిట గస్తీ

ఉమ్మడి గోపాల్పేట్ ఎస్సైలు రేవల్లి సబ్ ఇన్స్పెక్టర్ రజిత, గోపాల్పేట్ సబ్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్





**అక్షర విజేత ఉమ్మడి గోపాల్పేట్ :** ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్తున్నారా .! అయితే మీ సమీప పోలీసుస్టేషన్ లో సమాచారం ఇవ్వండి...దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచుతారు.దసరా పండుగ సెలవుల నేపథ్యంలో సొంత ప్రాంతాలకు వెళ్ళే వారు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి గోపాల్పేట్ పోలీసు అధికారులు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఊళ్లకు వెళ్లే వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్ళకు తాళం వేసి సొంత గ్రామాలకు వెళ్లే వారు ఇళ్ళల్లో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, డబ్బులు ఉంచవద్దని ఉమ్మడి పోలీసు అధికారులు తెలిపారు. విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో గానీ, లాకర్లు లేని వారు వాటిని తమ తెలిసిన వారి ఇళ్ళల్లో లేదా బంధువుల ఇళ్ళల్లో భద్రపరుచుకోవాలన్నారు. ఇళ్ళకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్ళే వారు ముందస్తుగా సమీప పోలీసు స్టేషన్లో సమాచారం అందించాలన్నారు. దొంగతనాలు జరగకుండా గస్తీ పోలీసులు ఆయా ప్రాంతాలలో రాత్రి వేళ ప్రత్యేక నిఘా ఉంచుతారని జిల్లా పోలీసు అధికారులు తెలిపారు. దసరా సెలవులకు తమ స్వంత ఊర్లకు వెళ్లే వారు ఈ క్రింది సూచనలు, సలహాలను ప్రతి ఒక్కరూ పాటిస్తే మంచిదన్నారు. ఇళ్ళల్లో నగదు, బంగారు, వెండి,ఇతర విలువైన ఆభరణాలు ఉంచుకోరాదన్నారు.' కొందరు తమ బ్యాగుల్లో నగదు, బంగారు, ఇతర ఆభరణాలను ఉంచుకుని బస్సుల్లో, ఇతర వాహనాలలో ప్రయాణం చేసే సమయంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉంది. కావున తగిన జాగ్రత్తలు పాటించాలి. ఎలక్ట్రిషియన్లు, ప్లంబర్లు, కార్పెంటర్లు, గ్యాస్ స్టవ్ రిపేర్ పేరిట వచ్చే అనుమానిత వ్యక్తులను అనుమతించకూడదు. కాలనీలలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతూ వుంటే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. లేదా డయల్ 100నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి.' అని పోలీసులు తెలిపారు.

**పండగలకే పడగ విప్పుతున్న గజదొంగలు**

చిన్న చితక్క దొంగలు అప్పుడప్పుడు పోలీసులకు పట్టుబడుతూ ఉంటారు కానీ దొంగతనంలో ఆరు పేరిన గజదొంగలు మాత్రం పండగలపుడే తమలోని బ్రహ్మ అస్త్రమం ఉపయోగిస్తున్నారు. మనము జాగ్రత్తగా లేకపోతే వాళ్లు క్షణాలు ఇంటిని కాళీ చేసి పారిపోతూ ఉంటారు. దొంగల కన్నా మనము ఒక అడుగు ముందు ఉండి స్థానిక పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇచ్చి పోవడం ఉత్తమం

**తాళాలు వేసి ఉన్న ఇండ్లకే దొంగల టార్గెట్**

కాయ్ రాజా కాయ్ అనే విధంగా దొంగలకు తాళాలు వేసి ఉన్న ఇండ్లను చూస్తే నక్క తోక తొక్కినం రా అంటూ గుట్టు చప్పుడు కాకుండా తమ పనిని తాము చేసుకొని బయటపడతారు. తీరా మనం వచ్చి చూసుకునేసరికి మనం దాచుకున్న నగదు లేదా సొమ్ములు మాయమవుతాయి. అయ్యో దేవుడా అన్నా కూడా ప్రయోజనం ఉండదు కావున ఇంటికి సీసీ కెమెరా లేదా పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వడం గానీ చుట్టుపక్కల వాళ్ళకి చెప్పి వెళ్లడం గాని చేయడం మంచిది.

**ఎలక్ట్రిషన్స్, ప్లంబర్, గ్యాస్ స్టవ్ రిపేర్, బట్టలు అమ్ముతాము వివిధ పనుల పేరిట గస్తి**

పలానా ఊరిలో ఏ ఇల్లు తాళం వేసి ఉంది ఎక్కడ దొంగతనం చేస్తే బయటపడతాము ఎలా తప్పించుకోవాలి అనే విధంగా దొంగలు వీధి వీధిలో మేము ఫలానా పని చేస్తాము అంటూ అనగా ఎలక్ట్రిషన్, ప్లంబర్ గ్యాస్ స్టవ్ రిపేర్, బట్టల అమ్ముతము అంటూ ఎక్కడెక్కడ ఇల్లు తాళాలు వేసి ఉన్నాయి. ఎక్కడ అనుకూలంగా ఉంది చూసుకొని ఆ ఇంటిపై దొంగతనం చేయనీకే రెడీ అవుతూ ఉంటారు. కావున వీధిలో ఎవరైనా అనుమానాస్పదంగా గా కనిపించిన పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలి లేదా 100 నెంబర్ కు ఫోన్ చేసి చెప్పాలి

# అమ్మవారిని ఆరాధిస్తే జ్ఞాన,మోక్ష ప్రాప్తి లభిస్తుంది

ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ కుమార్ రెడ్డి

కొత్తూరులో దుర్గామాత మండపాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన నవీన్ రెడ్డి

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్



**అక్షర విజేత షాద్నగర్ :** దుర్గామాత అమ్మవారిని ఆరాధిస్తే జ్ఞాన,మోక్ష ప్రాప్తి లభిస్తుందని ఎమ్మెల్సీ నాగరికుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు.కొత్తూరు మున్సిపాలిటీలో జై భవాని సేవా సమితి యూత్ శ్రీనివాస్ రెడ్డి,యాదగిరి చారి,గణేష్ గౌడ్,కటికే జాంగిర్,బండి కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నాగరికుంట నవీన్ కుమార్ రెడ్డి దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నవరాత్రుల్లో నిత్యం అమ్మవారిని కొలిస్తే ఆత్మశుద్ధి అవుతుందని, పాపాలు క్షీణిస్తాయని పేర్కొన్నారు.తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలలో అత్యంత భక్తిశ్రద్ధలతో కూడిన ఉత్సవాలు నిర్వహించే ఏకైక పర్వదినాలు దసరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు చెప్పారు. అమ్మవారిని ఆరాధించడంతోపాటు మహిళలను గౌరవిస్తూ, వారి గొప్పతనాన్ని సమాజానికి చాటే విధంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను జరుపుకుంటామని చెప్పారు. తెలంగాణ మహిళలంతా సంతోషంగా బతుకమ్మను వాడి మన సంస్కృతికి నిలువెత్తు నిదర్శనం గా నిలుస్తారని, ప్రతి పండుగలో మహిళలను గొప్పగా చూపే కార్యక్రమాలు ఉండడం మన తెలంగాణ ప్రత్యేకత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్,మునిసిపల్ చైర్మన్ లావణ్య దేవేందర్ యాదవ్,కౌన్సిలర్ మాదారం నరసింహులు గౌడ్,నాయకులు శ్రీనివాస్ రెడ్డి,బండి క్రిష్ణ,యాదగిరి చారి,జి.గణేష్ గౌడ్,శివ చారి,సాగర్ అనిల్ మరియు జై భవాని యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా..... సీఎం సహాయం నిధి



**అక్షర విజేత మెంటాడ :** మెంటాడ మండలంలో వివిధ గ్రామాలకు చెందిన వివిధ రకాల రోగాలతో బాధపడుతున్న పేదలకు నిరంతరం అండగా ఉండే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమే అని, ప్రతి ఒక్క పేదవానికి సహాయం చేయాలని ఉద్దేశంతో సీఎం సహాయ నిధి క్రింద అర్హులైన వారికి నగదు రూపంలో ఆసుపత్రులకు అయ్యే ఖర్చులు కోటమి ప్రభుత్వం చెల్లిస్తుందని రాష్ట్ర గిరిజన సంక్షేమ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. నియోజకవర్గంలో మెంటాడ మండలంలో వివిధ గ్రామాల నుంచి మజ్జి కన్నమనాయుడు ( ఇప్పలవలస)135000, జొన్నాడ సత్యం( బడే వలస)104200, దాడి అప్పలనాయుడు( కొంపింగి) 40000 సీఎం సహాయనిధికి ఎంపికై నందున చెక్కులను మంత్రి సంధ్యారాణి అందజేశారు. ఆర్థిక సాయం అందుకున్న లబ్ధిదారులు సీఎంకు, మంత్రి సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెంటాడ మండల పార్టీ అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు గెద్ద అన్నవరం, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు గుమ్మడి సింహాచలం, గెద్ద కాశి విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు

### ఐదురోజుల నష్టాలకు బ్రేక్

## లాభాల బాటపట్టిన స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. దాదాపు ఐదు రోజుల అనంతరం మార్కెట్లు లాభాల బాట పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల పవనాలతో పాటు అమెరికా ద్రవ్యోల్బణం తగ్గాయన్న నివేదికలు దేశీయ మార్కెట్లపై సానుకూల ప్రభావం చూపాయి. కిత్రం సెషన్‌తో పోలిస్తే 78,488.64 పాయింట్ల వద్ద లాభాల్లో సెన్సెక్స్ మొదలైంది. ఇంట్రాడేలో 78,189.19 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యధికంగా 78,918.12 పాయింట్లకు చేరింది. చివరకు 498.58 పాయింట్లు పెరిగి.. 78,540.17 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 165.95 పాయింట్లు పెరిగి.. 23,753.45 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో దాదాపు 1,565 షేర్లు పురోగమించగా.. 2,348 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన వాటిలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఐటీసీ, హిందాల్కో ఇండస్ట్రీస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ట్రెంట్ ఉన్నాయి. ఇక హీరో మోటోకార్ప్స్, మారుతీ సుజుకీ, నెస్లే ఇండియా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫిన్‌సర్వ్ నష్టపోయాయి. సెక్టార్లలో బ్యాంక్, ఎఫ్ఎంసీజీ, మెటల్, ఆయిల్, గ్యాస్, ఎనర్జీ, రియల్టీ 0.5శాతం నుంచి ఒకశాతం వరకు పెరిగాయి. మీడియా ఇండెక్స్ 0.4 శాతం పతనమైంది. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ స్వల్పంగా పెరగ్గా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.6 శాతం పతనమైంది.

## ఒక్కటైన నిస్సాన్, హెూండా ప్రకటన చేసిన రెండు కంపెనీలు

జపాన్‌కు చెందిన రెండు ప్రముఖ కంపెనీలు ఇప్పుడు ఒక్కటయ్యాయి. నిస్సాన్, హెూండా కంపెనీలు జతకలిశాయి. ఈ విషయాన్ని ఆ కంపెనీలు ఇవాళ సంయుక్త ప్రకటన ద్వారా వెల్లడించాయి. ఒప్పంద పత్రాలపై సంతకాలు కూడా చేశాయి. నిస్సాన్ అలియన్స్ సభ్యుడు మిత్‌సుబిషి మోటార్స్ కూడా ఈ కలియికకు అంగీకరించింది. ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆటోమేకింగ్ కంపెనీగా ఏర్పడబోతున్నట్లు ఆ రెండు కంపెనీలు సంయుక్తంగా ప్రకటించాయి. హెూండా ప్రెసిడెంట్ తోషిహిరో మైబ్ మాట్లాడుతూ.. జాయింట్ హెూల్డింగ్ కంపెనీ కింద హెూండా, నిస్సాన్ తమ ఆపరేషన్స్ చేపట్టనున్నట్లు వెల్లడించారు. తొలుత హెూండా కంపెనీ ఈ కొత్త మేనేజ్మెంట్‌ను లీడ్ చేయనున్నది. రెండు కంపెనీలకు చెందిన సూత్రాలు, బ్రాండ్ ఇమేజ్‌లను కాపాడుకోనున్నారు. జూన్ వరకు మరోసారి అగ్రిమెంట్‌పై ప్రకటన చేయనున్నట్లు చెప్పారు. ఆగస్టు 2026 నాటికి డీల్ పూర్తి అవుతుందన్నారు. జపాన్‌కు చెందిన టోయోటా కంపెనీతో పాటు జర్మనీకి చెందిన ఫోక్స్‌వాగన్ కంపెనీకి .. ఇక త్వరలో కొత్త కంపెనీ పోటీ ఇవ్వనున్నది. జపాన్ కంపెనీల్లో టోయోటా లీడింగ్‌లో ఉన్నది. మాజ్డా మోటర్ కంపెనీతో టెక్నాలజీ షేర్ చేసుకుంటోంది టొయోటా. 2023లో హెూండా 40 లక్షలు, నిస్సాన్ 34 లక్షల వాహనాలను ఉత్పత్తి చేసింది. మిత్‌సుబిషి మోటార్స్ కేవలం పది లక్షలు మాత్రమే ఉత్పత్తి చేసింది. హెూండాతో కలిసిపోతున్నట్లు వార్తలు రాగానే.. ఒక్కసారిగా నిస్సాన్ షేర్లు దూసుకెళ్లాయి.

## ఐపీఓల బూమ్ లిస్టింగ్‌తో 90 సంస్థల రూ.1.60 లక్షల కోట్ల నిధుల సేకరణ ఇన్వెస్టర్ల నుంచి అసాధారణ రెస్పాన్స్




పరిశ్రమల నిర్వహణకు నిధులు అవసరం.. సొంత వనరులతో సంస్థ ప్రారంభించినా.. సేవల విస్తరణకు నిధుల సేకరణ తప్పనిసరి. అందుకు స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ ఒక మార్గం. ఈక్విటీ మార్కెట్లలో లిస్టింగ్ కావాలంటే ఆయా సంస్థలు ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు వెళ్లాల్సి ఉంటుంది. అందుకు అనుకూల మార్కెట్ పరిస్థితులు, రెగ్యులేటరీ నిబంధనలు సానుకూలంగా ఉండాల్సి ఉంటుంది. గతంతో పోలిస్తే మార్కెట్లో సానుకూల పరిస్థితులు, రెగ్యులేటరీ నిబంధనల్లో పురోగతితో పలు సంస్థలు ఐపీఓకు వెళుతున్నాయి. ఐపీఓల ద్వారా నిధుల సేకరణలో దేశీయ కార్పొరేట్ సంస్థలు, స్టార్టప్ సంస్థలు మరో మైలురాయిని దాటాయి. స్టాక్ మార్కెట్లలో ఆయా కంపెనీల లిస్టింగ్.. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి సంకేతంగా నిలుస్తుంది. ఈ ఏడాది 90 కంపెనీలు ఐపీఓ ద్వారా రికార్డు స్థాయిలో రూ.1.6 లక్షల కోట్ల నిధులు సేకరించాయి. 2025లోనూ ఐపీఓల ద్వారా భారీగా నిధులు సమకూర్చుకునేందుకు పలు కంపెనీలు క్యూ కడుతున్నాయి. దీర్ఘకాలిక వృద్ధి లక్ష్యంతో ఐపీఓలతో షేర్లు జారీ చేసిన సంస్థల విశ్వాసంతోపాటు లిస్టింగ్ లాభాల కోసం ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఎదురుచూడటం ఈ ఏడాదిలో అసాధారణమనే చెప్పాలి. దేశ చరిత్రలో అత్యధికంగా దక్షిణ కొరియా ఆటోమొబైల్ కంపెనీ హ్యుండాయ్ మోటార్ ఇండియా ఐపీఓ ద్వారా రూ.27,870 కోట్ల నిధులు సేకరించింది. ఈ ఏడాది దేశ చరిత్రలోనే అతి పెద్ద ఐపీఓగా నిలుస్తుంది. మార్కెట్ క్యాపిటలైజేషన్ రీత్యా చిన్న, మధ్య, భారీ పరిశ్రమలు ఐపీఓల ద్వారా రూ.867 కోట్ల నుంచి రూ.1700 కోట్ల వరకూ నిధులు సేకరించాయి. ఇక ప్రైవేట్ టెలికం ఆపరేటర్ సంస్థ వొడాఫోన్ ఐడియా ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్పీఓ) ద్వారా రూ.18 వేల కోట్ల నిధులు సేకరించింది.

**ఈ ఏడాది ప్రధాన ఐపీఓల వివరాలివే**

**హ్యుండాయ్ మోటార్స్: రూ.27,870 కోట్లు.**

**స్విగ్గీ : రూ.11,327 కోట్లు.**




**ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ : రూ.10 వేల కోట్లు.**

**బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ రూ.6,560 కోట్లు.**

**ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ: రూ.6,145 కోట్లు.**

**అతి చిన్న ఐపీఓ : విభోర్ స్టీల్ ట్యూబ్స్ %-% రూ.72 కోట్లు.**

**ఐపీఓల్లో సబ్ స్క్రిప్షన్ ఇలా**

నిధుల సేకరణలో చిన్నదైనా విభోర్ స్టీల్ ట్యూబ్స్ ఐపీఓ 320 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజిరేషన్, మన్బా ఫైనాన్స్ అండ్ గాలా ప్రిసిషన్ ఇంజినీరింగ్ ఐపీఓలు 200పై చిలుకు రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి. వన్ మొబిక్విక్ సిస్టమ్స్, యూనీ కామర్స్ ఈ-సొల్యూషన్స్, డిఫ్యూజర్ ఇంజినీర్స్, బీఎల్ఎస్ ఈ-సర్వీసెస్, ఎగ్జిమ్ టెలీ సిస్టమ్స్ ఐపీఓల్లో 100 రెట్లు సబ్‌స్క్రిప్షన్లు నమోదయ్యాయి. 60కి పైగా కంపెనీలు స్టాక్ మార్కెట్లలో లిస్టయిన రోజే పాజిటివ్ ఫలితాలు అందుకోవడం ఓ రికార్డుగా నిలిచింది. విభోర్ స్టీ ట్యూబ్స్, బీఎల్ఎస్ ఈ సర్వీసెస్, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్, కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ తదితర సంస్థలు లిస్టింగ్ రోజు 100 శాతానికి పైగా లబ్ధి పొందాయి.

**ఈ నెలలో ఐపీఓల తీరిలా**

కేవలం ఈ నెలలోనే 15 సంస్థలు ఐపీఓకు వెళ్లడం ఒక అసాధారణ ప్రక్రియ కానున్నది. ఈ నెల 23,24 తేదీల్లో మరో ఎనిమిది సంస్థల ఐపీఓలు మార్కెట్లలోకి రానున్నాయి. పరిస్థితులు ఇలాగే సాగితే వచ్చే ఏడాది 75 సంస్థల యాజమాన్యాలు ఐపీఓల ద్వారా రూ.2.5 లక్షల కోట్ల నిధులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి.

# ఆగండి.. తొందరొద్దు




### ఆరోగ్య బీమా క్లెయిముల్లో తెలివిగా వ్యవహరించండిలా

ప్రస్తుతం ఆరోగ్య బీమాపై అందరిలోనూ అవగాహన పెరిగింది. ఎప్పుడు, ఎవరికి ఏమవుతుందో తెలియని పరిస్థితుల్లో ఉన్న మనకు బీమా.. కొండంత అండగానే చెప్పాలి. అయితే ఈ బీమా క్లెయిముల్లో మాత్రం చాలామంది తొందరపాటుతో వ్యవహరిస్తున్నారు. దీంతో బీమా ప్రయోజనాలను పాలసీదారులు పెద్ద మొత్తంలో కోల్పోవాల్సి వస్తున్నది. ముఖ్యంగా ఈ శీతాకాలంలో శ్వాసకోశ, చర్మ సంబంధ సమస్యలు, ఇన్ఫెక్షన్లు సహజం. అందుకే కంగారుపడి ప్రతీ చిన్న అవసరానికీ బీమానే ప్రత్యామ్నాయంగా చూడవద్దు. క్లెయిములకు వెళ్లవద్దు. అనారోగ్యం బారినపడకుండా తగు జాగ్రత్తలు తీసుకోండి. సమస్య ముదిరితే వైద్యుల సలహా మేరకే పెద్ద ఖర్చులకు మాత్రమే బీమాను వినియోగిస్తే మంచిది. అసలు ఆరోగ్య బీమాలో క్లెయిములు లేకపోతే వచ్చే లాభాలెంటో తెలుసా?

**నో-క్లెయిం బోనస్**

ఆరోగ్య బీమా తీసుకున్నాక తర్వాతి రెన్యువల్ వరకు ఆ బీమాను ఉపయోగించకపోతే.. అందుకుగాను బీమా సంస్థలు పాలసీదారులకు ఇచ్చే ప్రోత్సాహకాలే ఈ నో-క్లెయిం బోనస్‌లు. వీటిలో క్యుములేటివ్ బోనస్, ప్రీమియంపై డిస్కౌంట్లుంటాయి.

**క్రమేణా పైపైకి**

తొలి సంవత్సరం ఎలాంటి క్లెయిములు లేకపోతే మలి సంవత్సరం పాలసీ తీసుకునేటప్పుడు అంతే మొత్తానికి బీమా కవరేజీ 10 శాతం మేర పెరుగుతుంది. ఉదాహరణకు రూ.20 వేలు చెల్లించి రూ.20 లక్షల పాలసీని తీసుకున్నారు. తొలి ఏడాది కాలంలో ఏ క్లెయిం చేయలేదు. దీంతో రెండో ఏడాదీ అదే రూ.20 వేలకు రూ.22 లక్షల బీమా కవరేజీ లభిస్తుంది. ఇక్కడ నో-క్లెయిం బోనస్ రూ.2 లక్షలు (10 శాతం) అన్నమాట. ఇలా తర్వాతి సంవత్సరాల్లోనూ రూ.2 లక్షల చొప్పున బీమా కవరేజీ పెరుగుతూపోతుంది. వీటినే క్యుములేటివ్ బోనస్‌లు అంటారు.

**రాయితీలుజి**

ప్రతి సంవత్సరం క్లెయిములు లేకపోతే ఆ పాలసీదారులకు ఇన్సూరెన్స్ సంస్థలు.. బీమా ప్రీమియంలపై రాయితీలనూ అందిస్తాయి. రెన్యువల్ సమయంలో ఈ తగ్గింపులను అందుకోవచ్చు. ఉదాహరణకు రూ.20 లక్షల ఆరోగ్య బీమాను రూ.20 వేలు పెట్టి తీసుకున్నారు. తొలి ఏడాది ఎలాంటి క్లెయిం చేయలేదు. దీంతో మీ ప్రీమియంలో 10 శాతం తగ్గింపు లభిస్తుంది. అంటే తర్వాతి సంవత్సరం రూ.18 వేలు చెల్లిస్తే చాలు. రూ.20 లక్షల కవరేజీ వస్తుంది. ఇలా తర్వాతి సంవత్సరాలకూ నిబంధనలకు లోబడి 10 శాతం తగ్గింపులు వర్తిస్తాయి.


**చివరగా..**

చిన్నచిన్న వాటికే క్లెయిములు చేస్తే ఆరోగ్య బీమా ద్వారా పొందే ప్రయోజనాలను కోల్పోవాల్సి వస్తుంది. జలుబు, దగ్గు, జ్వరాలు, ఇతరత్రా సీజనల్ వ్యాధులకు ఆరోగ్య బీమాలను ఉపయోగించుకోవడం మానేయండి. పెద్ద సమస్యలు ఎదురైతేనే బీమాను వాడుకోండి. అలాగే ఆరోగ్యంగా ఉన్నప్పుడే బీమాలను తీసుకోండి. బీపీ, షుగర్ వంటివి వచ్చాక తీసుకుంటే ప్రయోజనాలకు కోతలు తప్పవు. ఆరోగ్య బీమా తీసుకునేటప్పుడు వాస్తవాలను వెల్లడించండి. ప్రీమియంలను రెగ్యులర్‌గా చెల్లించండి. నిజాలను దాస్తే ఇబ్బందులు తప్పవు. నో-క్లెయిం బోనస్‌లు.. ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్లు, ఇండివిడ్యువల్ హెల్త్ ఇన్సూరెన్స్‌లకూ వర్తిస్తాయి.

# రివర్స్ మార్ట్‌గేజ్




### ఈ గృహ రుణం ఎవరికి, ఎలా వస్తుందో తెలుసా!




సంప్రదాయ గృహ రుణానికి భిన్నంగా ఇటీవలికాలంలో రివర్స్ మార్ట్‌గేజ్ లోన్లు స్థిరాస్తి మార్కెట్‌లో పాపులారిటీని సంతరించుకుంటున్నాయి. వృద్ధాప్యంలో ఏ ఆదాయం లేని ఇంటి యజమానులకు నిజంగా ఇవి ఆర్థిక భరోసానే కల్పిస్తున్నాయి. నగదు అవసరాలు లేదా ఇతరత్రా జీవన వ్యయాల కోసం ఉన్న ఇంటిని అమ్ముకొని రోడ్డునపడకుండా ఉన్న ఇంట్లోనే సంతోషంగా ఉంటూ ఆర్థిక భద్రతను పొందేలా ఈ లోన్లు సీనియర్ సిటిజన్లకు కలిసొస్తున్నాయి.

**ఏయే రకాలు? హెూం ఈక్విటీ కన్వర్షన్ మార్ట్‌గేజ్**

ఈ హెచ్‌ఈసీఎం పథకం అత్యంత ఆదరణ కలిగినది. రివర్స్ మార్ట్‌గేజ్ వెసులుబాటు విస్తృతంగా అందుబాటులో ఉంటుంది. 62, ఆపై వయసు కలిగినవారి కోసం దీన్ని రూపొందించారు. ఇంటి ఈక్విటీలో కొంత భాగాన్ని నగదులోకి మార్చుకోవచ్చు.

ప్రొప్రైటరీ రివర్స్ మార్ట్‌గేజ్

ఈ సదుపాయాన్ని ప్రైవేట్ బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు అందిస్తున్నాయి. అధిక విలువ కలిగిన ఇంటి యజమానుల కోసం దీన్ని డిజైన్ చేశారు. అయితే హెచ్‌ఈసీఎంకు అర్హత లేకపోతేనే దీనికి అర్హులు.

**సింగిల్-పర్పస్ రివర్స్ మార్ట్‌గేజ్**

ఓ నిర్దిష్ట అవసరం కోసం నగదు కావాలనుకునే ఇంటి యజమానులను దృష్టిలో పెట్టుకొని తెచ్చినదే ఈ పథకం. ఇంటి అభివృద్ధికైనా లేదా వైద్య ఖర్చులైనా కావచ్చు. దీన్ని నాన్-ప్రాఫిట్ ఆర్గనైజేషన్స్, ప్రభుత్వ ఏజెన్సీలు వాడుకొంటాయి.

ఏయే డాక్యుమెంట్లు అవసరం?

రివర్స్ మార్ట్‌గేజ్ లోన్ పొందడానికి ఓటర్ ఐడీ, పాన్, ఆధార్, పాస్‌పోర్ట్, ఎంప్లాయీస్ ఐడీ కార్డ్ వంటి ఐడెంటిటీ ప్రూఫ్‌లు అవసరం.

అడ్రస్ ప్రూఫ్‌లుగా ఓటర్ ఐడీ కార్డ్, కరెంట్ బిల్లు, పాస్‌పోర్ట్ వంటివి చూపించవచ్చు.

ఇల్లు మీదే అని చెప్పడానికి టైటిల్ డీడ్, ప్రాపర్టీ ట్యాక్స్ రశీదులు, మీ పేరిట ఉన్న కరెంట్ లేదా గ్యాస్ ఇతరత్రా బిల్లులు కావాలి.

పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు అవసరం. కావాల్సిన మరికొన్ని పత్రాలనూ సమర్పించాల్సిందిగా రుణదాతలు కోరవచ్చు.

**ఫీజులు-చార్జీలు**

ఈ రివర్స్ మార్ట్‌గేజ్ లోన్ కోసం ఫీజులు, చార్జీలు ఆయా బ్యాంకులు లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలనుబట్టి మారుతూ ఉన్నాయి.

ప్రాసెసింగ్ ఫీజు, స్టాంప్ డ్యూటీ, మార్ట్‌గేజ్ రిజిస్ట్రేషన్ చార్జీలు వంటివి ఉంటాయి.

రుణం తీసుకున్నాక నిబంధనలకు విరుద్ధంగా ముందే చెల్లించినా, ఒక బ్యాంక్ నుంచి మరో బ్యాంక్ లేదా సంస్థలకు మారినా జరిమానాలు పడుతాయి.

హెూం ఇన్సూరెన్స్ పాలసీకి సంబంధించి అన్ని ప్రీమియంల చెల్లింపులు సకాలంలో ఉండాలి.

**గుర్తుంచుకోండి**

సాధారణ గృహ రుణాలతో పోల్చితే ఈ రివర్స్ మార్ట్‌గేజ్ లోన్లపై అధిక వడ్డీరేట్లు పడుతాయి.

మార్కెట్ ట్రెండ్‌కు తగ్గట్టే ఫిక్స్‌డ్ లేదా ఫ్లోటింగ్ రేట్ల విధానాలను రుణగ్రహీతలు ఎంచుకోవచ్చు.

ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 10(43) కింద ఈ రుణం ద్వారా అందుకునే లంప్సమ్ లేదా వాయిదా చెల్లింపుల ఆదాయంపై సీనియర్ సిటిజన్ల (రుణగ్రహీతలు)కు పన్ను మినహాయింపుంటుంది.

ఈ లోన్ తీసుకునేటప్పుడు తెలియకపోతే ఏ డాక్యుమెంట్లపైనా సంతకాలు చేయవద్దు. గుర్తుతెలియని సంస్థలు ఆఫర్ చేసే రివర్స్ మార్ట్‌గేజ్ లోన్ల వైపు వెళ్లకపోవడమే మంచిది.

మరింత సమాచారం, అవగాహన కోసం బ్యాంకులకు నేరుగా వెళ్లి, అక్కడి ప్రతినిధులను సంప్రదించడం ఉత్తమం.

రుణం కావాలను కునేవారికి ఆన్‌లైన్ దరఖాస్తుతో 4 రోజుల్లోనే అప్రూవల్ ఇస్తున్న దేశంలోని పలు ప్రైవేట్ బ్యాంకులు.

అర్హత ఏంటి?

రుణగ్రహీతకు 60 ఏండ్లు, ఆపైనే ఉండాలి. కో-బారోవర్‌గా భర్త లేదా భార్య ఉంటే వారి వయసూ 55 ఏండ్లు దాటాలి.

ఏ ఇంటి ద్వారా మీరు రివర్స్ మార్ట్‌గేజ్ లోన్‌కు వెళ్లాలనుకుంటున్నారో.. ఆ ఇల్లు మీకు (రుణగ్రహీత) పూర్తిగా సొంతమైనదై ఉండాలి. అలాగే ఆ ఇల్లు మీ ప్రధాన నివాసమై ఉండాలి. అంతేగాక ఇంకా 20 ఏండ్లకుపైగా నివాసయోగ్యమైనదై ఉండాలి.

రివర్స్ మార్ట్‌గేజ్ లోన్ తీసుకునే ఇంటికి ఎలాంటి న్యాయపరమైన సమస్యలు ఉండకూడదు. దానిపై ఏ అప్పులూ ఉండరాదు. ఇంటికి ఏ సమస్య లేకుండా ఎప్పటికప్పుడు రిపేర్ చేస్తూ చక్కగా కాపాడుకోవాలి.

రుణగ్రహీత ఆదాయం, క్రెడిట్ స్కోర్, అప్పు చెల్లించే సామర్థ్యం ఇలాంటి వేటినీ రుణదాత (బ్యాంక్ లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ)లు పరిశీలించారు. ఇంటి పరిస్థితి, దానికి సంబంధించిన అన్ని అంశాలనే క్షుణ్ణంగా చూస్తారు.

**ఇదీ సంగతి..**

రివర్స్ మార్ట్‌గేజ్‌లో ఇంటి విలువలో 80 శాతందాకా రుణంగా లభిస్తుంది.

ఒకేసారి లేదా నెల, త్రైమాసిక, అర్ధవార్షిక, వార్షిక వాయిదాల్లో ఇంటి యజమాని (రుణగ్రహీత)కి రుణం సొమ్ము అందుతుంది.

రుణం తీసుకున్నాక ఆ ఇంట్లోనే రుణగ్రహీతలు ఉండవచ్చు. ఇంటిని అమ్ముకోవడమో, లేకుంటే ఖాళీ చేయడమో, లేదా రుణగ్రహీత(లు) చనిపోయాకే రుణం, వడ్డీ చెల్లింపులు మొదలవుతాయి. అప్పటిదాకా ఎలాంటి చెల్లింపులుండవు.

తీసుకున్న రుణం పూర్తిగా చెల్లించాకే రుణగ్రహీత (యజమాని) లేదా వారసులకు ఇంటిపై మళ్లీ హక్కులు వస్తాయి.

రుణం చెల్లించలేని పరిస్థితులు తలెత్తితే రుణం ఇచ్చినవారు ఇంటిని వేలం వేసి బకాయిలను వసూలు చేసుకుంటారు.

# మార్కెట్‌పై బేర్ పట్టు



### మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లలో నష్టపుటేరులు పారుతున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ కఠిన ద్రవ్య వైఖరి దిశగా అడుగులు వేస్తుండటం మదుపరులకు అస్సలు రుచించడం లేదు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ ఏకంగా 4,091.53 పాయింట్లు లేదా 4.98 శాతం కోల్పోయి 79వేల మార్కుకు దిగువన 78,041.59 వద్ద ముగిసింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 1,180.80 పాయింట్లు లేదా 4.76 శాతం దిగజారి 24వేల మార్కును చేజార్చుకొని 23,587.50 దగ్గర స్థిరపడింది. దీంతో ఈ వారం కూడా ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడికే లోను కావచ్చన్న అంచనాలున్నాయి. ఫలితంగా ప్రధాన రంగాల్లో లాభాల స్వీకరణకు వీలుందంటున్నారు. ఇక ఈ వారం డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు కూడా ప్రధానమే. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ ముఖ్యమే. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,000 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,900-24.100 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

**గమనిక..**


స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

# రైతుకు లేని భరోసా



పులి-బంగారు కంకణం కథ అందరికీ తెలిసిందే. కంకణానికి ఆశపడి పులి దగ్గరకు వెళ్లామా అంతే సంగతులు. ప్రస్తుత రాష్ట్ర పరిస్థితిని పోల్చి చూపేందుకు ఇంతకు మించిన కథ మరొకటి ఉండదనిపిస్తున్నది. అధికార దాహంతో ఉన్న కాంగ్రెస్ అడ్డగోలుగా హామీలు గుప్పించి, అన్నివర్గాలను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. కేసీఆర్ పాలనలో స్వర్ణయుగం చూసిన రైతులకు ఇంకా మరేదో ఇస్తానని మాయమాటలు చెప్పింది. రైతుబంధును రైతుభరోసాగా మార్చి రెండు వేలు ఎక్కువే ఇస్తానని నమ్మబలికింది. తీరా గెలిచిన తర్వాత అన్నివర్గాలతోపాటు కుచ్చుటోపీ పెట్టినట్టుగానే అన్నదాతలనూ మోసం చేసింది. పెంచడం మాటేమో గానీ ఉన్న పెట్టుబడి సాయం ఊడిపోతుందని ఓటు వేసిన తర్వాత తెలిసి వచ్చింది రైతన్నలకు. ఎదురుచూసి.. నీళ్లు.. నిరసించిన తర్వాత ఇప్పుడు అసలు సంగతి బయటపెట్టింది. అప్పుడు ఇంతిస్తా, అంతిస్తా అని కోతలు కోసింది. ఇప్పుడు అనర్హుల పేరిట కొర్రీలతో కోతలు కోస్తున్నది. కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం నుంచి అరువు తెచ్చుకున్న మరీ అర్హతలు ప్రకటిస్తున్నది. ఆ పథకం నిబంధనలను అసెంబ్లీ ముందుంచి మరీ విధేయత చాటుకున్నది. రైతుబంధు స్థానంలో తెచ్చిన రైతుభరోసా వల్ల లబ్ధిదారుల సంఖ్య భారీగా తగ్గిపోతుంది. కుటుంబంలో ఎంతమంది రైతులున్నా ఒక్కరికే సాయం ఇస్తారట. ఆదాయ పన్ను కట్టేవారు కుటుంబంలో ఒక్కరున్నా పంట పెట్టుబడి ఇవ్వరట. ప్రజాప్రతినిధు లు, ప్రభుత్వ ఉద్యోగులు, లాయర్లు, డాక్టర్లు అంటూ చాంతాడంత జాబితా తయారు చేసింది. చివరికి కుటుంబంలో ఇంజినీర్లున్నా మొండిచెయ్యేనట. ఈ కొర్రీల జాబితా వెనకున్న ఉద్దేశం తెలుసుకోవడం అంత కష్టమేమీ కాదు. వీలైనంత మందికి పెట్టుబడి సాయం ఎగ్గొట్టేందుకు సర్కారు యోచిస్తున్నట్టు కనిపిస్తున్నది. రైతుబంధు లబ్ధిదారుల్లో దాదాపు 86 శాతం మేర చిన్న, సన్నకారు రైతులేనని అందరికీ తెలిసిన విషయమే. ఒకవేళ పెద్ద రైతులను తొలగిస్తున్నారనుకున్నా కోత 14 శాతం మించరాదు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు లబ్ధిదారులు సీజన్‌కు 70 లక్షల దాకా ఉండేవారు. తాజాగా ప్రభుత్వం విధిస్తున్న కోతల వల్ల వారి సంఖ్య 30 లక్షలకు పడిపోతుంది. అంటే సగానికి పైగా రైతులు ఎగిరిపోతారన్న మాట. సర్కారు మోసాలకి లెక్కలతో 50 శాతానికి పైగా రైతులకు ఎగనామం పెడుతుండటం ఏ మాత్రం క్షంతవ్యం కాదు. పంటపెట్టుబడి సాయం నేరుగా రైతులకు అందించే వినూత్న పథకం రైతుబంధుతో రాష్ట్రంలో వ్యవసాయం ముఖచిత్రమే మారిపోయింది. రాష్ట్రం దేశానికే అన్నపూర్ణగా మారింది. ఇది బీఆర్ఎస్ చెప్పుకొంటున్న సంగతి కాదు. స్వయంగా సర్కారే అసెంబ్లీ సాక్షిగా వెల్లడించిన వాస్తవం. మరి అదే సర్కారు సాయంలో కోతలు పెడుతూ రైతును, రాష్ట్రాన్ని ఏం చేయాలనుకుంటున్నది? స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ సర్కారు హఠాత్తుగా రైతుభరోసా మాట ఎత్తుకోవడం హాస్యాస్పదం. ఇచ్చినట్టు కాదు, ఇవ్వనట్టు కాదు అన్నట్టుగా అరకొరగా అమలు చేసి అయిందనిపించుకునే పనిలో సర్కారు ఉన్నదన్నది స్పష్టమే. కానీ, రైతులను పదే పదే మోసం చేయడం సాధ్యపడదనే వాస్తవాన్ని సర్కారు గుర్తిస్తే మంచిది.

# రోజూ ఉదయం ఖాళీ కడుపుతో రన్నింగ్ చేస్తే కలిగే అద్భుతమైన లాభాలు ఇవే



మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ పౌష్టికాహారాన్ని తీసుకోవడంతోపాటు వ్యాయామం చేయాలన్న సంగతి తెలిసిందే. అయితే చాలా మంది ఉదయం నిద్ర లేచేందుకు బద్ధకం వహిస్తుంటారు. దీంతో సాయంత్రం సమయంలో వ్యాయామం చేస్తుంటారు. కానీ వ్యాయామం ఉదయం చేస్తేనే ఎక్కువ ఫలితం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఉదయం ఖాళీ కడుపుతో వ్యాయామం చేయడం వల్ల శరీరం ఎక్కువ క్యాలరీలను ఖర్చు చేస్తుందని వారు అంటున్నారు. ఇక ఉదయం పరగడుపునే రన్నింగ్ చేయడం వల్ల అద్భుతమైన లాభాలు ఉంటాయని వారు అంటున్నారు. పరగడుపునే రన్నింగ్ చేస్తే పలు వ్యాధులను నయం చేసుకోవచ్చని, అలాగే అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చని వారు చెబుతున్నారు.

**కొవ్వు వేగంగా కరుగుతుంది..**

రోజూ ఉదయం ఖాళీ కడుపుతో వ్యాయామం చేయడం వల్ల శరీరంలోని కొవ్వు మరింత వేగంగా కరుగుతుంది. కండరాలు, ఇతర ప్రదేశాలలో ఉండే గ్లూకోజ్ నిల్వలు త్వరగా ఖర్చవుతాయి. దీంతో శరీరం శక్తి కోసం కొవ్వు మీద ఆధారపడుతుంది. కనుక ఉదయం కాస్త సేపు రన్నింగ్ చేసినా చాలు ఎక్కువ మొత్తంలో కొవ్వు కరిగిపోతుంది. దీంతో అధిక బరువు తగ్గుతారు. త్వరగా బరువు తగ్గాలని చూస్తున్నవారు ఉదయం ఖాళీ కడుపుతో రన్నింగ్ చేస్తే ఫలితం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అలాగే ఈ విధంగా చేయడం వల్ల ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుంది. డయాబెటిస్ ఉన్నవారికి ఇది ఎంతగానో మేలు చేస్తుంది. దీని వల్ల శరీరం ఇన్సులిన్‌ను మరింత సులభంగా గ్రహిస్తుంది. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు రోజూ రన్నింగ్ చేస్తే డయాబెటిస్‌ను వెనక్కి మళ్లించే చాన్స్ ఉంటుందని అంటున్నారు.

**కండరాల దృఢత్వం..**

ఇక ఉదయం ఖాళీ కడుపుతో రన్నింగ్ చేయడం వల్ల కండరాలు సైతం దృఢంగా మారుతాయి. దీంతో కండరాలు మరింత శక్తిని వినియోగించుకుంటాయి. దీని వల్ల శరీర మెటబాలిజం పెరుగుతుంది. రోజంతా ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. బద్ధకం తగ్గుతుంది. నీరసం, అలసట ఉండవు. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. రోజంతా యాక్టివ్ గా పనిచేస్తారు. ఎంత పనిచేసినా అలసట అనిపించదు. కొందరికి శరీరంలో ఎంత ప్రయత్నించినా కరగని మొండి కొవ్వు ఉంటుంది. అది సైతం ఉదయం ఖాళీ కడుపుతో రన్నింగ్ చేయడం వల్ల కరిగిపోతుంది. దీంతో త్వరగా బరువు తగ్గవచ్చు.

**మానసిక ఆరోగ్యానికి..**

ఉదయం ఖాళీ కడుపుతో రన్నింగ్ చేయడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. రాత్రి పూట పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. చక్కగా నిద్ర పడుతుంది. మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. హార్మోన్ల అసమతుల్యత ఉన్నవారు రోజూ ఉదయం ఖాళీ కడుపుతో రన్నింగ్ చేస్తే ఎంతో మేలు జరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీంతో హార్మోన్లు సరిగ్గా పనిచేస్తాయి. ఇది స్త్రీ, పురుషుల్లో సంతానం కలిగే అవకాశాలను పెంచుతుంది. సంతానం కోసం చూస్తున్న దంపతులు ఉదయం రన్నింగ్ చేస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని సైంటిస్టులు సైతం చెబుతున్నారు. ఇలా రోజూ ఉదయం ఖాళీ కడుపుతో రన్నింగ్ చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# సూర్యుడికి అతి సమీపంగా పార్కర్ ప్రోబ్ చరిత్ర సృష్టించనున్న నాసా స్పేస్‌క్రాఫ్ట్



నాసా ప్రయోగించిన పార్కర్ సోలార్ ప్రోబ్ స్పేస్‌క్రాఫ్ట్ ఇప్పుడు చరిత్ర సృష్టించనున్నది. ఆ స్పేస్‌క్రాఫ్ట్ సూర్యుడికి అత్యంత సమీపంగా వెళ్లనున్నది. అతిభయంకరమైన వాతావరణం, రేడియేషన్‌ను తట్టుకుని ఆ వ్యోమనౌక .. సూర్యుడి సమీపానికి వెళ్తున్నది. డిసెంబర్ 24వ తేదీన సూర్యుడి బహ్యావలయమైన కరోనాకు సమీపంగా పార్కర్ ప్రోబ్ వెళ్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే భగభగ మండే భానుడికి సమీపంగా ఉన్న కారణంగా.. ఆ స్పేస్‌క్రాఫ్ట్ నుంచి కొన్ని రోజుల పాటు సిగ్నల్స్ అందవని తెలిసింది. ఒకవేళ సూర్యుడి అగ్నితాపాన్ని తట్టుకుంటే, ఆ స్పేస్‌క్రాఫ్ట్ డిసెంబర్ 27వ తేదీన మళ్లీ సిగ్నల్స్ పంపిస్తుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. కరోనా లేయర్‌కు సమీపానికి వెళ్లడం వల్ల సూర్యుడు ఎలా పనిచేస్తాడన్న అధ్యయనాన్ని మరింత లోతుగా విశ్లేషించే అవకాశాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. శతాబ్దాలుగా సూర్యుడి గురించి ప్రజలు స్టడీ చేశారని, కానీ అతి సమీపం నుంచి ఆ వాతావరణాన్ని ఎవరూ అనుభవించలేదని నాసా శాస్త్రవేత్త డాక్టర్ నికోలా ఫాక్స్ తెలిపారు. 6 లక్షల 92 వేల కిలోమీటర్ల వేగంతో పార్కర్ ప్రోబ్ ప్రయాణిస్తోంది. సూర్యుడి కరోనాకు సమీపంగా వెళ్తున్న సమయంలో.. పార్కర్ ప్రోబ్ మెషిన్ సుమారు 982 డిగ్రీల సెల్సియస్ వేడిని తట్టుకోవాల్సి ఉంటుంది. 2018లో పార్కర్‌ను తొలిసారి ప్రయోగించారు. ఇప్పటికే ఆ స్పేస్‌క్రాఫ్ట్ 21 సార్లు సూర్యుడిని చుట్టేసింది. సుమారు 4.5 ఇంచుల కార్బన్ కంపోజిట్ షీల్డ్ ఉన్న పార్కర్ స్పేస్‌క్రాఫ్ట్.. చాలా వేగంగా కరోనాను తాకి మళ్లీ బయటి వాతావరణంలోకి రానున్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కరోనా చాలా వేడిగా ఉంటుందన్న విషయం తెలిసిందే. కానీ ఎందుకు అక్కడ వాతావరణం అలా ఉందో తెలుసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నామని ఖగోళశాస్త్రవేత్త డాక్టర్ జెన్నిఫర్ మిల్లార్డ్ తెలిపారు. సూర్యుడి కేంద్రానికి 6.1 మిలియన్ల కిలోమీటర్ల దూరం నుంచి పార్కర్ ప్రయాణించనున్నది.

# కాంగ్రెస్ అధిష్ఠానం ప్రేక్షక పాత్ర ఎందుకు?




తెలంగాణలో తమ ప్రభుత్వపు తీరు పట్ల కాంగ్రెస్ అధిష్ఠానం ఎందుకు ప్రేక్షక పాత్ర వహిస్తున్నదనే ప్రశ్నను తరచూ వింటున్నాము. ఈ మాట ప్రతిపక్షాల నుంచే గాక, రాజకీయాలను గమనిస్తూ ఉండే సాధారణ పరిశీలకుల నుంచి కూడా వస్తున్నది. రాష్ట్రాల స్థాయిలో పార్టీ పరిస్థితిని, పార్టీ ప్రభుత్వాల పాలనను ఎప్పటికప్పుడు గమనించటం, అవసరమనుకున్న మార్పులు జరిగేట్టు చూడటం అధిష్ఠానం నిర్వహించే బాధ్యతల్లో ఒకటని మనకు మొదటినుంచి తెలుసు. అట్లా జరగటాన్ని చూస్తూ వస్తున్నాము కూడా. కాని, నెహ్రూ నుంచి మొదలుకొని సోనియాగాంధీ కాలం వరకు కనిపించిన ఈ పద్ధతులు రాహుల్ గాంధీ నాయకత్వం వచ్చేసరికి ఎందువల్ల మారినట్టు? ఇది జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన విషయం. ఇది తెలిస్తే గాని తెలంగాణ గురించి అర్థం కాదు. గత పరిస్థితుల్లోకి వెళ్లేముందు వర్తమానం గురించి కొంత చెప్పుకోవాలి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయింది. అంతకుముందు పదేండ్లు పాలించిన బీఆర్ఎస్‌ను ఎంత అనూహ్యంగా ఓడించి అధికారానికి వచ్చారో, అంతే అనూహ్యమైన వేగంతో ప్రజల దృష్టిలో అప్రతిష్ట పాలవుతున్నారు. అందుకు కారణాలు అనేకం. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోవటం, ఆర్థిక స్థితి బాగా లేదని ప్రచారాలు చేస్తూనే అధికారం కోసం అలవికాని హామీలివ్వటం, దారీ తెన్నూ లేని పరిపాలన, మాటల నుంచి చేతల వరకు అస్తవ్యస్తత, ఎన్ని విమర్శలు వచ్చినా ధోరణిని మార్చుకోకపోవటం, వ్యక్తిగతంగా అపసవ్యపు శైలి వంటివన్నీ ఈ కారణాలలోకి వస్తాయి. ఇది ఈ విధంగానే కొనసాగితే రాష్ట్ర నాయకత్వానికి కలిగే నష్టం ఎట్లున్నా, అసలు కాంగ్రెస్ పార్టీకే హాని జరగగలదని ఎవరైనా అంచనా వేయగలరు. అటువంటి ప్రమాదపు సూచనలు కన్పించినప్పుడు అధిష్ఠానం తమ పార్టీ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకోగలదని ఎవరైనా భావిస్తారు.

కాని అట్లా జరగనిది ఎందుకు? ముఖ్యంగా జాతీయ స్థాయిలో గాని, వివిధ రాష్ట్రాల్లో గాని కాంగ్రెస్ పరిస్థితి బాగా లేనపుడు ఇటువంటి చర్యలు మరింత అవసరం. జాతీయస్థాయిలో పార్టీ వరుసగా మూడవసారి అధికారానికి రాలేకపోయింది. దేశంలోని రాష్ట్రాలు 28 కాగా కేవలం మూడింట అధికారంలోకి వచ్చి మరొక మూడింట ప్రాంతీయ పార్టీలకు జూనియర్ భాగస్వామిగా అధికారంలో ఉంది. 140 సంవత్సరాల చరిత్ర కలిగి దశాబ్దాల పాటు ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించిన పార్టీకి ఇదెంత అవమానకర స్థితో వేరుగా చెప్పనక్కరలేదు. పార్టీ ఇటువంటి దశకు బలహీనపడినపుడు జాతీయ నాయకత్వం కేంద్రంతో పాటు రాష్ట్రాలలో కూడా సంస్థ తిరిగి బలపడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవటం అవసరం. ఈ మాట కేంద్రంలో, రాష్ట్రాలలో తమ పార్టీ ప్రభుత్వాలకు వర్తిస్తుంది. ఈ దృష్టితోనే సోనియాగాంధీ తమ యూపీఏ ప్రభుత్వానికి దిశానిర్దేశం చేసేందుకు తన అధ్యక్షతన కమిటీలు వేశారు. అంతకన్న ముందు ఒక ఏఐసీసీ సెషన్‌లో రాష్ట్రాల గురించి ప్రత్యేకంగా చర్చిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వాల పరిపాలన మెరుగుగా సాగాలని, అవి ఇతర పార్టీల ప్రభుత్వాలకు ఆదర్శవంతంగా ఉండాలని, ప్రజలు మళ్లీ మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వాలనే ఎన్నుకునేట్టు సాగాలని అన్నారు. కానీ ఆ దశ గడిచిపోయింది. ఇప్పుడు ఇదంతా ఎందుకు తలకిందులవుతున్నట్టు? అధిష్ఠానానికి పీసీసీలపై, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాలపై తగిన అజమాయిషీ ఉండాలంటే అర్థం ఇందిరాగాంధీ హయాంలో వలె వ్యక్తిగత ధోరణులు చూపాలని, స్వప్రయోజనాల కోసం రాష్ట్ర నాయకులను కీలు బొమ్మలుగా మార్చాలని కాదు. నిజానికి ఆ వైఖరి కూడా పార్టీ బలహీన పడటానికి కారణాలలో ఒకటి. కనుక, అటువంటి నియంతృత్వ వైఖరులు అక్కరలేదు గాని, అదే సమయంలో ప్రజాస్వామిక నియంత్రణలు అవసరం. ఇందిర అనుసరించిన పద్ధతులలో

సోనియా గాంధీ తగినంత ప్రజాస్వామికతను ప్రవేశపెట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రులను, కాంగ్రెస్ అధ్యక్షులను చీటికి మాటికి మార్చకపోవటం వాటిలో ఒకటి. అదే సమయంలో వారిపై పర్యవేక్షణలు, నియంత్రణలు కొనసాగించారు. ఆ కాలానికి సంబంధించి మరొక గమనించదగిన విషయం అప్పటి నాయకులలోనూ కాంగ్రెస్ సంప్రదాయిక రాజకీయ సంస్కృతి తగినంత ఉండేది. ఇదంతా ఆ తర్వాత కాలంలో బలహీనపడుతూ వస్తున్నది. ఆ కారణంగానే ఈ రోజున మనం తెలంగాణ విషయంలో చూస్తున్నవిధంగా పరిస్థితులు, నాయకత్వాల తీరు మారుతున్నది. వారిపై అధిష్ఠానం తనంతట తానుగానే నియంత్రణ కోల్పోతుండటం ఒకటైతే, గతంలో వలె నియంత్రించే శక్తి స్వీయ బలహీనతల వల్ల స్వతహాగా తగ్గటం మరొకటి అవుతున్నది. ఈ మార్పుల పర్యవసానంగా అధిష్ఠానం పాత్ర పర్యవేక్షణలు, నియంత్రణల దశ నుంచి ప్రేక్షక పాత్రకు క్రమంగా మారుతున్నది. మొత్తం మీద కాంగ్రెస్ మౌలికంగానే బలహీన పడుతుండటానికి సూచికలు ఇవన్నీ. క్రమంగా అధికారాన్ని కోల్పోతుండటం, పార్టీ వ్యవస్థ బలహీనపడుతుండటం, మనుగడ కోసం ఇతర పార్టీలపై ఆధారపడటం వంటివి ఒక విధమైన సూచికలు కాగా, తమ నాయకులను తాము పర్యవేక్షించి, నియంత్రించలేకపోవటమన్న తెలంగాణ వంటి పరిస్థితి మరొక విధమైన సూచిక. ఇటువంటి మలుపు సుమారు 2014 ఎన్నికల ప్రాంతం నుంచి మొదలైంది. అప్పుడు కనిపించిన పరిణామాలు మూడున్నాయి. ఒకటి, పార్టీ లోక్‌సభ ఎన్నికలలో అధికారాన్ని కోల్పోవటమే గాక, సీట్ల సంఖ్య తమ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా 50 కన్న దిగువకు పడిపోయి, ప్రతిపక్ష హోదా అయినా లభించకపోవడం. రెండు, సోనియా గాంధీ ఆరోగ్యం దెబ్బతినగా ఆమె క్రియాశీలతలో తగ్గుముఖం. మూడు, గాంధీ కుటుంబ వారసునిగా ముందుకువచ్చిన రాహుల్‌గాంధీ, ప్రత్యక్ష రాజకీయాలలో తన ప్రవేశం జరిగి (2004) అప్పటికి పదేండ్లు గడిచినా, 2004-14 మధ్య తమ పార్టీ అధికారంలో ఉండినప్పటికీ ఏమీ నేర్చుకొనక, అసమర్థుడనే పేరు తెచ్చుకోవడం. ఈ మూడింటికి మూడు పరిస్థితులూ 2014 నుంచి ఇప్పటివరకు మరొక పదేండ్లు గడిచినా కొనసాగుతూనే ఉన్నాయి. విషయం ఏమంటే, ఇటువంటి పరిస్థితులు పరిణామాల మధ్య ఒక బలహీనమైన పార్టీ అధిష్ఠానం, తెలంగాణ తరహా విశృంఖల నాయకత్వాన్ని పర్యవేక్షించలేదు, నియంత్రించలేదు. అది దాదాపుగా తన శక్తికి మించిన పని. అది ఒక నిస్సహాయ స్థితి. మరీ తన చాప కిందకు నీళ్లు వస్తే తప్ప. వారికి కావాల్సింది కర్ణాటక, హిమాచల్‌తో పాటు తెలంగాణలో ఏదో ఒకవిధంగా అధికారం నిలబెట్టుకోవడం. పార్టీ ఆర్థికావసరాలను ఆ ప్రభుత్వాల ద్వారా నెరవేర్చుకొనటం. ఆ రాష్ట్రాలలోని పార్టీ సభ్యులకు ప్రస్తుతం గల అధికార, ఆర్థిక ఆకర్షణలను కొనసాగిస్తూ వారు ఇతర పార్టీలలోకి మారకుండా చూసుకోవటం. ఇవన్నీ జరిగినంత కాలం తెలంగాణ నాయకత్వం ఏమి చేసినా, చేయకున్నా ప్రేక్షక పాత్ర వహించటం. అంతకుమించి మరేమైనా చేయగల ఇందిర కాలపు వంటి శక్తి సామర్థ్యాలు ఇప్పుడు లేనందున, అంతకుమించి చేయగలిగింది కూడా లేదు. పైన అనుకున్నట్టు తమ చాప కిందకు నీరు వస్తే తప్ప.

# భారతీయ సినీ మంథన్ బెనెగల్



శ్యాం బెనెగల్.. ఈ పేరు తెలియని సినిమా అభిమాని ఉండరనడంలో అనుమానం లేదు. ఆయన భారతీయ సినిమాకు అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్రముఖ దర్శకుడు. 'అంకుర్, నిషాంత్, మంథన్, భూమిక' చిత్రాలతో సినీ రంగంలో కొత్త ఒరవడిని సృష్టించారు. అంతర్జాతీయ చిత్ర పరిశ్రమకు ఎన్నో సేవలందించిన ఆయన అనారోగ్యంతో నిన్న సాయంత్రం ముంబైలో మరణించారు. 2019లో శ్యాం బెనెగల్‌ను ముంబైలో కార్టూనిస్టు చిలువేరు మృత్యుంజయ్ ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా ఆయనతో బెనెగల్ గత జ్ఞాపకాలను పంచుకున్నారు. 1985లో తీసిన సుస్మన్ సినిమా చిత్రీకరణ సందర్భంలో చిలువేరు రామలింగంతో ఉన్న మధురమైన జ్ఞాపకాలను యాదిచేసుకున్నారు. ఆ ఇంటర్వ్యూ 2019, నవంబర్ 3న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైంది. శ్యాం బెనెగల్‌కు నివాళిగా ఆ ఇంటర్వ్యూ యథాతథంగా ముంబైలో థాడ్‌దేవ్ రోడ్డు. ఎవరెస్టు బిల్డింగ్.. రెండో ఫ్లోర్‌లో ఆఫీసు.. లోపలికి వెళ్లగానే ఎడమవైపు.. పెద్ద సుస్మన్ సినిమా పోస్టర్.. కుడివైపు అంకుర్ నిషాంత్ పోస్టర్లు. కొంచెం ముందుకువెళ్లి డోర్ తీయగానే దర్శకుడు శ్యాం బెనగల్. అభిముఖంగా తపస్సు చేసుకుంటున్నట్టున్నారు. ఒంటరిగా 85 ఏండ్ల వయసులో ఎంతో ఎనర్జెటిక్‌గా కనిపిస్తున్నారు. చుట్టూ బోలెడు పుస్తకాలు, కాగితాలు, ఫొటోల మధ్య షేక్ ముజీబుర్ రెహ్మాన్ లైఫ్‌స్టోరీ మీద స్క్రిప్ట్ రాసుకునే పనిలో ఉన్నారు. ముజీబుర్ రెహ్మాన్ కూతురు ప్రస్తుత బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా రిక్వెస్ట్ మీద ఈ సినిమా తీసే పనిలో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఈ పని తప్ప వేరే ధ్యాస లేదు. అయినప్పటికీ సుమారు గంటన్నర సమయం కేటాయించారు. సినిమా, తెలంగాణ పల్లె,హైదరాబాద్, భాష రకరకాల అంశాల మీదసుదీర్ఘమైన జ్ఞాపకాలను పంచుకున్నారు. 1985లో భూదాన్ పోచంపల్లిలో, అలాగే ముక్తాపూర్ గ్రామంలో నేత కార్మికుల ఇతివృత్తం మీద తీసిన సినిమాను బెనగల్‌కు గుర్తుచేశాను. అప్పుడు నేను ఐదో తరగతి. చేనేత కార్మికుల సమస్యలు, సహకార సంఘాల వైఫల్యం, దళారుల దౌర్జన్యంతో అరుదైన చేనేత కళ ఎలా చితికిపోతున్నదో సుస్మన్ సినిమా చూపెడుతుంది. ఆ సినిమా షూటింగ్ కోసం ఓంపురి, షబానా అజ్మీ, పల్లవి జోషి.. మా ఇంట్లోనే రిహార్సల్స్ చేసేవారు. మా ఇంట్లోనే బస. మా వీధి జాతరలా ఉండేది. బట్టలపై రాజకీయ నేతలను నేయడం, కొత్త డిజైన్లను సృష్టించడం, కుట్టులేకుండా మూడు కొంగుల చీర, సుస్మన్ సినిమా కోసం పచ్చీసు కుర్తా పైజామా, మగ్గంపై నేసే నేత కళాకారుడైన మా నాయన చిలువేరు రామలింగం సహాయం ఎలా తీసుకున్నారో శ్యాంబెనగల్ చెప్తూ పోయారు. సుస్మన్ స్క్రిప్ట్ వర్క్ మా ఇంట్లో కూడా జరిగింది. సుస్మన్ సినిమా ప్రధాన పాత్రధారుడు ఓంపురికి మా నాయన మగ్గం నేయడం నేర్పించడమే కాకుండా, ఓంపురి పాత్రకు మా నాయనను రిఫరెన్స్‌గా తీసుకున్న విషయం చెప్పారు. బోనాల పండుగ రోజు మా నాయన బండి మీద మగ్గం నేస్తూ గుడికి వెళ్లేలోపు చీర పూర్తిచేసి అమ్మవారికి అప్పటికప్పుడే కట్టించే మా ఊరి సంప్రదాయాన్ని సుస్మన్ సినిమాలో ఓంపురికి అన్వయిస్తూ చిత్రీకరించిన విషయం కూడా ప్రస్తావనకు వచ్చింది. బెంగాల్ నుంచి మృణాల్‌సేన్, సత్యజిత్ రాయ్, కేరళ నుంచి ఆదూర్ గోపాలకృష్ణన్ కన్నడ నుంచి పట్టాభి రామిరెడ్డి (సంస్కార చండమార్త ఫేం), గిరీశ్ కాసరవల్లి, గిరీశ్ కర్నాడ్.. ఈ కోవకు చెందిన సూపర్ క్లబ్ డైరెక్టర్లు అద్భుతమైన ఆర్ట్ ఫిల్మ్‌లను తీస్తున్నారు. అవి ఇంటెలెక్చువల్ సినిమాలు. మామూలు ప్రేక్షకులకు ఎన్నటికీ చేరలేవు. ఇటు డబ్బు దండుకునే పక్కా కమర్షియల్ సినిమాలు, ఫైట్లు, క్లబ్ డాన్సులు, బూతు పాటలతో వేడి వేడి పకోడీలా జనాలను ఊపేస్తున్న కాలం అది. అంత ఆర్టూ పనికి రాదు. ఇంత పచ్చి వ్యాపార సెక్సిజమూ కూడదు. మధ్యే మార్గం ఉందా? కచ్చితంగా ఉంది. ఆ మిడిల్ ఆఫ్ ద రోడ్ ఫిల్మ్‌ను, టెక్నిక్‌ను కనిపెట్టినవారు శ్యాంబెనగల్. అప్పటిదాకా యాడ్ ఫిల్మ్ తీసుకుంటున్న శ్యాంబెనగల్‌ను గుజరాత్ వైట్ రెవొల్యూషన్ పితామహుడు వర్గీస్ కురియన్ పిలిచారు. ఇక్కడ కో-ఆపరేటివ్ పద్ధతిలో పాలు సేకరించి, నెయ్యి, స్వీట్లు, పాలు మార్కెటింగ్ చేస్తున్నాం. దీన్ని ప్రమోట్ చేస్తూ తక్కువ బడ్జెట్‌లో ఒక ఫిల్మ్ చేయగలవా అని అడిగారు. లెక్కలు వేసిన శ్యాం బెనగల్ ఆరు లక్షలు ఖర్చవుతుందన్నారు. గుజరాత్ కో-ఆపరేటివ్ రైతుల నుంచి తలా ఓ రూపాయి సేకరించి కురియన్.. శ్యాం బెనగల్‌కు ఆరు లక్షలు ఇచ్చారు. దాని ఫలితమే మంథన్ అనే గొప్ప సినిమా. మంథన్ అంటే చిలకడం. దాంట్లో స్మితా పాటిల్ హీరోయిన్. బహుశా అది ఆమె తొలి సినిమా అయి ఉంటుంది. అంకుర్, నిషాంత్‌లతో న్యూ వేవ్ పితామహుడిగా శ్యాం బెనగల్ పేరొందారు. మరాఠీ నటి హంసా వాడేకర్ జీవితం ఆధారంగా అమోల్ పాలేకర్, స్మితాపాటిల్, అంబరీష్‌పురిలతో శ్యాంబెనగల్ తీసిన భూమిక మరిచిపోలేని సినిమా. కథనం, టెక్నిక్, ట్విస్టులు, క్లైమాక్స్.. భారతీయ చలనచిత్ర రంగంలో పూర్తి భిన్నంగా ఉంటాయి. గాంధీజీపై తీసిన మేకింగ్ ఆఫ్ మహాత్మా.. అంతే అరుదైన సినిమా. భారతీయ సినిమాను 1980 నాటికే అంతర్జాతీయ వేదికలపై నిలబెట్టిన వారాయన . స్మితా పాటిల్, షబానా అజ్మీ అనే రెండు సినీ కళా సౌందర్య దీపాలను మనకు ప్రసాదించిన వారు శ్యాం బెనగల్. ఇది శ్యాంబెనెల్ సినిమా అని ఇట్టే చెప్పే విలక్షణ శైలి ఆయనది. మెయిన్ స్ట్రీమ్, కమర్షియల్ సినిమా ధాటిని తట్టుకుని, తన సినిమాను నిలబెట్టుకునే చేవ ఉన్నవారు శ్యాం బెనగల్. ఆయన పంచుకున్న జ్ఞాపకాలు ఆయన మాటల్లోనే.. పుట్టి పెరిగింది సికింద్రాబాద్‌లోని కంటోన్మెంట్ ఏరియా తిరుమలగిరి. మెహబూబియా హై స్కూల్‌లో చదువు. ఆ తర్వాత నిజాం కాలేజీ. చదివింది హైదరాబాద్‌లో అయినా.. ప్రొఫెషనల్ వర్క్ మాత్రం బాంబేలోనే. అప్పట్లో తెలంగాణలోని 9 జిల్లాల్లో నేను విపరీతంగా తిరిగేవాడిని. తెలంగాణలోని ప్రతి పల్లె నాకు తెలుసు. ఏ ప్రాంతానికి వెళ్లినా.. ఆ ప్రాంతాన్ని వదిలి పెట్టాలనిపించేదికాదు. ఆ ప్రాంతంతో అంత అటాచ్‌మెంట్ ఉండేది. తెలంగాణలోని సిద్దిపేటతో పాటు పలు ప్రాంతాల్లో రమణీయమైన పెద్ద పెద్ద రాళ్ల కూర్పు ఉండేది. పంటసాగు సమయంలో పచ్చని పొలాల్లో తెలంగాణ ప్రాంతం కంటికి ఇంపుగా ఉండేది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో కూడా అందమైన ఎత్తైన రాళ్లు ఒద్దికగా ఉండేవి. కానీ ఇప్పుడంతా ధ్వంసమైంది. సుమారు అర్ధ శతాబ్దం నుంచి ఎప్పుడైతే తెలంగాణ.. ఆంధ్రా అజమాయిషీలోకి పోయిందో.. అప్పటి నుంచి తెలంగాణ ధ్వంసం కావడం మొదలైంది. శతాబ్దాల పాటు వర్ధిల్లిన అప్పటి హైదరాబాద్ ఇప్పుడు లేదు. కట్టడాలు లేవు. ఆంధ్రా నేతల చేతుల్లోని తెలంగాణ చీడపురుగు పట్టిన పంటలా తయారైంది. ఇక్కడి ల్యాండ్‌స్కేప్ దేశంలో ఓల్డ్ మైసూర్‌లో తప్ప ఎక్కడా లేదు. దక్కనీ ప్రాంతంలో విలక్షణమైన వాతావరణం ఉండేది. ప్రత్యేకంగా తెలంగాణలోని 9 జిల్లాల్లో అప్పటి వాతావరణం అద్భుతంగా ఉండేది. 1960 నుంచి హైదరాబాద్ రూపురేఖలు మారిపోయాయి. తెలంగాణ ప్రాంతీయ జీవన విధానం ఇతివృత్తంగా సినిమాలు తీసే విషయాల గురించి చెబుతూ.. భారత దేశంలోని భాషలు, సంస్కృతులు విభిన్నమైనవి. ప్రత్యేకంగా దక్కనీ ప్రాంతం విలక్షణమైనది. మీరు భారతదేశ పటం ఆకారం చూసినట్టయితే, హైదరాబాద్ నగరం మ్యాప్‌లో మధ్యలో కడుపులా ఉంటుంది. ప్రతిదీ హైదరాబాద్‌లో కలవాల్సిందే. అక్కడ జీర్ణం కావాల్సిందే. హైదరాబాద్‌లో భిన్న భాషలు మాట్లాడే మనుషుల జీవన విధానం ఉంది. ఈ సంస్కృతి భారతదేశంలో ఎక్కడా లేదు. హిందీ, ఉర్దూ, మరాఠీ, కన్నడ.. అన్ని భాషలూ మాట్లాడుతారు. అందుకే 'డిస్టింక్ట్ లింగ్వా ఆఫ్ ఫ్రాంకా'/దక్కనీ భాష అంటారు. అన్ని భాషల మిశ్రమమే దక్కనీ. ఉత్తరాది వారు మన హైదరాబాదీ భాషను హేళన చేసేవారు. అపన్, తుపన్ లాంటి పదాలు వింటే వాళ్లు నవ్వేవారు. కానీ ఇది ఓ ప్రత్యేకమైన విలక్షణమైన భాష. అలాంటి పదాలతో నిజాం కవిత్వాలే రాసేవారు. కులీ కుతుబ్‌షా దక్కనీ భాషలో అందమైన కవిత్వాలు రాసేవారు. ఆ కవిత్వాలను నా సినిమాలో వాడాను. నిషాంత్ సినిమా పాటలు వినండి.. అద్భుతమైన కులీ కుతుబ్‌షా కవిత్వం ఉంటుంది. అలాగే మండి సినిమా పాటలు కూడా.


**పవర్ ఆఫ్ కార్టూనిస్టు**

పద్మావతి, ప్యాడ్‌మ్యాన్‌లాంటి సినిమాల మీద లీగల్ నోటీసులు జారీ చేస్తున్నారన్న ప్రస్తావన వచ్చినప్పుడు ఈ సంగతి గుర్తుచేశాను. ప్రముఖ అమెరికన్ హాస్యపత్రిక 'మ్యాడ్' హాలీవుడ్ సినిమాలను పేరడీ చేస్తూ రెగ్యులర్‌గా కార్టూన్లు వేసేది. అప్పట్లో ఆ ఫీచర్ బంపర్ హిట్. 1980లో ఎంపైర్ స్ట్రైక్స్ బ్యాక్ సినిమా రిలీజైనపుడు 'ఎంపైర్ స్ట్రైక్ అవుట్' అంటూ మార్ట్ డ్రక్కర్ గీసిన కార్టూన్‌ని వేసింది. ఎప్పట్లాగే ఆ కార్టూనూ సూపర్ డూపర్ హిట్ అయ్యింది. ఆ సినిమా నిర్మాణ సంస్థ నుంచి మ్యాడ్ పబ్లిషర్ బిల్ గేయిన్స్‌కు లీగల్ నోటీసులు పంపారు.. వెంటనే మ్యాగజైన్లను మార్కెట్ల నుంచి తొలగించాలని, అలాగే ప్రతులను దగ్ధం చేయాలని, ఆ సినిమా నిర్మాణ సంస్థకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. 'మ్యాడ్'కు వీరాభిమాని అయిన సినిమా నిర్మాత జార్జ్ లూకాస్ 'ఎంపైర్' కార్టూన్ అద్భుతమంటూ కార్టూనిస్టు మార్ట్‌ను ఆస్కార్‌కు నామినేట్ చేస్తున్నానంటూ ఒక అభినందన లేఖ 'మ్యాడ్'కు పంపాడు. అప్పుడు మ్యాడ్ పత్రిక వాళ్లు ఆ అభినందన లేఖను లీగల్ నోటీసు జారీ చేసిన వారికి పంపడంతో కేసు కథ ముగిసింది. ఈ సంగతి వినగానే శ్యాం బెనెగల్ దట్ ఈజ్ ద పవర్ ఆఫ్ కార్టూనిస్టు అన్నాడు. నా దగ్గర ఇప్పటికే కులీ కుతుబ్‌షా కవిత్వాల కలెక్షన్ ఉంది. అది దక్కనీ భాష. ఉత్తరాది సినిమా వాళ్ల రాకతో అప్పటి అందమైన భాష కూడా ధ్వంసమైంది. ఉత్తరాది సినిమావాళ్లు దక్కనీ భాషను ఎలా హేళన చేశారో, ఆంధ్రా సినిమా వాళ్లు తెలంగాణ భాషను అలా వెక్కిరించారు. నిజానికి మన అందరికీ తెలుసు. తెలంగాణ భాష అసలైన తెలుగు భాష. ఆంధ్రా సినిమా వాళ్లకు తెలంగాణ ప్రజల మీద చులకన భావన ఉండేది. చదువు రాదని, తెలివి లేనివాళ్లు అని, అందుకే సినిమాల్లో తెలంగాణ భాషను వెక్కిరించే డైలాగ్‌లు ఉండేవి. కానీ ఈ ప్రాంత ప్రజలు గ్రేస్‌ఫుల్ పీపుల్. వీళ్లకు మర్యాద తెలుసు. దక్కనీ ప్రాంతంలోని ఔరంగాబాద్, నాందేడ్, మరాఠ్వాడా, గుల్బర్గా ప్రాంతాల ప్రజలను పరిశీలించండి, కర్టెసీతో పాటు విలక్షణమైన మనస్తత్వం ఉన్న మనుషులుగా కనిపిస్తారు. కేరళ, తమిళనాడులాంటి కోస్తా ప్రాంతాల్లో పంటలు పండినట్లు, తెలంగాణలో అంత సులువుగా పంటలు పండవు. పంటలు సులువుగా పండే ప్రాంతాల్లో ప్రజలు చాలా అగ్రెసివ్‌గా ఉంటారు. నెహ్రూ డిస్కవరీ ఆఫ్ ఇండియా ఆధారంగా దూరదర్శన్ కోసం 'భారత్ ఏక్ ఖోజ్' తీశారు కదా, నెహ్రూ ప్రాపంచిక దృక్పథం వెనుకంజ వేసి ఇప్పుడు హిందుత్వ తీవ్రవాద దక్పథం పైచేయి అవుతున్నది కదా, దీనిపై మీరెలా స్పందిస్తారు అని అడిగితే.. 'భారత్ ఏక్ ఖోజ్'లో రెండు దృష్టి కోణాలు ఉంటాయి. ఒకటి నెహ్రూ చూసిన భారత దేశం. రెండోది ఓంపురి పాత్రలో సామాన్య చరిత్రకారుడు చూసిన భారతదేశం. ఈ రెండు గొంతుకలు సమాంతరంగా ఈ సినిమాలో నడుస్తాయి. చరిత్ర మారదు. మన అవసరాలకు అనుగుణంగా చూసినప్పుడు చరిత్ర మారినట్లు అనిపిస్తుంది. ఇప్పుడు చరిత్రను కొంతమంది ఆరెస్సెస్ భావజాలంతో చూస్తున్నారు. ఫైటింగ్, డ్యాన్సుల తరహా కమర్షియల్ సినిమాలు కాకుండా రియలిస్టిక్ సినిమాలు తీయడానికి కారణం ఏమిటని అడిగితే.. అవి కృత్రిమమైన సినిమాలు. మన జీవితానికి దూరంగా ఉండే అవాస్తవిక చిత్రాలు. నేను మీడియా కుటుంబం నుంచి వచ్చినవాడిని. మా నాయన ఫొటోగ్రాఫర్. ఆయనకో వీడియో కెమెరా ఉండేది. మేం పది మంది పిల్లలం. ఒక్కొక్కరి మీద తన కెమెరాతో ఒక్కొక్క సినిమాలా తీసేవారు. మా సినిమాలను మేం చూసుకునే వాళ్లం. సహజంగా ఉండేవి. ఆ కెమెరాలతో నేను మా కుటుంబసభ్యులను చిత్రీకరించేవాణ్ని. ఆ ప్రభావమే కుటుంబ విధానం, జీవితంలోని బ్యూటీని క్యాప్చర్ చేసేలా చేసిందేమో. తెలంగాణ తెలుగు సినిమాల గురించి.. అప్పట్లో హైదరాబాద్‌లో తెలుగు సినిమా పరిశ్రమలేదు. మదరాసులో ఉండేది. తెలంగాణ రిప్రజెంటేషన్ సినిమాలే లేవు. కేవలం ఆంధ్రా రిప్రజెంటేషన్ సినిమాలే వచ్చేవి. తెలంగాణ ఫిల్మ్ మేకర్స్ అరకొర తప్ప పెద్దగా ఉండేవారు కాదు. నేను అంకుర్ తీసినప్పుడు.. దక్కనీ భాషలో తీసిన మొదటి సినిమా. తమాషా ఏందంటే విజయవాడ నుంచి ఓ న్యూస్‌పేపర్ రివ్యూలో ఏం రాశారంటే.. తెలంగాణలో తీసిన మొట్టమొదటి తెలుగు సినిమా అని. ఇప్పుడు తెలంగాణ వచ్చాక..తెలంగాణ ఇతివృత్తంతో సినిమాలు వస్తున్నాయని విన్నాను. ఇది మంచి పరిణామం.

అక్షర విజేత




# ఊరికో అధికారి మళ్లెందుకు?



పేదల భూములను కాపాడటం కోసం మునుపెన్నడూ లేనివిధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూ ప్రక్షాళన చేసింది. అందుకోసం 'ధరణి' పోర్టల్‌ను తీసుకువచ్చింది. కానీ, ధరణిలో కొన్ని లోపాలున్నాయని, వాటిని సరిచేసి 'భూ భారతి' పేరిట సరికొత్త పోర్టల్‌ను తీసుకొస్తున్నామని కాంగ్రెస్ పాలకులు నింగికి నిచ్చెనలు వేసే మాటలు చెప్తున్నారు. అధికార పార్టీ నేతలు చెప్తున్నట్టు అన్ని భూ సమస్యలకు పరిష్కారం ఉండే విధంగా టెక్నాలజీని అభివృద్ధి చేస్తే మరి 'ఊరికో అధికారి మళ్లెందుకు?' అన్న ప్రశ్న సామాన్య ప్రజల్లో తలెత్తుతున్నది. ఊరికో అధికారి వల్ల గ్రామాల్లో, మండల కేంద్రాల్లో గతంలో పేద రైతులు తిప్పలు పడేవారు. తమ భూములను తమ పేరు మీదికి మార్చుకోవాలన్నా, వారసత్వ బదిలీ జరగాలన్నా, భూ రికార్డులో తప్పులను సరిచేయాలన్నా గ్రామ పరిధిలో ఉండే రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. అవసరమైతే వారిని ప్రసన్నం చేసుకునేందుకు ముడుపులు కూడా ముట్టజెప్పాల్సి వచ్చేది. అట్లయితేనే పనులు పూర్తయ్యే పరిస్థితి నాడు ఉండేది. అందుకే, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ వ్యవస్థను రద్దు చేసి, సదరు సిబ్బందిని ఇతర విభాగాల్లో సర్దుబాటు చేసింది. బీఆర్ఎస్ సర్కార్ చేపట్టిన చర్యల కారణంగా భూ సమస్యల పరిష్కారం కోసం ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది. తద్వారా ఎలాంటి పైరవీలు లేకుండానే మండల కార్యాలయాల్లో సాఫ్‌సీదా పనులు చేసుకునే వెసులుబాటు కల్పించింది. కానీ, మళ్లీ ఇప్పుడు నాటి పాత రోజులను తలపించేలా అధికార కాంగ్రెస్ పార్టీ చర్యలు చేపడుతున్నది. ఉన్నపళంగా రాష్ట్రంలో గ్రామానికో రెవెన్యూ అధికారిని మళ్లీ నియమిస్తామని, వారి ద్వారా భూ సమస్యలు పరిష్కారమయ్యేలా చేస్తామని చెప్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భూ సమస్యల పరిష్కారం దేవుడెరుగు.. మళ్లీ పైరవీల కాలం వస్తే రైతన్నల పరిస్థితి ఏమిటి? గ్రామస్థాయిలో ప్రతేక అధికారులు లేకపోయినా భూముల పట్టాలు, భూ సంబంధిత అంశాలు, రైతుల కార్యక్రమాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరించింది. మరి ఇప్పుడు అధికార పార్టీ గ్రామానికో అధికారిని నియమించి ఎవరికి లబ్ధి చేకూర్చాలని ఆశిస్తున్నది? ఇచ్చిన హామీలు, గ్యారెంటీలను అమలు చేయకుండా ఇలాంటి నిరూపయోగ పనులు చేయడం సబబు కాదు. ఇది ముమ్మాటికీ రైతు వ్యతిరేక నిర్ణయమే

# సిలబస్ మారొచ్చు.. కానీ చరిత్ర మారదు!

తెలుగు సమాజానికి ఉజ్వలమైన చరిత్ర ఉన్నది. దేశవిముక్తి ఉద్యమాలు.. భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన పోరాటాలు తెలంగాణ నేల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి. అయితే, రాజుల కాలం నుంచి నేటి ప్రజాస్వామ్య కాలం వరకు తిరుగుబాట్లపై అణచివేత మాత్రం అలాగే కొనసాగుతోంది. ప్రతి తిరుగుబాటుపైన కాలాన్ని బట్టి, అక్కడున్న వ్యవస్థలను బట్టి రూపం మార్చుకుంటూ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. రాజ్యాధికారాన్ని ధిక్కరించి మాట్లాడినవాళ్లంతా ఏదో ఒక రూపంలో దాడులకు గురయ్యారు. నిర్బంధాలను ఎదుర్కొన్నారు. అసువులుబాసారు. వీరతెలంగాణ సాయుధ పోరాటంలో 4 వేల మంది నేలకొరిగారు. స్వాతంత్ర్యానంతరం రాజ్యానికి, నక్సలైట్లకు మధ్య జరిగిన పోరాటంలో వేలమంది పోలీసులు, నక్సలైట్లు చనిపోయారు. ఈ ఉద్యమ ప్రవాహంలో సాహిత్య, సాంస్కృతిక సంస్థలు వెలువరించిన కావ్యాలపై, కవితలపై, పాటలపై, మాటలపై, అడుగులపై, నడకలపై, నడతలపై, కాలిగజ్జెలపై, గొంగళ్లపై, ప్రజాకంఠాలపైన నిషేధాలు విధించారు. నిషేధ సాహిత్యంపై విశ్వవిద్యాలయాలే పరిశోధనలు చేసి పీహెచ్‌డీ పట్టాలిచ్చాయి. అది శ్రీకాకుళం గిరిజన రైతాంత పోరాటమైనా, నక్సల్‌బరీ వసంత మేఘ గర్జనతో ఉత్తర తెలంగాణ ఎరుపెక్కినా ఆయా కాలాల్లో వచ్చిన సాహిత్యంపై నిషేధాలు విధించారు. ఇది రాజ్యస్వభావం. దీనికి ఆశ్చర్యపోనక్కర్లేదు. నిషేధాలు ఎక్కువగా చేసే ప్రభుత్వాలు నిరంకుశ సర్కార్లుగా చరిత్రలో నిలిచిపోతాయి. అవి ఎమర్జెన్సీ చీకటి రోజులు కావచ్చు.. 1970-1975 వరకు తెలంగాణ జిల్లాల్లో కొనసాగిన అప్రకటిత చీకటి రోజులు కావచ్చు. రాజ్యానికి కోపం వస్తే ఎన్‌కౌంటర్లతోనే పరిమితమైపోదు. అది సాహిత్యాన్ని కూడా నిషేధిస్తుంది. ఆట, పాట, మాటను కూడా నిషేధిస్తుంది. రాజ్యం కన్నెర్రజేస్తే వీరుల స్తూపాలను కూడా నేలరాలుస్తుంది. రాజ్యానికి అవసరం వస్తే అమరుల స్తూపాలకు మొక్కుతుంది. అందుకు పార్టీల పేరును ఉటంకించాల్సిన అవసరం లేదు. అందరికీ తెలిసినవే. 'ఇందిరమ్మ సోషలిజం ఎందాకొచ్చిందిరో, అది ఇంద్రవెల్లిలోన వంద మందిని మింగిందిరో', 'ఇంద్రవెల్లి కదిలింది పోరుబాట సాగింది.. పోరాటం ఆపకుండా ముమ్మందుకు సాగింది' అన్న పాటలు తెలంగాణ నేలకు సుపరిచితాలే. ఎవరి పాలనలో, ఏ రాజ్యం ఏలుబడిలో వీరుల నెత్తురు నేలచింది ఇంద్రవెల్లి స్తూపం అయ్యిందో.. అదే రాజ్యం కొన్ని దశాబ్దాల తర్వాత అదే స్తూపానికి మొక్కి ఆ అమరుల వీరత్వాన్ని చాటి చెప్పడం కూడా తెలంగాణ నేల చూసింది. విప్లవ రచనలపై నిషేధం వాయిదాల పద్ధతిలో నిరంతరంగా కొనసాగుతూనే ఉంది. అది ఆగేది కాదు. ప్రతిఘటన పోరాటాలపై, ఉద్యమాలపై ప్రభుత్వ దాడులు, ఘర్షణలు సహజం. అది వర్గాల మధ్య వర్గపోరాటంగా కొనసాగుతూ ఉంటుంది. అధికార రాజముద్రల మధ్య కూడా పోరాటం అదే రీతిలో కొనసాగుతూ ఉంటుంది. అది ఒక ప్రభుత్వంపై మరో ప్రభుత్వం దశల్ని బట్టి స్థాయిల్ని బట్టి ఉంటుంది. అది విమర్శల పర్వం కావచ్చు, దాడుల పర్వం కావచ్చు, ఒకరిపై ఒకరు ఆ ఘర్షణల పరంపరను వర్తమాన సంఘర్షణగానూ మార్చవచ్చు. గత ప్రభుత్వం చేసిన పనుల కంటే తాము గద్దెనెక్కినాక చేసే పనులు మరింత గొప్పగా ఉండాలని ప్రభుత్వాలు పాలనలో పోటీ పడటం సహజం. అది ఆరోగ్యకరమైన స్థితికి చిహ్నమే. కానీ, ఇప్పుడు తెలంగాణలో జరుగుతున్నదేమిటంటే అనారోగ్య రాజకీయ వాతావరణం. అది రాష్ట్రమంతటా భారీ వ్యాధిగా మారిపోయింది. అది ముదిరి ఎక్కడిదాకా వచ్చిందంటే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన తెలంగాణ తల్లి విగ్రహం మార్పు దాకా. ఇప్పుడు తెలంగాణలో విగ్రహాల యుద్ధం నడుస్తోంది. మలిదశ తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో ఈ విగ్రహ తల్లుల చర్చ లెగిసింది. అప్పుడు తెలుగు తల్లి, తెలంగాణ తల్లి విగ్రహాల మధ్య భారీగా చర్చ జరిగింది. ఆ మలిదశ తెలంగాణ ఉద్యమం తనకు తానుగా సృష్టించుకున్న తెలంగాణ తల్లి విగ్రహం అది. కవులు, కళాకారులు, శిల్పులతో లోతుగా చర్చించి ఉద్యమ బిడ్డలు తమ ఉద్యమతల్లి రూపాన్ని ప్రతిష్ఠించుకున్నారు. బతుకమ్మలు, బోనాలు, వంటావార్పులు, జేఏసీలు, ధూంధాంలలో ఆ ఉద్యమతల్లి రూపాన్ని స్ఫూర్తిగా తీసుకుని అనేక ప్రజా, విద్యార్థి, యువజన సంఘాలు ముందుకుసాగాయి. రాజకీయ ప్రక్రియతో ఉద్యమించిన ఉద్యమపార్టీ టీఆర్ఎస్ ఆ తెలంగాణ తల్లి విగ్రహాలను వందల, వేల గ్రామాల్లో ఉద్యమకాలంలోనే ప్రతిష్ఠించింది. నాటి వలసాధిపత్య ప్రభుత్వం కూడా ఉద్యమ తల్లి విగ్రహంపై ఆంక్షలు విధించలేకపోయింది. మలిదశ ఉద్యమ గెలుపుతో స్వరాష్ట్రం అవతరించాక అమరుల స్వర్గధామాన్ని తెలంగాణ సచివాలయం ఎదుటే నిర్మించుకున్నాం. ఆ అమరజ్యోతిలో తెలంగాణ తల్లి రూపాన్ని కూడా ప్రతిష్ఠించుకున్నాం. కానీ, 2023 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం తెలంగాణ తల్లి విగ్రహం రూపుమార్చి కొత్త విగ్రహాన్ని సచివాలయంలో ప్రతిష్ఠించింది. తాము రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహమే అధికారిక తెలంగాణ తల్లి అని జీవో కూడా విడుదల చేసింది. ఇప్పటిదాకా పుస్తకాలపై నిషేధాన్నే చూసిన తెలుగు సమాజం ఇక విగ్రహాలపై కూడా నిషేధాన్ని చూస్తోంది. తమ గుర్తులు శాశ్వతంగా నిలిచిపోవాలని కొత్త ప్రభుత్వాలు పనిచేస్తాయి. గత ప్రభుత్వం చేసిన మంచి పనులను కూడా కొనసాగిస్తాయి. అది ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు కావచ్చు, ఇంకేమైనా ఉండవచ్చు. కానీ, కాంగ్రెస్ సర్కార్ అలా కాదు. గత ప్రభుత్వ గుర్తులను చెరిపేసే లక్ష్యంతో ముందుకుసాగుతున్నది. గత ప్రభుత్వం ముద్రించిన పుస్తకాల్లో తొలి ముఖ్యమంత్రి ముఖచిత్రాలను కూడా చించివేయించడం ఏ సంస్కృతికి చిహ్నమో అర్థం కావడం లేదు. సాహిత్య అకాడమీ, తెలంగాణ సాంస్కృతిక శాఖ తదితర సంస్థలు పాఠ్యపుస్తకాల్లో నాటి ముఖ్యమంత్రి ఫోటోలు లేదా వారి సందేశాలు ఉండటం సహజం. కానీ, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం తొలి తెలంగాణ ముఖ్యమంత్రి ముద్రించిన పుస్తకాల్లోని కేసీఆర్ ముద్రల్ని తొలగించే కార్యాన్ని చేపట్టింది. ఇప్పటికే పాఠ్యపుస్తకాలను వెనక్కు తెప్పించి కేసీఆర్ ముఖచిత్రం లేకుండా తీసివేశారు. ఇప్పుడు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ముద్రించిన గత ముఖ్యమంత్రి సందేశాలు ఉన్న పేజీలను చింపేశారు. ఈ పనిని బహిరంగంగానే ప్రకటించి మరీ చేస్తున్నారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చూస్తాం, చేస్తాం అని ఒక పక్క ముఖ్యమంత్రి బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఆలోచనల మేరకు ప్రభుత్వ శాఖలు పనిచేయాలి. దాన్నెవ్వరు కాదనరు. కానీ, గత ప్రభుత్వంలో వేసిన చరిత్ర పుస్తకాల నుంచి వెదికి మరీ నాటి ముఖ్యమంత్రి ఆనవాళ్లను



చెరిపేయడానికి ప్రభుత్వ శాఖలే పూనుకొనడం విచారకరం. 42 రోజుల పాటు జరిగిన సకలజనుల సమ్మె చరిత్రను ఎవరూ చెరిపేయలేరు. తెలంగాణ ఉద్యమ ఘట్టాలను చెరిపేయలేరు. ఎవరికనుకూలంగా వారు చరిత్రను సొంత గళంతో రాసుకుంటే రాసుకోవచ్చు. కానీ, అసలైన చరిత్రపై హస్తాలు వేస్తామంటే చరిత్ర ఒప్పుకోదు, చరిత్రకారులు ఒప్పుకోరు. పొరుగు రాష్ట్రం తమిళనాడు సీఎం స్టాలిన్ అంతకుముందు ముఖ్యమంత్రి జయలలిత ముఖచిత్రంతో ఉన్న పిల్లల పుస్తకాల సంచుల్ని చింపివేయలేదు. పుస్తకాల్లో ఉన్న జయలలిత సందేశాలను తొలగించలేదు. అమ్మ క్యాంటీన్ల పేరు మార్చలేదు. రాజులు పోవచ్చు, రాజ్యాలు పోవచ్చు. పాలకులు మారొచ్చు, ప్రభుత్వాలు పోవచ్చు. చరిత్ర మాత్రం మారదు. తల్లులు మారరు. అలాగే సిలబస్‌లు మారొచ్చు.. కానీ, చరిత్ర మారదు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చూస్తాం, చేస్తాం అని ఒక పక్క ముఖ్యమంత్రి బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఆలోచనల మేరకు ప్రభుత్వ శాఖలు పనిచేయాలి. దాన్నెవ్వరు కాదనరు. కానీ, గత ప్రభుత్వంలో వేసిన చరిత్ర పుస్తకాల నుంచి వెదికి మరీ నాటి ముఖ్యమంత్రి ఆనవాళ్లను చెరిపేయడానికి ప్రభుత్వ శాఖలే పూనుకొనడం విచారకరం.

# విమర్శలనే మెట్లుగా మలుచుకున్న మౌనముని

మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఢిల్లీ ఎయిమ్స్‌లో గురువారం పరమపదించారనే వార్త విని దిగ్భ్రాంతికి గురయ్యాను. వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సంతాపం తెలుపుతున్నా. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు క్యాబినెట్‌లో ఆర్థికమంత్రిగా మన్మోహన్‌సింగ్ దేశ చరిత్రలో తనదైన, చెరగని ముద్రవేశారు. సరళీకృత ఆర్థిక విధానాలతో మౌనంగా, ఎలాంటి ప్రచారాలు, ఆర్భాటాలు లేకుండా దేశ గతిని మార్చారు. ఆరు దశాబ్దాల పాటు దేశానికి అనేక స్థాయుల్లో సేవ చేసిన మన్మోహన్‌సింగ్‌కు ప్రతి భారత పౌరుడు రుణపడి ఉంటాడు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్న మన్మోహన్‌సింగ్ ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పాఠాలు బోధించి ఎందరినో ఆర్థికవేత్తలుగా తీర్చిదిద్దారు. అంతేకాదు, వాణిజ్య పరిశ్రమల శాఖకు సలహాదారుగా ఉంటూ, ప్రధాన



ఆర్థిక సలహాదారుగా కూడా సేవలందించారు. ఆ తర్వాత రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, ప్రణాళికా సంఘం డిప్యూటీ చైర్మన్‌గా కూడా ఎనలేని సేవలు చేశారు. దేశ సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన ఆయన ఎన్నడూ పదవుల కోసం వెంపర్లాడలేదు. మన్మోహన్‌సింగ్‌కు ఉన్న పరిజ్ఞానం, అనుభవాలను చూసి పదవులే ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి. పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రి పదవి కూడా ఆ తరహాలో వచ్చిందే. ఏ పార్టీలో వీసమెత్తు సభ్యత్వం కూడా లేని మన్మోహన్‌సింగ్‌కు దేశ ఆర్థికమంత్రి పదవి దక్కడం విశేషం. మన దేశం అనేక ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయం అది. ఆపత్కాలంలో ఆర్థికమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మన్మోహన్‌సింగ్.. ప్రమాదపుటంచున ఉన్న దేశ ఆర్థికవ్యవస్థను తన మేధోసంపత్తితో గాడిలో పెట్టారు. తద్వారా ఆర్థిక సంక్షోభం నుంచి దేశం గట్టెక్కింది. లైసెన్స్ రాజ్యానికి తెరదించి సరళీకృత ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టిన ఆయన ఆర్థిక రంగానికి జవసత్వాలు అందించారు. అప్పటి ప్రధాని పీవీ సహకారంతో ఆర్థికమంత్రిగా మన్మోహన్‌సింగ్ చేపట్టిన చర్యల కారణంగా విదేశీ పెట్టుబడులు, పరిశ్రమలు వెల్లువలా వచ్చాయి. దాంతో దేశం అతివేగంగా అభివృద్ధి చెందింది. రోజూ 16 గంటల పాటు పనిచేసే మన్మోహన్‌సింగ్‌కు అలుపు, అలసట అనేవే తెలియవు. ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా దేశానికి సేవ చేసిన ఆయన ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం పొందారు. 2004లో మొదటిసారి ప్రధానమంత్రి పదవిని అలంకరించిన ఆయన 2004-09 మధ్యకాలంలో ప్రజారంజక పాలనను అందించారు. తద్వారా ప్రజామోదం పొంది 2009లో మరోసారి ప్రధాని పీఠాన్ని అధిరోహించారు. పరస్పర విరుద్ధ భావాలు కలిగిన రష్యా, అమెరికాలతో మన దేశ సంబంధాలు ఏ మాత్రం చెక్కుచెదరకుండా కాపాడటం మన్మోహన్‌సింగ్ చతురతకు నిదర్శనం. అలాగే సర్వశిక్షా అభియాన్, పనికి ఆహారం, సమాచార హక్కు లాంటి వినూత్న పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుంది. మౌనాన్నే తన బలంగా చేసుకొని, ప్రతిపక్షాల విమర్శలను మెట్లుగా మలుచుకొని ఉత్తమ ఆర్థికమంత్రిగా, ప్రధానిగా సేవలందించిన ప్రాతఃస్మరణీయుడు మన్మోహన్‌సింగ్. ఆయన అస్తమయం భారతావనికి తీరని లోటు.

# తెలంగాణను తీర్చిదిద్దిన మహానేత



తెలంగాణ ఆవిర్భావం, ఆ తర్వాత రాష్ట్రాభివృద్ధిలో కేసీఆర్ పాత్ర చరిత్రాత్మకమైనది. ఉద్యమ నాయకుడిగా తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు జీవం పోసి, రాష్ట్రాభివృద్ధికి అంకితమై ఆయన పనిచేశారు. గమ్యాన్ని ముద్దాడేవరకు విశ్రమించవద్దని ఉద్యమ సమయంలో కేసీఆర్ పదే పదే చెప్పేవారు. అదే పంథాను ఆయన అభివృద్ధిలో చూపించారు. అభివృద్ధికి అడ్డం పడినవారందరితో పోరాడి పదేండ్లలో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారు. 1969లో తొలి దశ తెలంగాణ ఉద్యమం మొదలైనప్పటికీ అది కాలక్రమేణా కనుమరుగైంది. ఆ తర్వాత తెలంగాణ తన అస్తిత్వాన్ని కోల్పోయింది. చాలామందికి తెలంగాణ ప్రాంతం ఒకప్పుడు ప్రత్యేక రాష్ట్రమనే సంగతి కూడా తెల్వకుండాపోయింది. అలాంటి పరిస్థితుల్లో కేసీఆర్ మళ్లీ పోరుజెండా ఎత్తుకున్నారు. 2001లో టీఆర్ఎస్ పార్టీని స్థాపించి ఉద్యమానికి కొత్త జవసత్వాలు ఇచ్చారు. ఉద్యమాన్ని కేసీఆర్ శాస్త్రీయంగా, రాజ్యాంగబద్ధంగా నడిపారు. ఏం చేస్తే స్వరాష్ట్రం సాధించవచ్చో క్షుణ్ణంగా అధ్యయనం చేసి, తెలంగాణ ఆకాంక్షను జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. నిరాహార దీక్షలు, సభలు, ర్యాలీలు, పార్లమెంటు లోపల, వెలుపల నిరంతరంగా పోరాటం చేస్తూ ఉద్యమాన్ని సజీవంగా ఉంచారు. అంతేకాదు, ఢిల్లీ పెద్దలకు ఉద్యమ సెగ తాకేలా చేసేందుకు అనేకసార్లు రాజీనామా చేసి, ప్రజాక్షేత్రంలో తన బలాన్ని నిరూపించుకున్నారు. ఈ క్రమంలో ఒకటి కాదు, రెండు కాదు తెలంగాణ కోసం సామ దాన దండోపాయాలన్నింటినీ వాడారు. 'నో స్టోన్ లెఫ్ట్ అన్ టర్న్' అనే సూక్తి ఇందుకు సరిగ్గా సరిపోతుంది. తెలంగాణ ఏర్పాటుతో ప్రజల ఎదురుచూపులు ఫలించాయి. ఉద్యమ నాయకుడిగా నిరూపించుకున్న కేసీఆర్.. పాలకుడిగానూ నిరూపించుకున్నారు. ఆయన నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోయింది. అయితే, పసికందు తెలంగాణను తన కాళ్ల మీద తాను నిలబడేలా చేయడమంటే మాటలు కాదు. ఉమ్మడి ఏపీ నుంచి వారసత్వంగా వచ్చిన ఎన్నో కష్టాలు ఒకవైపు వెక్కిరిస్తుండగా.. మరోవైపు తెలంగాణను ఫెయిల్యూర్ రాష్ట్రంగా చేయాలని వ్యతిరేక శక్తులు కుట్రలు మొదలుపెట్టాయి. అందులో మొట్టమొదటిది మనకు రావాల్సిన కరెంటును అడ్డుకోవడం. తెలంగాణను అంధకారంలోకి నెట్టాలని, చీకటి రాష్ట్రంగా చిత్రీకరించాలని వేసిన కుయుక్తులను కేసీఆర్ పటాపంచలు చేశారు. అతితక్కువ కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా 24 గంటల కరెంటు సరఫరా చేశారు. కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి తెలంగాణలో మిగులు కరెంటు ఉండేలా ప్రణాళికలు రచించారు. స్వరాష్ట్రంగా ఏర్పడకముందు తెలంగాణ ఒక కరువు ప్రాంతం. ఎర్రటి నేలలతో నిండిన తెలంగాణను పచ్చగా చేయాలంటే మన నీళ్లు మన బీళ్లకు మళ్లాలి. ఉద్యమ నినాదాన్ని నిజం చేసేందుకు వానలు పడాలని ఒకవైపు యజ్ఞాలు చేస్తూనే.. అంతకంటే వేగంగా ప్రాజెక్టుల నిర్మాణాలను కేసీఆర్ చేపట్టారు. బీఆర్ఎస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల విప్లవం జరిగింది. ప్రపంచం అబ్బురపడేలా పాతాళంలో ఉన్న గంగను మోసుకొచ్చే కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. వాటికి అనుబంధంగా నీటిని నిల్వ చేయడానికి రిజర్వాయర్లు నిర్మించారు. తెలంగాణ ఏర్పడకముందు తెలంగాణలో రైతుకు ఎవరూ విలువిచ్చేవారు కాదు. 50 ఎకరాల ఆసాములు కూడా అప్పులోళ్లే. ఊర్ల సేటు పెట్టుబడి పెడితేకాని నారు పోయలేని దుస్థితి. ఎంత పండినా కొనేవాడి కొర్రీలకు బలికావాల్సిందే. తెలంగాణ రైతులు ఎదుర్కొంటున్న ఇలాంటి అనేక దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు కేసీఆర్ ప్రభుత్వం నడుం బిగించింది. మిషన్ కాకతీయ ద్వారా వేల చెరువులను పునరుద్ధరించారు. కాళేశ్వరం నీళ్లతో ఆ చెరువులను నింపారు. తద్వారా రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరిగాయి. బావులు, బోర్ల కింద వ్యవసాయం లాభసాటిగా మారింది. అలా అనతికాలంలోనే తెలంగాణ దేశానికి అమ్మయ్యింది. కేవలం సాగునీరే కాదు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు ఇచ్చి జల దారిద్ర్యానికి కేసీఆర్ చెక్‌పెట్టారు. రైతుబంధు ద్వారా ఆర్థిక సాయం చేసి పెట్టుబడుల ఇబ్బందులను తీర్చారు. అకాలమరణం చెందిన రైతుల కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోకుండా రైతుబీమా ద్వారా ఆదుకున్నారు. రైతులందరికీ 24 గంటల ఉచిత విద్యుత్తు అందించి సాగును బాగు చేశారు. అసలు వ్యవసాయం చేసుడు అవసరమా? అనేకాడి నుంచి రెండెకరాల రైతు కూడా రాజే అనేకాడికి ఎవుసాన్ని కేసీఆర్ వృద్ధి చేశారు. తెలంగాణ వ్యవసాయ రంగాన్ని కుదేలు చేయడానికి ఎన్నో కుట్రలు జరిగాయి. ప్రాజెక్టులకు కేంద్రం నిధులివ్వలేదు. అనుమతులను అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయి. వాటన్నింటిని తట్టుకొని రైతాంగాన్ని కంటికి రెప్పలా కాచుకున్నారు. పెట్టుబడి నుంచి పంట కొనుగోలు చేసేదాక రైతులకు ఇసుమంతైనా కష్టం కలగకుండా కేసీఆర్ చూసుకున్నారు. ఉద్యోగాలు చేసేటోళ్లు కూడా కాడిపట్టే విధంగా వ్యవసాయాన్ని తీర్చిదిద్దిన కేసీఆర్ నిజంగా అభినవ మహర్షి. ఉమ్మడి ఏపీలో సంక్షేమం సంగతి దేవుడెరుగు విద్య, వైద్యం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి. అందుకే, కేసీఆర్ అభివృద్ధితో పాటు సంక్షేమానికి పెద్దపీట వేశా రు. దళితులు, గిరిజనులు, బీసీలు, ఇతర వర్గాల పిల్లలు చదువుకునేలా ప్రత్యేకంగా గురుకులాలను నెలకొల్పారు. బస్తీ దవాఖానల నుంచి సూపర్ స్పెషాలిటీల వరకు ఏర్పాటుచేసిన కేసీఆర్ వైద్యరంగానికి ప్రాధాన్యం ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల సామాజిక భద్రత పెరిగింది. అంతేకాదు, పరిశ్రమల ఉద్యమమే జరిగిందని చెప్పవచ్చు. టీఎస్-ఐపాస్ లాంటి వినూత్న విధానాల వల్ల పెట్టుబడులు వెల్లువలా వచ్చాయి. తెలంగాణ కోసం అహర్నిశలు శ్రమించిన కేసీఆర్ ప్రజానాయకుడిగా పేరొందారు. ఆయన అవలంబించిన విధానాలు రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టా యి. కేసీఆర్ లేకుంటే ఇంత అభివృద్ధి జరిగేది కాదు. అందుకే, కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యి, తెలంగాణ అభివృద్ధి యజ్ఞాన్ని పునఃప్రారంభిస్తారని ఆశిస్తున్నా.

# ధ్యానం శరణం గచ్ఛామి



రుషులు నిర్దేశించిన మార్గం ధ్యానం. గౌతమ బుద్ధుడు అనుసరించిన పథం ధ్యానం. విశిష్ట జీవనానికి మన పూర్వికులు ఈ జాతికి అందించిన పరుసవేది ఈ సాధన. మనసును ప్రశాంత స్థితికి తీసుకొచ్చి మన శక్తిని ఉద్దీపనం చేసే అస్త్రమిది. ధ్యానం ప్రధాన లక్ష్యం జీవితం పట్ల అవగాహన పెంచుకోవడమే! మన ఆలోచనలపై అదుపు సాధించడం వల్ల మనసుకు, శరీరానికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. శ్వాస మీద ధ్యాస ఒక పద్ధతైతే.. ఆలోచనలను అధిగమించే విధానం మరొకటి. మార్గమేదైనా ధ్యానాన్ని ఆశ్రయిస్తే.. జీవితం ఆరోగ్యంగా సాగిపోవడం ఖాయం. ఆధునిక స్త్రీలు ఇంటి బాధ్యతలతోపాటు ఉద్యోగాలు, వ్యాపారాల్లో రాణిస్తూ కాలంతోపాటే పరుగులు తీస్తున్న వాతావరణం ఇప్పుడు మామూలు విషయమైపోయింది. ఒత్తిళ్లతో కూడిన వాతావరణంలో మహిళలు తమ మానసిక, శారీరక ఆరోగ్యం గురించి శ్రద్ధ చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో నవతరం నారీమణుల మానసిక ఆరోగ్యం కోసం ధ్యానం ఓ మంచి ఉపకరణంగా నిలుస్తుంది. ధ్యానం చేయడంలో అనుసరించాల్సిన విధానాలు వేర్వేరు రకాలుగా ఉంటాయి.

### శ్వాస మీద ధ్యాస

ముక్కు పుటాల గుండా జరిగే శ్వాసక్రియ (ఉచ్ఛ్వాస, నిశ్వాస) క్రమాన్ని అలా గమనిస్తూ ఉండిపోవాలి. లేదంటే శ్వాసిస్తున్న క్రమాన్ని మనసులో లెక్కిస్తూ ఉండాలి. ఇలా చేస్తే మనసు మీద అదుపు వస్తుంది.

### ఎరుకతో ధ్యానం

దీన్ని మైండ్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ అంటారు. ఇందులో గతం, భవిష్యత్తుల గురించిన ఆలోచనలు వదిలిపెట్టి కేవలం వర్తమానంపై దృష్టి సారించాలి. ఆలోచనలు, మానసిక స్పందనలు, పరిసరాల మీద పూర్తి ఎరుకతో ఉండాలి. ఇలా చేయడం జీవితాన్ని యథాతథంగా ఆమోదించి ముందుకు వెళ్లడానికి దోహదపడుతుంది. ఆలోచనలు, భావోద్వేగాల పట్ల ఎరుకతో ఉండటం వల్ల స్త్రీలు తమ గురించి తాము అవగాహన చేసుకుని, జీవితంలో వివిధ సందర్భాల్లో ఎలా స్పందించాలో తెలుసుకోగల్గుతారు.

### మనసు ఖాళీ

మనసులో రోజువారీ జీవితంలో తలెత్తే గందరగోళాన్ని, గజిబిజి ఆలోచనలను ఖాళీ చేసుకోవాలి. మనసును ఆలోచన రహిత స్థితికి తెచ్చుకోవాలి. లేదంటే ఆలోచనలను అలా బయటికి స్వేచ్ఛగా వెళ్లిపోనివ్వాలి.

### వస్తువును చూస్తూ

ఓ చెట్టును కానీ, దీపశిఖను కానీ లేదంటే ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన వస్తువును కానీ అలా చూస్తూ ఉండటం ద్వారా కూడా మనసుపై పట్టు సాధించవచ్చు. అయితే ఇక్కడ మనం చూసే వస్తువు పట్ల ఎరుకతో ఉండాలి. ఆలోచనలను బలవంతంగా తొక్కిపట్టే ప్రయత్నం చేయకూడదు. అలా మనసును స్వేచ్ఛగా వదిలివేయాలి. కాసేపటికి అదే నెమ్మదిస్తుంది.

### సానుభూతిలోజి

మన పట్ల మనం, ఇతరుల పట్ల ప్రేమగా, దయతో మెలగడమూ ధ్యానమే. దీనివల్ల మన మీద మనకే కాకుండా ఎదుటివారి పట్ల సహానుభూతి, సానుభూతి, దయాగుణం అలవడతాయి. ఇది స్త్రీలు తమ మనోస్థితిని సానుకూలంగా మార్చుకుని ఇతరులతో సంబంధాలను మెరుగుపర్చుకునేందుకు దోహదపడుతుంది.

### మంత్ర ఉచ్చారణ

ఓ మంత్రాన్ని లేదంటే పదాన్ని, పదబంధాన్ని ఉచ్చరించడం కూడా ధ్యానమే. దీనివల్ల మనసుకు ఉపశమనం దొరుకుతుంది. మన గురించి మనకు ఎరుక ఏర్పడుతుంది. నామాన్ని ఉచ్చరించడం వల్ల ఒత్తిడి, ఆందోళన లాంటివి దూరమైపోతాయి. మనసు స్థిమిత పడుతుంది.

### ఎన్నో ప్రయోజనాలు

శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం ధ్యానంతో మానసిక, భావోద్వేగపరమైన, శారీరకపరమైన ఆరోగ్యం చేకూరుతుంది. ఒత్తిడి, నిరాశ, ఆందోళన దూరమైపోతాయి. క్రమం తప్పకుండా ధ్యానం చేయడం ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. మానసికంగా స్పష్టత వస్తుంది. ఏవైనా సవాళ్లు ఎదురైనప్పుడు భావోద్వేగాల్లో స్థిరత్వం ఏర్పడుతుంది. ఇక శారీరకంగా చూస్తే ధ్యానం వల్ల అధిక రక్తపోటు తగ్గుతుంది. అలా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. అయితే, ధ్యానం ఇచ్చే ప్రయోజనాలను పెంచుకోవాలని అనుకుంటే రోజువారీ జీవితంలో ఆరోగ్యకరమైన అలవాట్లకు చోటివ్వాలి. పోషకాలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవాలి. క్రమం తప్పకుండా శారీరక, మానసిక వ్యాయామాలు చేయాలి. ఇలా చేస్తే జీవితంలో నాణ్యత కూడా పెరుగుతుంది. ధ్యానం వల్ల నిద్ర కూడా గాఢంగా పడుతుంది. దీంతో మేధో సామర్థ్యం పెరుగుతుంది. ఇవి మాత్రమే కాదు%౯% ఆహారం తినడాన్నీ ఓ ధ్యానంలాగే పూర్తిచేయాలి. ఆహారం రుచి, రంగు, వాసనను ముద్దముద్దలో ఆస్వాదిస్తూ తినాలి. జీవితం అంటే గమ్యం కాదు ప్రయాణం అని గుర్తుంచుకోవాలి. దీన్ని గుర్తిస్తే చాలు జీవితయాత్ర ఆనందంగా, ఆరోగ్యకరంగా సాగిపోతుంది. ఈ క్రమంలో ధ్యానం, యోగా లాంటివి తమవంతు సాయం చేస్తాయి. ధ్యానం కోసం ఎవరైనా అనుభవజ్ఞుల దగ్గర శిక్షణ తీసుకోవడం మర్చిపోవద్దు. ఎలా చేయాలి? మొదట్లో ఐదు పది నిమిషాలతో మొదలుపెట్టి ధ్యానం చేసే సమయాన్ని పెంచుతూ పోవాలి. ఎవరి అవసరాన్ని బట్టి వారు ఎంత సమయం ధ్యానం చేయాలనేది నిర్ణయించుకోవాలి. ఐదు నిమిషాల నుంచి అరగంటపాటు ఓ నిశ్శబ్ద ప్రదేశంలో బయటి ప్రపంచం ప్రభావం లేకుండా ధ్యానం చేయడం మంచిది. ధ్యానం చేసేటప్పుడు పద్మాసనం లాంటి సంప్రదాయ భంగిమలు మంచివి. లేదంటే మీకు తగినట్టుగా, ఉపశమనం కలిగించే భంగిమ ఏదైనా ఎంచుకోవచ్చు. కుర్చీలో కూర్చొని, పడుకొని కూడా ధ్యానంలోకి

### వెళ్లిపోవచ్చు.

ధ్యానం అనేది మానసిక, శారీరక ఆరోగ్యానికి హామీనిస్తుంది. అయితే అనారోగ్యంగా ఉన్నప్పుడు సంబంధిత వైద్యుణ్ని కలిసి తగిన చికిత్స తీసుకోవాలి. అంతే తప్ప ధ్యానం మాత్రమే రోగాలను తగ్గించదు.

## రూ.6999లకే మోటో
# జీ 05 స్మార్ట్ ఫోన్ ఇవీ స్పెషికేషన్స్



ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ మోటరోలా తన మోటో జీ05 ఫోన్‌ను భారత్ మార్కెట్లో మంగళవారం ఆవిష్కరించింది. మీడియాటెక్ హెలియో జీ68 ఎస్వోసీ ప్రాసఎసర్ ఉంటుది. 18వాట్ల వైర్డ్ చార్జింగ్ మద్దతుతో 5200 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంటుంది. 50 –మెగా పిక్సెల్స్ మెయిన్ కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ చేయడానికి 8– మెగాపిక్సెల్ కెమెరా ఉంటుంది. మోటో జీ05 ఫోన్ 4జీబీ ర్యామ్ విత్ 64 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.6,999లకు సొంతం చేసుకోవచ్చు. ఫ్లిప్‌కార్ట్, మోటరోలాఇండియా. వెబ్ సైట్ ద్వారా సొంతం చేసుకోవచ్చు. ఈ నెల 13 నుంచి ఆఫ్‌లైన్ రిటైల్ స్టోర్లలో లభిస్తాయి. ఫారెస్ట్ గ్రీన్, ఫ్లేమ్ రెడ్ కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. రిలయన్స్ జియో యూజర్లు కొనుగోలు చేస్తే రూ.2,000 క్యాష్ బ్యాక్, రూ.3000 వరకూ అదనపు ఓచర్ బెనిఫిట్లు, జియో యూజర్లు రూ.449 ప్రీపెయిడ్ ప్లాన్ పొందొచ్చు. మోటో జీ05 ఫోన్ 90 హెర్ట్జ్ రీఫ్రెష్ రేటు, 1000 నిట్స్ పీక్ బ్రైట్ నెస్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ ప్రొటెక్షన్ ఉంటాయి. మీడియాటెక్ హెలియో జీ81 ఎక్స్‌ట్రీమ్ ఎస్వోసీపై పని చేస్తుంది. వర్చువల్ ర్యామ్ మరో 12 జీబీ పొడిగించుకోవచ్చు. కానీ ఫోన్ స్టోరేజీ మైక్రో ఎస్డీ కార్డు సాయంతో ఒక టిగా బైట్ వరకూ పెంచుకోవచ్చు.ఆండ్రాయిడ్ 15 బేస్డ్ హెల్లో యూఐ స్కిన్ వర్షన్ పై పని చేస్తుందీ ఫోన్. మోటో జీ05 ఫోన్ 90 హెర్ట్జ్ రీఫ్రెష్ రేటుతోపాటు 1000 నిట్స్ పీక్ బ్రైట్ నెస్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 3 ప్రొటెక్షన్‌తోపాటు 6.67 అంగుళాల హెచ్‌డీం (720ఐ1612 పిక్సెల్స్) ఎల్‌సీడీ స్క్రిన్ ఉంటుంది. 50– మెగా పిక్సెల్ మెయిన్ రేర్ కెమెరా విత్ క్వాడ్ పిక్సెల్ టెక్నాలజీ, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 8– మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటాయి. మోటో జీ05 ఫోన్ 18వాట్ల వైర్డ్ చార్జింగ్ మద్దతుతో 5200 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తుంది. డ్యుయల్ 4జీ ఎల్‌టీఈ, బ్లూటూత్ 5.0, ఎఫ్ఎం రేడియో, జీపీఎస్, ఏ–జీపీఎస్,గ్లోనాస్ గెలీలియో, వై–ఫై, 3.5ఎంఎం ఆడియో జాక్స్, యూఎస్బీ టైప్–సీ పోర్ట్ ఉంటుంది. సెక్యూరిటీకోసం సైడ్ మౌంటెడ్ ఫింగర్ ప్రింట్ సెన్సర్ ఉంటాయి.

# నష్టాలకు బ్రేక్.. స్వల్ప లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు




దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ఎంహెచ్‌పీవీ వైరస్ నేపథ్యంలో నిన్న భారీ నష్టపోయిన సూచీలు మంగళవారం కోలుకున్నాయి. వైరస్‌తో ఎలాంటి ఆందోళనలు పడాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు సూచించిన వేళ.. మార్కెట్లు కాస్త కోలుకున్నాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే.. సెన్సెక్స్ 78,019.80 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ప్రారంభంలోనే 422 పాయింట్లకుపైగా పెరిగింది. ఆ తర్వాత చివరి వరకు మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి. ఇంట్రాడేలో 77,925.09 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 78,452.74 పాయింట్ల గరిష్ఠానికి చేరుకుంది. చివరకు 234.12 పాయింట్ల లాభంతో 78,199.11 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 91.85 పెరిగి.. 23,707.90 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,527 షేర్లు పెరగ్గా.. మరో 1,286 షేర్లు తగ్గుముఖం పట్టాయి. నిఫ్టీలో ఓఎన్‌జీసీ, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, టాటా మోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, ఐషర్ మోటార్స్, హీరో మోటోకార్ప్, ట్రెంట్ నష్టపోయాయి. సెక్టార్లలో ఐటి మినహా, ఆయిల్, గ్యాస్, రియాల్టీ, ఎనర్జీ, బ్యాంక్, మెటల్, ఫార్మా సూచీలు 0.5 నుంచి ఒకశాతం వరకు లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.7 శాతం, బీఎస్ఈ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 1.7 శాతం వరకు పెరిగాయి..

# 80 వేల దిగువకు పుత్తడి



బంగారం ధరలు శాంతించాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర 80 వేల దిగువకు పడిపోయింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర సోమవారం ఒకేరోజు రూ.700 తగ్గి రూ.79 వేలకు తగ్గినట్లు ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. కానీ, వెండి మాత్రం రూ.300 పెరిగి రూ.90,700గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర స్వల్పంగా పెరిగి 2,659.60 డాలర్లకు చేరుకోగా, వెండి 30 డాలర్ల వద్ద కొనసాగుతున్నది.

# ఆర్బీఐ చేతికి 8 టన్నుల గోల్డ్



వివిధ దేశాల్లోని కేంద్రబ్యాంకులు వ్యూహాత్మకంగా పసిడి నిల్వలను పెంచుకుంటున్నాయి. గతేడాది నవంబర్ నెలలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంక్‌లు 53 టన్నుల గోల్డ్‌ను కొనుగోలు చేశాయి. దీంట్లో రిజర్వుబ్యాంక్ 8 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసినట్లు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజాగా వెల్లడించింది. యుద్ధాలు, అధిక ద్రవ్యోల్బణం, ఇతర సవాళ్లను అధిగమించడానికి ఆయా సెంట్రల్ బ్యాంకులను పసిడి నిల్వలను పెంచుకోవడానికి అధికప్రాధాన్యతనిస్తున్నాయి.

# ఇక వెండి ఆభరణాలపై కూడా హాల్‌మార్కింగ్!

### ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న కేంద్రం



వెండిపై కూడా హాల్‌మార్కింగ్‌కు సిద్ధమవుతున్నది కేంద్ర ప్రభుత్వం. ఇప్పటికే బంగారు, ఆభరణాలపై హాల్‌మార్కింగ్ విజయవంతంగా పూర్తికావడంతో కన్స్యూమర్ల నుంచి వస్తున్న డిమాండ్‌తో వెండితోపాటు వెండి కళాఖండాలపై కూడా హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేయాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. దీంతో వీటిపై కూడా హాల్‌మార్కింగ్‌ను బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) అమలు చేయాలని కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోష్ సూచించారు. వినియోగదారుల నుంచి డిమాండ్ అధికంగా వస్తున్నదని, దీనిని వెంటనే అమలులోకి తేవాలని 78వ బీఐఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి వెల్లడించారు. ఇప్పటికే ఈ దిశగా పనులు ప్రారంభమయ్యాయని, బీఐఎస్ ద్వారా వాటాదారులతో సంప్రదింపులు, సాధ్యాసాధ్యాలపై పరిశీలించిన తర్వాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని మంత్రి వ్యాఖ్యానించారు. వెండిపై హాల్‌మార్కింగ్‌పై వాటాదారుల నుంచి, అటు కన్స్యూమర్, ఆర్నమెంట్ డీలర్ల నుంచి సమాచారాన్ని సేకరించాలని బీఐఎస్‌కు మంత్రి సూచించారు. దేశవ్యాప్తంగా అమ్ముడవుతున్న ఆభరణాల్లో 90 శాతం హాల్‌మార్కింగ్ కలిగినవని, 44.28 కోట్ల బంగారు ఆభరణాలు హాల్‌మార్కింగ్‌తో తయారైనవి అమ్ముడయ్యాయని మంత్రి చెప్పారు. దీనిపై బీఐఎస్ డైరెక్టర్ జనరల్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ..వచ్చే మూడు నుంచి ఆరు నెలల్లో వెండిపై హాల్‌మార్కింగ్‌ను అమలులోకి తేవడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. వెండి నాణ్యతను గుర్తించే విధానంపై ఇప్పటికే పలుదఫాలుగా చర్చలు జరిపినట్లు, ఆరు డిజిట్ అల్ఫాన్యూమెరిక్ కోడ్ కలిగిన నంబర్‌ను ప్రింటింగ్ వేసి ఇవ్వనున్నట్లు చెప్పారు. జూన్ 2021లో ప్రవేశపెట్టిన గోల్డ్ హాల్‌మార్కింగ్ విజయవంతంగా అమలు చేయబడుతున్నదని, ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 361 జిల్లాలను కవర్ చేయగలిగామన్నారు.

# మారుతి కార్లపై 2 లక్షల రాయితీ




### ఫ్రాంక్స్, బాలెనో, జిమ్నీ, విటారాలపై ఈ డిస్కౌంట్లు

కార్ల తయారీలో అగ్రగామి సంస్థ మారుతి సుజుకీ కొనుగోలుదారులకు శుభవార్తను అందించింది. ఒకవైపు ధరలు పెంచుతూనే మరోవైపు ఎంపిక చేసిన మాడళ్లపై ప్రత్యేక రాయితీలను ప్రకటించింది. నూతన సంవత్సరంలో నెక్సా షోరూంలో పలు మాడళ్లను కొనుగోలు చేసిన వారికి రూ.2.5 లక్షల వరకు రాయితీ పొందవచ్చునని సూచించింది. ప్రీమియం వాహనాలను విక్రయించడానికి ఈ ప్రత్యేక షోరూంలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వీటిలో ఫ్రాంక్స్, బాలెనో, జిమ్నీ, విటారా మాడళ్లు ఉన్నాయి. వీటి వివరాలు..

**ఎక్స్‌ఎల్6పై రూ.50 వేల రాయితీ**

ప్రీమియం మల్టీపర్పస్ వాహనమైన ఎక్స్‌ఎల్6ని రూ.50 వేల వరకు తగ్గింపు ధరతో విక్రయిస్తున్నది. దీంట్లో స్క్రాపింగ్ బోనస్ కింద రూ.25 వేలు, ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ.20 వేలు ఇస్తున్నది. ఈ ఆఫర్లు పెట్రోల్, సీఎన్‌జీ మాడళ్లకు మాత్రమే వర్తించనున్నదని, డీజిల్ వాహనానికి వర్తించని స్పష్టంచేసింది.

**బాలెనోపై 90 వేల డిస్కౌంట్**

బాలెనో కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి సంస్థ ఏకంగా ఈ వాహనంపై రూ.90 వేల వరకు డిస్కౌంట్ కల్పిస్తున్నది. దీంట్లో కన్స్యూమర్ డిస్కౌంట్ కింద రూ.40 వేలు, ఇతర రాయితీల కింద మరో రూ.20 వేలు అందిస్తున్నది. అలాగే ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ.15 వేలు, స్క్రాపింగ్ బోనస్ కింద రూ.20 వేలు ఇస్తున్నది.

**ఇగ్నిస్‌పై 90 వేలు..**

ఇగ్నిస్ మాడల్‌పై రూ.75 వేల వరకు డిస్కౌంట్ ఇస్తున్నది. దీంట్లో కన్స్యూమర్ డిస్కౌంట్ కింద రూ.45 వేలు, ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ.15 వేలు, స్క్రాపింగ్ బోనస్ కింద రూ.30 వేలు, కార్పొరేట్ రాయితీ కింద మరో రూ.2,100 రాయితీ ఇస్తున్నది.

**గ్రాండ్ విటారాపై 1.18 లక్షలు**

గ్రాండ్ విటారాపై రూ.1.18 లక్షల వరకు డిస్కౌంట్ కల్పిస్తున్నది సంస్థ. దీంట్లో కన్స్యూమర్ డిస్కౌంట్ కింద రూ.65 వేలు, స్క్రాపింగ్ బోనస్ కింద రూ.50 వేలు, కార్పొరేట్ బోనస్ కింద మరో రూ.3,100 ఇస్తున్నది.

**జిమ్నీపై రూ.1.9 లక్షలు**

జిమ్నీ మాడల్‌పై రూ.1.9 లక్షల వరకు తగ్గింపు ధరతో మారుతి విక్రయిస్తున్నది.

**ఇన్విక్టోపై రూ.2.15 లక్షలు రాయితీ**

మారుతి మాడళ్లలో అత్యధికంగా ఇన్విక్టో మాడల్‌పై రూ. 2.15 లక్షల వరకు రాయితీ ఇస్తున్నది. దీంట్లో ఎక్స్ఛేంజ్ బోనస్ కింద లక్ష రూపాయలు డిస్కౌంట్ కల్పించిన సంస్థ..స్క్రాపింగ్ బోనస్ కింద మరో లక్ష రూపాయలు రాయితీ కల్పిస్తున్నది.

### భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్లు
### సెన్సెక్స్ 1,258, నిఫ్టీ 388 పాయింట్ల పతనం

# మార్కెట్లను ముంచిన వైరస్

దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. దేశంలో హెచ్ఎంపీవీ కేసులు నమోదుకావడంతో సూచీలు అమ్మకాలు ఒత్తిడికి గురయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కార్పొరేట్లు నిరుత్సాహక ఆర్థిక ఫలితాలు ప్రకటించే అవకాశాలుండటంతోపాటు ఆసియా మార్కెట్ల నుంచి వచ్చిన బలహీన సంకేతాలకు తోడు, విదేశీ మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడం సూచీల పతనానికి ఆజ్యంపోశాయి. వరుసగా రెండోరోజు 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 78 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. ఇంట్రాడేలో 1,441 పాయింట్లు నష్టపోయి 77,781 పాయింట్ల వద్దకు చేరుకున్న సూచీ చివరకు ఇదే ట్రెండ్‌ను కొనసాగించింది. మార్కెట్ ముగిసే సమయానికి 1,258.12 పాయింట్లు లేదా 1.59 శాతం నష్టపోయి 77,964.99 వద్ద ముగిసింది. మరోసూచీ నిఫ్టీ కూడా 24 వేల కీలక మైలురాయిని కోల్పోయింది. చివరకు 388.70 పాయింట్లు లేదా 1.62 శాతం నష్టపోయి 23,616.05 వద్ద స్థిరపడింది.

**తొలిరోజే స్టాండర్డ్ గ్లాస్ జోరు**

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ ఐపీవో తొలిరోజే మదుపరుల నుంచి విశేష స్పందన లభించింది. ప్రారంభించిన నిమిషాల్లోనే కంపెనీ షేర్లు అమ్ముడైపోగా, తొలిరోజు 13.32 రెట్లు అధికంగా బిడ్డింగ్ దాఖలయ్యాయి. ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో 2,08,29,567 షేర్లను అమ్మకానికి పెట్టగా, వీటికి 27,75,00,862 షేర్ల బిడ్డింగ్ దాఖల్యయాయి.

టాటా స్టీల్, ఎన్‌టీపీసీ, కొటక్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, అదానీపోర్ట్స్‌లు మూడు శాతానికి పైగా నష్టపోయాయి.

వీటితోపాటు జొమాటో, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐటీసీ, రిలయన్స్, మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, నెస్లె, ఎస్బీఐ, యాక్సిస్ బ్యాంక్, టాటామోటార్స్, మారుతి, ఎల్అండ్‌టీ, హెచ్‌యూఎల్, బజాజ్ ఫైనాన్స్, ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, సన్‌ఫార్మా, టీసీఎస్, ఐసీఐసీఐ, ఇన్ఫోసిస్‌లు నష్టపోయాయి.

కేవలం టైటాన్, హెచ్‌సీఎల్‌టెక్నాలజీ షేర్లు మాత్రమే లాభాల్లో ముగిశాయి.

3,474 సూచీలు నష్టపోగా, 656 సూచీలు లాభాల్లో ముగిశాయి. కేవలం 114 షేర్లు యథాతథంగా ట్రేడయ్యాయి.

బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 3.17 శాతం, మిడ్‌క్యాప్ 2.44 శాతం నష్టపోయాయి.

రంగాలవారీగా చూస్తే యుటిలిటీ అత్యధికంగా 4.16 శాతం నష్టపోగా, పవర్ 3.73 శాతం, సర్వీసెస్ 3.45 శాతం, మెటల్ 3.15 శాతం, ఆయిల్అండ్‌గ్యాస్ 3.15 శాతం, ఎనర్జీ 3.03 శాతం, ఇండస్ట్రియల్స్ 2.97 శాతం, కమోడిటీస్ 2.74 శాతం చొప్పున పతనం చెందాయి.

ఎఫ్ఐఐలు రూ.2,575 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.

పతనానికి కారణాలు ఇవే..

హ్యూమన్ మెటానియా వైరస్ కేసులు భారత్‌లోనూ నమోదు కావడం

దేశీయ ఈక్విటీ మార్కెట్లలో ఎఫ్ఐఐల అమ్మకాల కొనసాగుతుండటం.

ఆసియా మార్కెట్ల నుంచి వచ్చిన బలహీన సంకేతాలు



మూడో త్రైమాసికంలో కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలు


**11 లక్షల కోట్ల సంపద ఆవిరి**

స్టాక్ మార్కెట్ల భారీ నష్టాలతో మదుపరులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. గత కొన్ని రోజులుగా లాభాలతో కళకళలాడిన మదుపరుల్లో ఉత్సాహం వైరస్ దెబ్బకు ఆవిరైపోయింది. దీంతో అమ్మకాల బటన్ నొక్కడంతో సోమవారం ఒకేరోజు 10 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయారు. సూచీల భారీనష్టంతో బీఎస్ఈలో లిట్కస్టైన సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.10,98,723.54 కోట్లు కరిగిపోయి రూ.4,38,79,406.58 కోట్లు(5.11 ట్రిలియన్ డాలర్లు) పడిపోయింది.

# వెయ్యి కోట్లతో చిప్‌ల తయారీ కేంద్రం

### రాష్ట్రంలో ఏర్పాటుచేయడానికి ముందుకొచ్చిన పీటీడబ్ల్యూ

సెమీకండక్టర్ పరిశ్రమలకు అవసరమైన విడిభాగాలు, ఆటోమేషన్ పరికరాల తయారీ సంస్థ పీటీడబ్ల్యూ..హైదరాబాద్‌లో రూ.1,000 కోట్ల పెట్టుబడితో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ భారీ పెట్టుబడితో ఏర్పాటు చేయతలపెట్టిన ఉత్పాదక కేంద్రం మొదటి దశకు తాము సిద్ధంగా ఉన్నట్లు పీటీడబ్ల్యూ ఆసియా విభాగ ఎండీ టార్ స్టెన్ సెయ్ ఫ్రైడ్ పేర్కొన్నారు. ఈ యూనిట్ ఏర్పాటునకు సంబంధించి సోమవారం సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో ప్రత్యేకంగా సమావేశమై వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సెమీ కండక్టర్(చిప్)ల తయారీ, దాని అనుబంధ పరిశ్రమలకు అనుకూల వాతావరణం హైదరాబాద్‌లో ఉన్నదని వెల్లడించారు. పరిశ్రమ ఏర్పాటు చేసే పక్షంలో ప్రభుత్వ విధానాల ప్రకారం రాయితీలు, ప్రోత్సాహకాలు అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ఇకడ నైపుణ్యం కలిగిన మానవ వనరులకు కొదవ లేదని, సరైన ప్రతిపాదనలతో వస్తే తమ ఆహ్వానం ఎప్పటికీ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో సంస్థ స్థానిక భాగస్వామి బార్ ట్రానిక్స్ ఎండీ విద్యాసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



printed , published and owned by DR.B.ANILKUMAR ,@ 407 THARNAKA , HYDERABAD , Telangana state.published at DAIWIK PUBLICATIONS pvt.ltd.printed at SNEHITHA PRINTERS H.NO : 2-6 , Warangal Dist.Telangana state ,EDITOR DR.B.ANILKUMAR ,RNI NO TELTEL/2021/ 81079 , cell : 7702866885 ,vijethatelugudaily@gmail.com